# జనబలం

ప్రజలే ప్రభువులు

అక్టోబర్ 2026 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-



## 'రెండు మహానగరాల' కథలా నేటి భారతం

## చట్టసభల్లో చర్చలు దానంపై ఫిరాయింపు వేటు

## లోక్‌సత్తా 2.0

## అయిదు అంశాల ఎజెండా

## ఎన్నికల సంస్కరణల భారం ప్రజలదేనా?

# ఏఐ యుగంలో మరింత విలువైన గాంధీ ఆలోచనలు





గాంధీ కూడా మనలాంటి మనిషే. కానీ నిజాన్ని అనుసరించారు. చెప్పింది ఆచరించి చూపారు. సమాజం కోసం అపార కష్టాన్ని అవకాశంగా భావించి అందిపుచ్చుకున్నారు. అందుకుతగ్గ నాయకత్వం అందించటానికి తనని తాను నిరంతరం సంస్కరించుకున్నారు. అందువల్లే మహామనీషి, మహాత్ముడయ్యారు. స్వతంత్రానికి గాంధీ చెప్పిన నిర్వచనం.. ఆరోజుల్లో కంటే ఈవేళ్టి ఏఐ యుగంలో మరింత వర్తిస్తుంది. 'చిట్టచివరి పౌరునికి కూడా తన జీవితం మీద తనకు సాధికారత లభించి, అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించగలిగి, పరిష్కారాన్ని సాధించగలిగినప్పుడు.. నిజమైన స్వరాజ్యం లభించినట్లు' అని నిర్వచించారు. అదేవిధంగా, పర్యావరణం విలువను మొట్టమొదట చెప్పిన నేత గాంధీజీ. ఇటీవల రాజకీయాల్లో ఆసక్తిని ప్రదర్శిస్తున్న జెన్ జడ్ యువత కూడా.. గాంధీ, అంబేద్కర్‌లను ఆదర్శంగా తీసుకోవటం సరైన మార్గంలో ప్రయాణిస్తున్నారనటానికి సంకేతం. కానీ గాంధీ అంటే ఆహార్యం, కళ్లజోడు, విగ్రహాలు కాదు.

గాంధీ చెప్పిన నిజమైన స్వరాజ్యం కోసం ఈవేళ ఒక సమాజంగా, ప్రభుత్వంగా మనం చేయవలసింది:

**+ విధాన సంస్కరణలు:**

యువత అత్యధికంగా ఉన్న మన దేశంలో, అందరికీ ఉపాధి అవకాశాలను అందించే నాణ్యమైన విద్యను పాఠశాల స్థాయి నుండి అందాలి. వారు తక్కువ వ్యయంతో ఎక్కువ ఉత్పాదకత సాధించేలా, నైపుణ్యాలను ఎప్పటికప్పుడు ఒత్తిడిలేకుండా మార్చుకోగలిగేలా మంచి ప్రమాణాల ఆరోగ్యం; మహిళలు కూడా ఉపాధిలో భాగస్వాములు కాగలిగేలా చట్టబద్ధపాలన; పరిష్కారంలో భాగమవుతూ పాలనా విధానాల గురించి తెలుసుకోగలిగేలా స్థానిక ప్రభుత్వాల సాధికారత; వ్యవసాయాధారిత, గ్రామీణ, అసంఘటిత రంగంలో అల్పాదాయాల నుండి మధ్యతరగతి ఆదాయాల స్థాయికి ఎదగగలిగేలా గ్రామాల మధ్య ఆర్థికకేంద్రాలుగా చిన్న పట్టణాల అభివృద్ధి అత్యంత కీలకమైనవి.

**+ పర్యావరణహితం:**

సురక్షిత మంచినీళ్లు; పారిశుద్ధ్యం; కాలుష్యరహిత పరిసరాలు; 100% పునరుత్పాదక ఇంధనం; ఎక్కువమంది ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించేలా సంస్థాగత ఏర్పాట్లు; ప్రకృతి వనరుల్ని అవసరానికి మించి ఉపయోగించకపోవటం; వనరుల రీసైక్లింగ్ వినియోగాన్ని ఆర్థిక వ్యవస్థలో భాగం చేయటం

**+ డబ్బు సంపాదన:**

ప్రతి వ్యక్తీ సమాజానికి ప్రయోజనం చేకూరుస్తూ ఉపాధిని పొందటం లేదా వ్యాపారం చేయటం; వీలైనంత ఎక్కువ సంపాదించటం; ఇందుకోసం ప్రభుత్వం పెట్టుబడుల్ని ప్రోత్సహించటం, సంక్షేమం-అభివృద్ధి మధ్య సమతూకంతో ఆర్థిక క్రమశిక్షణ పాటించటం; ప్రజలు తమ సంపాదనలో అవసరానికి మించిన ఆదాయాన్ని తిరిగి సమాజం మీదే ఉత్పాదక పెట్టుబడిగా పెట్టి ధర్మకర్తల్లా వ్యవహరించటం

**+ పౌర జీవనం:**

కనీసం 10% వనరుల్ని, సమయాన్ని పౌరుల్లో ప్రతి ఒక్కరూ సమాజానికి కేటాయించటం; మనకు న్యాయం జరగటం కోసం ముందు ఇతరులకు న్యాయం అందించటం; హింసకు పాల్పడకుండా 'క్రియేటివ్ టెన్షన్'తో మధ్యేమార్గంలో అసమ్మతి, నిరసనల్ని వ్యక్తం చేయటం; బంగారం కొనుగోళ్లు తగ్గించి విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయటం; పౌష్టిక, పరిమిత ఆహారం; సహజ ఆకర్షణీయతను ప్రతిఫలించే సందర్భోచిత, నిరాడంబర ఆహార్యం; దేవుడ్ని, మతాన్ని నమ్మినా నమ్మకున్నా.. ఆ విశ్వాసాన్ని వ్యక్తిగతానికే పరిమితం గావించుకోవటం; వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని శాస్త్రీయంగా, హేతుబద్ధ ఆలోచన, సాంకేతికతతో సద్వినియోగం గావించుకోవటం; మన నమ్మిన అంశం తప్పు అని తేలినప్పుడు మార్చుకోవటం

**+ రాజకీయాలు:**

మన జీవితాల్లో ప్రతి పరిణామాన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావితం చేసే రంగం రాజకీయం. కానీ రాజ్యాధికారం పౌరుల సాధికారత అనే లక్ష్యానికి మార్గమే తప్ప లక్ష్యం కాదు. అధికారం కోసం చేసే రాజకీయంలోనూ నైతిక (రాజ్యాంగబద్ధ)విలువల్ని తప్పనిసరిగా పాటించాలి

అక్టోబర్ 2 - గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిలకు ఘననివాళులతో,

-డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

అక్టోబర్ 2026

సంపుటి 28 సంచిక 10

## జనబలం చందా రుసుము వివరాలు

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |

సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్




'రెండు మహానగరాల కథ'ను తలపిస్తున్న నేటి భారతం 6

చట్టసభలను అపహాస్యం చేస్తూ కూర్చున్న కొమ్మనే నరుక్కుంటున్న పార్టీలు 8

చట్టాన్ని పెద్దమనుషులే ఉల్లంఘిస్తే ఎలా? 12

అమాత్యుల ఆదాయపు పన్ను భారం ప్రభుత్వంపై ఎందుకు? 14

లోక్‌సత్తా 2.0: ప్రజాస్వామ్యం పిలుస్తోంది, 'థాట్ లీడర్‌షిప్' అవకాశాన్ని వినియోగించుకోండి 15

ఓట్ల కొనుగోలుపై చంద్రబాబు బహిరంగ ఒప్పుకోలు.. ఎన్నికల సంస్కరణల బాధ్యత ప్రజలదా? ప్రభుత్వాలు, పార్టీలదా? 21

వాస్తవాల్ని తెలియజేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే 23

ట్రంప్ బంపర్ ఆఫర్.. భారత్ అవలక్షణాన్ని అనుకరిస్తున్నారా? 27

అస్సాంలో ఇప్పటికీ కొనసాగుతున్న మహాత్ముడి సామరస్య స్ఫూర్తి 30

గ్రామసభల పట్ల యువత అనాసక్తత.. రెఫరెండం పద్ధతిని సంధానించటం బెటర్ 31

కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

# 'సర్' పై ఆందోళనలకు ముగింపు దొరికేనా ?

సంపాదకీయం

మొన్న నీట్ పరీక్ష అవకతవకల గురించి, నేడు 'సర్' ప్రక్రియలో లోపాల గురించి ప్రశ్నించాల్సిందే. ఆ అవకత వకలను సరి చేయడానికి రాజకీయ పార్టీలైనా, పౌర సమాజమైనా స్పందించి సరైన పరిష్కారాలను సూచించాలి. ప్రభుత్వం ఆ సూచనలను పట్టించుకోకపోతే ప్రభుత్వం మీద పదునైన విమర్శలు చేయాల్సిందే. కానీ వ్యవస్థల వైఫల్యాన్ని వ్యక్తులకు అంటకట్టి ఆ వ్యక్తులను కించపరుస్తూ పరుష పదజాలాలను వాడటం సమంజసం కాదు.

ఒక పక్షం ప్రతిపక్షంగా ఉన్నపుడు ఒకరకంగా, అధికారంలో ఉన్నపుడు మరో రకంగా వ్యవహరించడం మన దేశంలో ఆనవాయితీగా మారిపోయింది. భారతదేశానికి స్వతంత్రం వచ్చినప్పటి నుండి దేశంలో సంకీర్ణ ప్రభుత్వాలతో కలిపి కేంద్రంలో కాంగ్రెస్ సుమారు అరవై సంవత్సరాలు పాలిస్తే మరొక ఇరవై ఏళ్లు జనతా ప్రయోగంతో పాటు బీజేపీ పరిపాలించింది.

జాతీయస్థాయిలో తీసుకున్న మూడు నిర్ణయాల గురించి మనం గుర్తు చేసుకోవాలి. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను అప్పటి ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కానీ దాన్ని అప్పట్లో బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈవీఎంలు ఎన్నికల ఫ్రాడ్ అంటూ వాదించింది. ఈరోజు ఈవీఎంలే ముద్దు అని బీజేపీ అంటున్నది. కాంగ్రెస్ హయాంలో నందన్ నిలేకనీ సారథ్యంలో యూనిక్ ఐడీ అథారిటీ ఏర్పాటు చేసి ఆధార్ కార్డును ప్రవేశ పెట్టింది. అది పౌరుల గోప్యతకు భంగం కలిగిస్తుందని గట్టిగా వాదించి వ్యతిరేకించింది బీజేపీ. ఇవాళ డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్‌కు ఆధార్ కార్డు అద్భుతంగా పనికి వస్తుందని బీజేపీ చెబుతున్నది.

గూడ్స్ సర్వీస్ టాక్స్(జీఎస్టీ) ప్రవేశపెడతామని ప్రతిపాదించింది కాంగ్రెస్ పార్టీ. కానీ అప్పట్లో రాష్ట్రాలపై కేంద్రం పెత్తనంగా జీఎస్టీని అభివర్ణించిన బీజేపీ దానిని పూర్తిగా వ్యతిరేకించింది. ఆ తర్వాత తానే జీఎస్టీని ప్రవేశపెట్టింది. ఈ మూడు విషయాలలో అధికార ప్రతిపక్ష పార్టీలు తాము అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొక మాట చెప్పాయని తెలుస్తూనే ఉంది. ఈ రెండు రాజకీయ పక్షాల ద్వంద్వ వైఖరికి ఈ ఉదాహరణలు చాలు.

'సర్' ప్రక్రియలో మంచి ఎంత చెడ్డ ఎంత జరుగుతున్న లోపాలు ఏమిటి ? వీటికి పరిష్కారాలేమిటి? అనే విషయం చర్చించకుండా కేవలం జ్ఞానేష్‌కుమార్ రాజీనామా మాత్రమే డిమాండ్ చేస్తూ అటు సీజేపీ ఇటు కాంగ్రెస్ మిత్రపక్షాలు చేస్తున్న ఆందోళనలు పరిష్కారానికి దారి చూపేవిగా లేవు. అర్హుడైన ఒక్క ఓటరు కూడా పేరు ఓటర్ల జాబితా నుంచి తొలగించకూడదనేది వాస్తవం. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఇతర పక్షాలు ఓట్ చోరీ నినాదం నుండి మొదలుపెట్టి సీట్ చోరీ వరకు వెళ్తున్నాయి. అధికారపక్షం మీద ప్రతిపక్షాలు, ప్రతిపక్షం మీద అధికారపక్షం నిందలు వేసుకోవడం సహజమే. తమను విమర్శిస్తున్న ప్రతిపక్షాలన్నీ దేశద్రోహులే అని అధికార పక్షాలు ఎప్పుడు అంటుంటాయి. ఇది కూడా సహజమే. కానీ అసలు వాస్తవం ప్రజలు తెలుసుకునేలా పార్టీలకు అతీతంగా వివరంగా చెప్పాల్సిన అవసరం ఉంది. అధికార ప్రతిపక్షాల వాదనల రణగొణ ధ్వనులలో అసలు వాస్తవాలు మరుగున పడుతున్నాయి.

'సర్' విషయమే తీసుకుందాం. చనిపోయిన వాళ్ళ ఓట్లు, ఊళ్లో లేని వాళ్ళు, రెండు మూడు చోట్ల ఓటర్ల జాబితాలో పేర్లు నమోదై ఉన్న వారు..ఈ మూడు కేటగిరీలకు చెందిన వారి పేర్లను అనర్హుల జాబితాలో చేర్చి తప్పకుండా తీసేయాల్సిందే. 'సర్' ప్రక్రియలో జరుగుతున్న లోపాలను సుప్రీంకోర్టు సహా పౌర సమాజం చాలాసార్లు ఎండగట్టింది. కానీ అవే పొరపాట్లు మళ్లీ మళ్లీ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా చేస్తున్నది. 2002 బేస్ గా ఓటరు మ్యాపింగ్ తీసుకొని 'సర్' ప్రక్రియ జరపాలా? లేదా ? అనే వాదన ఎవరూ చేయడం లేదు. అలాగే ఓటర్లకు నోటీసులు ఇచ్చే విధానం నుంచి మొదలుకొని ఓటర్ల తొలగింపు వరకు జరుగుతున్న ప్రక్రియలో ఉన్న లోపాలు అటు సుప్రీంకోర్టు , ఇటు పౌర సమాజం ఎప్పటికప్పుడు ఎండగడుతూనే ఉంది. కానీ జ్ఞానేష్ కుమార్‌ను వ్యక్తిగా టార్గెట్ చేసుకొని ఆయన రాజీనామాకు డిమాండ్ చేయడం దగ్గరే పీటముడి పడింది. వ్యక్తులు రాజీనామా చేసేస్తే సమస్య పరిష్కారం అయినట్లేనా?

ఆధార్ కార్డు నుంచి పాస్ పోర్టు వరకూ పౌరుల దగ్గర ఉన్న ప్రభుత్వం ధ్రువీకరించిన ఆధారాల చెల్లుబాటు విషయంలో కోర్టులే పరస్పర విరుద్ధమైన తీర్పులిచ్చాయి. సుప్రీంకోర్టు కూడా అలాంటి ఆదేశాలు చాలా ఇచ్చింది. ఇలాంటి తీర్పులు ఎలక్షన్ కమిషన్ నిర్ణయాలకు ఆధారంగా పనికి వచ్చాయి.

'సర్' ప్రక్రియను పూర్తిగా నిలిపివేయాలని ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తయిన రాష్ట్రాలలో 13 కోట్ల 60 లక్షల ఓట్లను పునరుద్ధరించాలని ఆందోళనాకారులు డిమాండ్లు చేస్తున్నారు. వీటితోపాటు ప్రతిపక్షాలు ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో 2023 కంటే ముందు ఉన్న చట్టం రావాలని కోరుతున్నాయి. అసలు 2023 కంటే ముందు ఎన్నికల కమిషనర్ల నియామకానికి ఒక చట్టం అంటూ లేనే లేదు.

రాజ్యాంగంలో ఎన్నికల కమిషన్‌ను కేంద్ర మంత్రిమండలి సిఫార్సు మేరకు రాష్ట్రపతి నియమిస్తారని మాత్రమే ఉంది. అది కూడా నియామక ప్రక్రియపై పార్లమెంటు చట్టం చేసేవరకూ తాత్కాలిక ఏర్పాటుగా మాత్రమే రాజ్యాంగం భావిం చింది. కానీ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నాలుగు దశాబ్దాలపాటు ఎన్నికల కమిషన్ నియామక ప్రక్రియ గురించిన చర్చే రాలేదు! ఎన్నికల కమిషన్ ఏక సభ్య కమిషన్‌గా ఉన్నంతకాలం దాని గురించి వివాదాలు బయటికి రాలేదు. కానీ 1989 లో ఏకసభ్య కమిషన్‌ను త్రిసభ్య కమిషన్‌గా మారుస్తూ అప్పటి రాజీవ్‌గాంధీ ప్రభుత్వ నిర్ణయం మేరకు రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీ చేశారు. మరో ఇద్దరు కమిషనర్లు నియమితులు అయ్యారు. అయితే ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వి.పి.సింగ్ ప్రభుత్వం 1990లోనే రాష్ట్రపతి నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకున్నారు. ఇద్దరు కమిషనర్లను తొలగించారు! దానిపై ఒక కమిషనర్ తన తొలగింపును సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు! అయితే కోర్టు ఆయన పిటిషన్‌ను కొట్టేసింది.

ఆ తర్వాత 1991 నాటి చట్టం ద్వారా చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు, మిగిలిన కమిషనర్లకు మధ్య సర్వీసు, హోదా, వేతనాల విషయంలో వ్యత్యాసం చూపుతూ నియమాలు రూపొందించారు. ఇదే సమయంలో ఎన్నికల సంస్కరణల విషయమై ప్రభుత్వం నియమించిన దినేష్ గోస్వామి

కమిటీ తన నివేదికలో ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకానికి ప్రధానమంత్రి తోపాటు ప్రధాన ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా కమిటీ ఏర్పడాలని సూచిం చారు.

ఎన్నికల కమిషనర్ల నియామకం పక్షపాత ధోరణిలో సాగుతోందన్న విమర్శలు పెరిగిపోతున్న తరుణంలో పరిపాలనా సంస్కరణల కమిషన్ ఈ సమస్యపై దృష్టి సారించింది. కమిషన్ 2009లో సమర్పించిన నివేదికలో చీఫ్ ఎన్నికల కమిషనర్, కాగ్, చీఫ్ సమాచార కమిషనర్ , చీఫ్ విజిలెన్స్ కమిషనర్ వంటి రాజ్యాంగ పదవుల నియామకాలు కొలీజియం ద్వారా జరగాలని సిఫార్సు చేసింది. అందులో ప్రధానమంత్రి, లోక్‌సభ స్పీకర్, న్యాయశాఖ మంత్రి, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షనేత, రాజ్యసభ చైర్మన్ సభ్యులుగా ఉండాలని సూచించింది.

ప్రధాన ఎన్నికల అధికారిగా ఎస్.వై.ఖురేషి పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో 2012 జూన్‌లో అప్పటి బీజేపీ పార్లమెంటరీ బోర్డు చైర్మన్ అద్వానీ, అప్పటి ప్రధానమంత్రి మన్‌మోహన్‌సింగ్‌కు రాసిన లేఖలో కొలీజియం వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అందులో ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయశాఖ మంత్రి, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షనేత, రాజ్యసభలో ప్రధాన ప్రతిపక్ష నేత సభ్యులుగా కొలీజియం ఏర్ప డాలని సూచించారు.

ఆ తర్వాత 2015లో ఎన్నికల సంస్కరణలపై లా కమిషన్ ఇచ్చిన నివేదికలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ నియామకానికి ముగ్గురు సభ్యుల కొలీజియం ఉండాలని సిఫార్సు చేసింది. అందులో ప్రధానమంత్రి, ప్రధాన ప్రతిపక్షనేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉండాలని సిఫార్సు చేసింది. ఎన్నికల కమిషనర్ల నియామకాలు, వారి పనితీరు తరచూ వివాదాస్పదం కావడం, తక్కువ పదవీ కాలానికి ఎన్నికల కమిషనర్లు నియమితులు కావడం వంటి కారణాలతో ఎన్నికల కమిషన్ వ్యవహారాలు తరచూ కోర్టులకు వెళ్తూ వచ్చాయి!

ఈ నేపథ్యంలో అలహాబాదు హైకోర్టు న్యాయవాది అనూప్ బరన్‌వాలా 2015 జనవరిలో ఎన్నికల కమిషన్ నియామకంపై పార్లమెంట్ చట్టం ఏదీ లేనందున, ఈవిషయమై సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు! ఈ కేసుపై తీర్పు 2023 లో వచ్చింది!

పార్లమెంటు ఒక చట్టం చేయాల్సిన వ్యవహారంలో అధికారాల విభజన సూత్రాన్ని గౌరవించాలని, అయితే పార్లమెంటు అలాంటి చట్టాన్ని చేసేవరకూ తాత్కాలిక ప్రాతిపదికపై లా కమిషన్ సిఫార్సు మేరకు ముగ్గురు సభ్యుల కొలీజియం ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఆ కొలీజియంలో ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉండాలని చెప్పింది. "ఇది తాత్కాలిక ఏర్పాటు" అనీ "లా కమిషన్ సిఫార్సు మేరకు" అని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన సంగతి గమనంలోకి తీసుకోవాలి.

1989 నుండి 2009 వరకూ జరిగిన చర్చలు అన్నీ ఏక సభ్య కమిషన్ లేదా బహుళ సభ్య కమిషన్, వారి హోదాలు, జీతభత్యాలు, చుట్టూ తిరిగాయి. కార్య నిర్వాహక వర్గం అదుపులో ఎన్నికల కమిషన్ ఉండరాదన్న భావన ఉన్నా దానికి పెద్దగా ఒత్తిడి రాలేదు.

కానీ 2009 నుండి చర్చ ఎన్నికల కమిషన్ నియామక ప్రక్రియ చుట్టూ తిరగడం గమనించవచ్చు! నిష్పాక్షిక ఎన్నికల కమిషన్ ఉండాలన్నదే చర్చలో ప్రధానాంశంగా ముందుకు వచ్చింది.2023లో పార్లమెంట్ ఒకచట్టం చేసింది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ నియామకానికి ముగ్గురు సభ్యుల కొలీజియం ఉండాలని చెప్పింది. అందులో ప్రధానమంత్రి, ప్రధాన ప్రతిపక్షనేత , ప్రధానమంత్రి సిఫార్సు చేసిన ఒక మంత్రి సభ్యులుగా ఉంటారని ఆ చట్టం పేర్కొన్నది! ఎట్టకేలకు రాజ్యాంగం చెప్పిన విధంగా డెబ్బై అయిదేళ్ల తర్వాత పార్లమెంటు ఒక చట్టం చేసింది. కానీ అందులోకి పక్షపాతధోరణి వచ్చి కూచున్నది. దినేష్ గోస్వామి కమిటీ నివేదిక గానీ, రెండవ పరిపాలనా సంస్కరణల కమిషన్ సిఫార్సు గానీ, అద్వానీ లేఖ గానీ, లా కమిషన్ సిఫార్సు గానీ , ఈ చట్టం స్ఫూర్తిలో ప్రతిబింబించక పోవడం విచారకరం!

రాజ్యాంగ నిర్ణాయక సభలో ఆర్టికల్ 324 ను చర్చకు తీసుకున్న సందర్భంలో డా.బి.ఆర్. అంబేద్కర్ ఒక ఆసక్తికరమైన వ్యాఖ్య చేశారు! భావి ఎన్నికల కమిషన్ నిష్పాక్షికతపై సభ్యులు సందేహాలు వ్యక్తం చేయగా దానికి జవాబుగా డా.అంబేద్కర్ ఇలా అన్నారు. "ఎన్నికల కమిషన్ లోకి ఒక తెలివితక్కువ మనిషి , పనికిరాని వ్యక్తి, ఒక మోసగాడు, ప్రభుత్వం చెప్పుచేతల్లో పనిచేసే వ్యక్తి రాకుండా నివారించే రక్షణలు ఇందులో లేకపోవడం నాకు ఆందోళనకరంగానే అనిపిస్తున్నది. రాజ్యాంగం ముసాయిదాలో ఫలానా వ్యక్తిని ఫలానా పదవికి నియమించగూడదనే నిబంధన ఏమీ లేదు. అందువల్ల ఈ విషయాన్ని భావి పార్లమెంటు చేసే చట్టానికి విడిచిపెడదాం" అని ఆయన అన్నారు! ఎన్నికల కమిషన్ కార్యనిర్వాహక వర్గానికి లొంగి పనిచేసేదిగా ఉండరాదని రాజ్యాంగ నిర్ణాయక సభ గట్టిగా భావించింది. అప్పటి భావనల కంటే మెరుగైన సమగ్రమైన చట్టం తేవాల్సిన పార్లమెంటు చివరికి కార్యనిర్వాహకవర్గం చెప్పుచేతల్లో ఉండే వ్యక్తిని నియమించుకునే వెసులుబాటునే చూసుకున్నది.

ప్రస్తుతం 'సర్' ప్రక్రియపై వస్తున్న విమర్శల రీత్యా ఎన్నికల కమిషన్ ఇప్పటికే కొన్ని నివారణా చర్యలు చేపట్టింది. అవి దాంతోపాటు ఓట్లు కోల్పోయిన ఓటర్ల నమోదు అధికారాన్ని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి పునరుద్ధరించాలి. కొత్తగా ఓటరుగా నమోదు చేయడానికి సులువైన ప్రక్రియను అమలు చేయాలి. తాత తండ్రులు ఎవరు అని అడగాల్సిన అవసరం లేదు. నివాస పత్రం ఆధారంగా కొత్తగా ఫామ్ నెంబర్ 6 లో ఓటరు నమోదు చేసుకోవాలి. ఫామ్ 6లో గతంలో నాకు ఎక్కడా ఓటులేదన్న డిక్లరేషన్ పాత ఓటర్లు ఇవ్వాల్సిన అవసరం లేదు. దాన్ని మార్చాలి. అలాగే అకారణంగా తొలగింపునకు గురైన ఓటర్లను జాబితాలో చేర్చే అధికారం కేంద్ర ఎన్నికల కమిషన్‌కు చెందిన ఐటీ విభాగం అధికారికి కాకుండా గతంలో మాదిరి ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి పునరుద్ధరించాలి.

ఓటరు లిస్టుకు ఆధార్ కార్డు లింక్ చేస్తే ఒకే ఆధార్ కార్డు నెంబర్ మీద దేశంలో ఎన్ని ఓట్లు ఉన్నాయి అనేది కూడా తెలుస్తుంది కనుక ఆ వెసులుబాటు కల్పిస్తే డబుల్ ఓటర్ ఎంట్రీ తోపాటు ఇతర సమస్యలు కూడా పరిష్కారమవుతాయి. అయితే అందుకు ఆధార్ కార్డు గుర్తింపు స్థాయిపై సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను సవరించాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా 'సర్' పై జరుగుతున్న ఆందోళనలకు తక్షణమే ముగింపు పలకాల్సిన అవసరం ఉంది. నిజమైన ఓటర్లకు న్యాయం జరగాలి! సుప్రీంకోర్టు తన ముందుకు వచ్చిన 'సర్' వాజ్యాలను అన్నిటినీ కలిపి విచారించి ఒక సమ గ్రమైన తీర్పు చెప్పడం శ్రేయస్కరం.

-బండారు రామ్మోహనరావు

# 'రెండు మహానగరాల కథ'ను తలపిస్తున్న నేటి భారతం

-డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్

*"ఇదో అద్భుత కాలం, ఇది అధ్వాన్న యుగం,.... ఇదో ఆశల వసంతం, ఇది నిరాశల శిశిరం...."*

*'రెండు మహానగరాల కథ' (ఎ టేల్ ఆఫ్ టు సిటీస్) నవలకి ఛార్లెస్ డికెన్స్ రాసిన ఈ అమర్త్య వాక్యాలు వర్తమాన భారతానికి అతికినట్లు సరిపోతాయనిపిస్తుంది.*

**ఆర్థిక లాభాలు, ఆశలు**

భవిష్యత్తు పట్ల మన ఆశల్ని, నమ్మకాన్ని పెంచే కొన్ని అభినందనీయ చర్యలు జాతీయస్థాయి ప్రభుత్వం గత దశాబ్దకాలంగా అమలు చేసింది. పెద్ద ఆర్థిక వ్యవస్థలలో.. బహుశా భారత్ మాత్రమే కొవిడ్ కల్లోలాన్ని సమర్థంగా ఎదుర్కొన్న దేశం. ఉక్రెయిన్, ఇరాన్ యుద్ధాల వల్ల తలెత్తిన కష్టనష్టాల్ని సైతం అసాధారణ ఆర్థిక క్రమశిక్షణ, దౌత్య చాతుర్యాలతో సమర్థంగా తట్టుకుంది.



ఇప్పటికీ పేదరికం ఎక్కువగా ఉన్న దేశంలో.. తాత్కాలిక ఉపశమనంగా సంక్షేమ పథకాలనిస్తూనే, దీర్ఘకాలికంగా అవసరమైన అభివృద్ధిని యూనియన్ ప్రభుత్వం కొనసాగించింది. రెంటి మధ్యా అలాంటి సమతూకం ప్రశంసనీయం. దేశ చరిత్రలో ఎన్నడూ లేనంత భారీగా మౌలిక వసతులకు నిధుల్ని వెచ్చించింది. పెట్టుబడులు, వాణిజ్య ఒప్పందాల్లో రాష్ట్ర ప్రభుత్వాలను పెద్దఎత్తున ప్రోత్సహించింది. కొవిడ్ వల్ల 2020-21 ఆర్థిక సంవత్సరంలో 9.2% రికార్డు స్థాయికి చేరిన ద్రవ్యలోటుని 2025-26 నాటికి 4.8 శాతానికి తగ్గించింది. 2027 ఆర్థిక సంవత్సరానికి 4.4%కి పరిమితం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. హొర్ముజ్ జలసంధి మూసివేత వల్ల ప్రభుత్వ వనరులపై విపరీత ఒత్తిడి ఏర్పడినా, 2027 ఆర్థిక సంవత్సర ద్రవ్యలోటులో నిర్దేశిత లక్ష్యాన్ని భారత్ సాధించగలదని నిస్సందేహంగా నమ్మొచ్చు.

**వేగంగా కోలుకున్న బ్యాంకింగ్ రంగం**

విచక్షణారహితంగా రుణాలివ్వటం, నిరర్థక ఆస్తుల శాతం భారీగా పెరగటంతో ప్రమాదకర పరిస్థితుల్లోకి జారిన దేశ బ్యాంకింగ్ వ్యవస్థను గత దశాబ్దకాలంగా క్రమంగా కోలుకునేలా ప్రభుత్వం చేయగలిగింది. గణనీయ మొత్తంలో పెట్టుబడుల్ని ఖర్చుచేయటంతోపాటు.. రుణాల వసూళ్లను సమర్థంగా మెరుగుపరిచింది. దీంతో, 2017-18లో రూ.85,000 కోట్లకు పైగా సగటు నష్టాన్ని నమోదు చేసిన ప్రభుత్వ రంగ బ్యాంకులు ఇప్పుడు 2025-26లో రూ.1,98,000 కోట్ల నికర లాభాన్ని ఆర్జించాయి. 2018లో అసాధారణ స్థాయిలో 14.6% మేరకు చేరిన ప్రభుత్వ రంగ బ్యాంకుల నిరర్థక ఆస్తుల (ఎన్‌పీయే) నిష్పత్తి.. ఇప్పుడు అతితక్కువకు, 1.93 శాతానికి తగ్గింది. మునుపెన్నడూలేనంత కనిష్టం ఇది. నికర ఎన్‌పీయే నిష్పత్తి ఆరోగ్యకర స్థాయిలో 0.39% లో కొనసాగుతోంది.

**మౌలిక వసతుల విస్తరణ**

బహుశా గత పన్నెండేళ్లుగా మన దేశం సాధించిన గొప్ప విజయం మౌలిక వసతుల రంగంలో అనుకోవచ్చు. జాతీయ రహదారులు, రోడ్ల సంధాన వ్యవస్థ అభినందనీయ ప్రగతి సాధించింది. 2014లోని సుమారు 91,000 కిలోమీటర్ల నుండి 2026లో 1,46,000 కి.మీలకి పైగా విస్తరించింది. జాతీయ రహదారుల నడవా 18,000 కి.మీ నుండి 48,000 కి.మీలకు పెరిగింది. హైస్పీడ్ కారిడార్లు నామమాత్రపు 93 కి.మీల నుండి 2138 కి.మీలకు విస్తరించాయి. రోజువారీ సగటు నిర్మాణం 11.6 కి.మీల నుండి 34 కి.మీలకు పెరిగింది. ఓడల్లో సరకు రవాణా నిర్వహణ సామర్థ్యం ఏడాదికి 800 మిలియన్ టన్నుల (ఎంపీటీయే) నుండి 2760 ఎంపీటీయేకి చేరుకుంది. ప్రధాన పోర్టుల్లో సరకుల లోడింగ్ సన్నద్ధత సమయం 94 గంటల నుండి 48 కి తగ్గింది. రైలు మార్గాల విద్యుదీకరణ గమ్యాలకు 21,800 కి.మీ నుండి 46,900 కి.మీలకు పెరిగింది. ఇదంతా మౌలిక వసతుల్లో రికార్డుస్థాయి పెట్టుబడులు, పనుల అమలు వేగం పెంచటం ద్వారా సాధ్యమయ్యాయి.

అంతర్జాతీయ వాణిజ్య అవరోధాలు, ఇంధన సరఫరాల

అంతరాలు వంటి ప్రతికూలతలున్నా.. మన దేశ వార్షిక ఆర్థిక వృద్ధి రేటు 6.5-7% దాకా కొనసాగటానికి ఈ ప్రయత్నాలు, విధానాలే ఎక్కువ దోహదం చేశాయి. సంక్షేమ పథకాలను ప్రజలకు సమర్థంగా చేర్చటానికి డిజిటల్ టెక్నాలజీ గొప్పగా ఉపయోగపడింది. యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్) అద్భుతంగా విజయవంతమైంది. 240 బిలియన్ లావాదేవీల ద్వారా ఏడాదికి రూ.314 ట్రిలియన్‌లకి పైగా బదిలీ అవుతోంది. పారిశ్రామిక విధానాన్ని ఉపయోగించుకుని ప్రారంభమైన కొన్ని రంగాలు.. ముఖ్యంగా మొబైల్ తయారీ, ఎగుమతులు అద్భుత ఫలితాలనిచ్చాయి. ఇతర రంగాలు ఉత్పత్తి, ఎగుమతుల్లో ఇంకా ఆ వృద్ధి స్థాయిని అందుకోవాల్సి ఉంది. ఇవన్నీ, వీటితోపాటు మరికొన్ని ఫలితాలు ఆర్థికపరంగా కొత్త ఉత్సాహాన్నిచ్చేవి, ఆశాభావాన్ని పెంచేవి.

**సమ్మిళిత అభివృద్ధి సవాళ్లు**

అయినా కూడా ఒక దేశంగా మనం ఆందోళనకర సవాళ్లను ఎదుర్కొంటున్నాం. ప్రపంచంలో మరే పెద్ద దేశానికీలేని మూడు కీలక అంకెలు.. భారత్ అభివృద్ధికి పెను అవరోధాలుగా నిలిచివున్నాయి. 1) పనిచేసేవారిలో 85% మంది.. జీవన భద్రత, నెలవారీ జీతం లేకుండా అసంఘటిత రంగంలో ఉన్నారు; 2) దేశ జనాభాలో 60% మంది.. ఆర్థికంగా ఎదగటానికి అతి తక్కువ అవకాశాలుండే చిన్న గ్రామాలలోనే నివసిస్తున్నారు; 3) జాతీయాదాయం (జీడీపీ)లో వాటా క్షీణిస్తూ ప్రస్తుతం 16-18% మాత్రమే ఉన్న వ్యవసాయరంగంలో.. 46% మంది శ్రామికులున్నారు. కార్మిక శక్తిలో మహిళల భాగస్వామ్యం చుట్టుపక్కల అధ్వాన్న దేశాలకంటే సైతం మన దేశంలో అతితక్కువ ఉండగా.. అందులో 64% మంది వ్యవసాయంలో, అది కూడా పురుషుల కంటే తక్కువ వేతనానికి జీవనోపాధి పొందుతున్నారు. మన అసలైన సామర్థ్యంతో పోల్చుకుంటే ఎంతో దిగువన ఉన్నప్పటికీ.. భారతదేశ అభివృద్ధి నిజమైనది, ప్రశంసనీయమైనది అనటంలో సందేహం లేదు. అయితే ఆ వృద్ధి అవసరమైన విస్తృత స్థాయిలో ప్రజల జీవితాల్ని మెరుగుపరచటం లేదు. పర్యవసానంగా, ఉద్యోగ మార్కెట్‌లోకి ఏటా ప్రవేశిస్తున్న 1.2 కోట్ల మందికి సంఘటిత రంగం ఉపాధిని కల్పించలేకపోతోంది. జీ 20 దేశాలు, ఇతర గణనీయ ఆర్థిక వ్యవస్థలతో పోల్చుకుంటే.. మన దేశంలో పట్టణీకరణ ఇప్పటికీ నత్తనడకనే సాగుతోంది. పరిమితిని మించి ఎన్నో రెట్లు ఎక్కువమంది ప్రజలు.. తక్కువ ఉత్పాదకత, వేతనాలతో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. సమానావకాశాలు లేకపోవటం వల్లే తమ ఆకాంక్షలకు తగ్గట్లు ఎదగలేకపోతున్నామనే ఆక్రోశం వీరిలో ఎక్కువమందికి ఉంది. సమ్మిళిత అభివృద్ధికి సంబంధించిన ఈ పెనుసవాళ్లకు సమాధానాలు అంత సులభం కాదు. రాష్ట్రాలలో గాని, జాతీయస్థాయిలోగాని ఒక ప్రభుత్వం, నాయకుడు, పార్టీ ఒంటరిగా ఏమీ చేయలేరు. అందుకు దేశవ్యాప్త స్థూల ఏకాభిప్రాయం కావాలి. దృఢ సంకల్పం ఉండాలి. వినూత్న పరిష్కారాల్ని రూపొందించాలి. సమర్థంగా అమలు చేయాలి. అన్నిటినీ మించి, అపార సహనం, కష్టాలను తట్టుకునే శక్తి ఉండాలి. అభివృద్ధి అవసరం, కానీ సరిపోదు. ఆ అభివృద్ధిని సమ్మిళితం, సుస్థిరంగా పెంచటానికి కనీసం రెండు దశాబ్దాలపాటు దేశమంతా ఏకతాటిపై ఒక జాతీయ ఉద్యమంలా కృషి చేస్తే.. ఈ సవాళ్లను ఎదుర్కోగలం. ముఖ్యంగా, మన యువత నుండి ఉత్పాదకతను పెంచాలి. ఇందుకోసం విద్యాప్రమాణాల్ని, నైపుణ్యాల స్థాయిని సర్వశక్తులూ ఒడ్డి శరవేగంగా పెంపొందించాలి. ఇలా మరింత సమ్మిళితం, ఉపాధి ఆధారితం చేయాలంటే.. ఆర్థిక నమూనానూ మనం మెరుగుపరచాలి.

**పాలనా సంస్కరణలు అవసరం**

రాజకీయ స్థిరత్వాన్ని, సామాజిక సుస్థిరతను దెబ్బతీయకుండా యువత ఆకాంక్షల్ని నెరవేర్చటానికి ఇదంతా యుద్ధప్రాతిపదికన చేయాలి. యధాతథ స్థితి, అలసత్వం, వాయిదాల ధోరణితో ఇంకా భారీ మూల్యం చెల్లించలేం. గత 80 ఏళ్లుగా భారతదేశం ఎన్నో అవకాశాలను జారవిడిచింది. ప్రతి భారతీయుని జీవన నాణ్యతను, ఆదాయాన్ని మెరుగుపరిచే ప్రస్తుత అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మనం వదులుకోకూడదు. ప్రజల జీవితాల్ని బాగుచేసేలా ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠపరిచే కీలక పాలనా సంస్కరణలను ఎల్లకాలం మనం వాయిదా వేయలేం. స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధులతో నిజమైన సాధికారత; రాజకీయ పార్టీల్ని ప్రజాస్వామీకరించటం; సమర్థులైన, సేవాభావం గల పౌరులు నైతిక, హేతుబద్ధ పద్ధతుల ద్వారా ఎన్నిక కాగలిగేలా ఎన్నికల పద్ధతిని సంస్కరించటం, న్యాయాన్ని ఆలస్యంలేకుండా అందుబాటులోకి తెచ్చి అమాయకుల్ని కాపాడే చట్టబద్ధపాలన అమలు, సామాజికంగా మంచి ప్రవర్తనలకు ప్రోత్సాహకాలు ఉండటం.. ఈ సంస్కరణల్లో భాగం కావాలి.

స్థూలస్థాయిలో ఆర్థికాభివృద్ధి మూలాలు బలంగా ఉండటం మన ఆశల్ని పెంచుతోంది. కానీ ఆ సంపద సృష్టిలో కొందరు తప్ప అందరూ భాగస్వాములు కాలేకపోవటం, కీలక పాలనా సంస్కరణలు కొరవడటం.. సూక్ష్మస్థాయిలో అశాంతిని, క్రమంగా నిరాశా నిస్పృహల్ని కలిగిస్తున్నాయి. ఇప్పటికైనా మన రాజకీయ పార్టీలు, మీడియా, ప్రజా మేధావులు కలిసొస్తారా? ఈ అసంపూర్ణ లక్ష్యాల సవాళ్లను ఎదుర్కోవటానికి మనకు సహాయపడతారా? రాష్ట్రాలు, జాతీయ స్థాయిలలో ప్రభుత్వాలు కలసి ఏకోన్ముఖంగా యుద్ధప్రాతిపదికన పోరాడతాయా? ఈ ప్రశ్నలకు మనం రాబట్టే సమాధానాలు వచ్చే తరం భవిష్యత్తుని శాసిస్తాయి.

◆

# చట్టసభలను అపహాస్యం చేస్తూ కూర్చున్న కొమ్మనే నరుక్కుంటున్న పార్టీలు

'సారు.. కారు..' నినాదానికి ఇప్పుడు 'అసెంబ్లీకి రారు'.. అనే పదాలు కూడా వచ్చి చేరాయి. తెలంగాణలో బీఆర్ఎస్ వ్యవస్థాపకులు కె.చంద్రశేఖరరావు తరహాలోనే ఆంధ్ర ప్రదేశ్‌లో వైకాపా వ్యవస్థాపకులు, వైఎస్ జగన్ వ్యవహ రిస్తున్నారు. సెప్టెంబర్‌లో తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో, బయట జరిగిన పరిణామాలు ఓ పదేళ్లు దాటి ఆలోచించ గలిగిన ప్రతి దేశభక్తునీ బాధిస్తాయి. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే, ఓ యుద్ధవాతావరణాన్ని సృష్టించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్సెస్ ప్రతిపక్ష నేత కేసీఆర్‌లా పరిస్థితిని మార్చవచ్చని, మీడియాలో అవి తప్ప ఇక ఏ ప్రజా సమస్యలూ చర్చకు రాకుండా చేయవచ్చని 2023 ముందస్తు ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన నాటి నుండి ఊహాగానాలు కొనసాగుతున్నాయి. రేవంత్, కేసీఆర్ వ్యవహారశైలి కూడా అదే రీతిలో సాగింది. 2026 సెప్టెంబర్‌కి వచ్చేసరికి, తాను ఉంటున్న ఫామ్‌హౌస్‌కే అసెంబ్లీ స్థాయి ప్రచారం వచ్చేలా కేసీఆర్ చేయగలిగారు. చివరికి సాధించిందేమిటి? అంతకుముందు తనను అవమానించారంటూ, కౌరవ సభను గౌరవ సభగా మార్చాకే అసెంబ్లీకి వస్తానని ప్రతిజ్ఞ చేసి, ఏపీలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నంత వరకూ సభలోకి రాలేదు. ఇక గతాన్ని వదిలేసి చూసినా.. 2026 పార్లమెంటు వర్షాకాల సమావేశాలదీ ఇదే తీరు. పన్నెండు బిల్లుల్లో 11ను ఏ పార్లమెంటరీ కమిటీకి సిఫార్సు చేయకుండా ఆమోదించారు. వాటిలో 7 బిల్లుల్ని అయిదంటే అయిదే నిమిషాల్లో ఆమోదించారు. లోక్‌సభలో 380 ప్రశ్నల్లో రెండింటికే నేరుగా సమాధానం చెప్పారు. రాజ్యసభలో 285 ప్రశ్నలకు 16కి మాత్రమే అలా ప్రత్యక్షంగా ప్రభుత్వం జవాబిచ్చింది. అందమైన, అధు నాతన భవనంగా బయటి నుండి ఘనంగా కనిపించే పార్ల మెంటు.. లోపల చర్చల్లో కూడా థ్రిల్లింగ్ దృశ్యంగా తప్ప, దేశానికి, ప్రజలకు పనికొచ్చే చర్చలు చేసే దేశ అత్యున్నత రాజకీయ వేదికగా ఏమాత్రం పనిచేయటం లేదు. పార్లమెం టును స్తంభింపచేయటం కూడా ప్రజాస్వామ్యంలో భాగమేనని బీజేపీ ఒకప్పటి అగ్రనేతలు సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ ప్రవచించారు. కానీ అలా సభను స్తంభింపచేయటం, వేడి తప్ప వెలుతురులేని గందరగోళంగా మార్చటం వల్ల ప్రజాస్వామ్యంతో పాటు చివరికి పార్టీల ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని తాజా పార్లమెంటు, తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు రుజువు చేస్తున్నాయి.



చట్టసభల పనితీరుపై భారత పార్లమెంటు ప్రారంభమైన 1952 నుండి ఎమర్జెన్సీ కాలం 1977 వరకు వివరించిన హిరెన్ ముఖర్జీ పుస్తకం 'పోర్ట్రెయిట్ ఆఫ్ పార్లమెంట్: రిఫ్లెక్షన్స్ అండ్ రికలక్షన్స్'ను ఉటంకిస్తూ బీహార్ నుండి రాజ్యసభ సభ్యుడు మనోజ్ కుమార్ ఝా లోతైన అవగాహనతో ఒక మంచి వ్యాసం రాశారు. అందులో ఆయన ఆరోజు హిరెన్ ముఖర్జీ చెప్పిన వ్యాఖ్యలు నీతిసూత్రాలు కాదని, ఒక ప్రజాస్వామిక రుగ్మతని ఈవేళ్టి పరిణామాలు రుజువు చేస్తున్నాయన్నారు. తాము ఎన్నుకున్న సభ్యుల ద్వారా ప్రజల సార్వభౌమాధికారం వ్యక్తమవుతుందని, కానీ చట్టసభల్లో సభ్యులకన్నా ప్రభుత్వానిదే ఆధిపత్యంగా మారిందన్నారు. సభలో చర్చించి ప్రజాప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాల్సిందిపోయి, ముందు పార్టీ అధిష్టానం, చాలా సందర్భాల్లో

పార్టీ అధినేతలుగా ఉన్న కొందరు వ్యక్తులు, వారి కోటరీ తీసుకున్న నిర్ణయాలను ఆమోదించటమే సభ్యుల పనిగా మారిందన్నారు. చట్టాల్లాగే చట్టసభలు కూడా ప్రతి అడుగుకీ అమలు చేయాల్సి వస్తే, అవి నిరర్థకమవుతాయి. కొన్ని ఉత్తమ సంప్రదాయాలు, సంస్కారం, ప్రజాస్వామిక విలువలు, స్ఫూర్తి, రాజ్యాంగ నైతికత వంటివి సభాపతి నిబంధనల జోలికిపోకుండా సభ నడపగలిగే విధంగా ఉండాలి. సోమనాథ్ ఛటర్జీ వామపక్ష అగ్రనాయకునిగా పార్లమెంటు స్పీకర్ అయినా, ఏరోజూ తన పార్టీకి అనుకూలంగా వ్యవహరించలేదు. 2004లో స్పీకర్ అయ్యాక సొంత పార్టీ సీపీఎం పదవులన్నిటికీ రాజీనామా చేశారు. సభా నిబంధనలను ఉల్లంఘిస్తే, తన పార్టీ వారిని కూడా మందలించారు. వ్యక్తులకన్నా పార్టీ ముఖ్యం, పార్టీ కన్నా దేశం ముఖ్యం.. అనే జనరాజకీయ సూత్రాన్ని పూర్తి రివర్స్ చేశారిప్పుడు. అదేవిధంగా, బిల్లులపై సభ్యులకు సరైన అవగాహన ఉండేలా పార్లమెంటరీ కమిటీలకు పంపే సంప్రదాయం ఉన్నకొద్దీ తగ్గిపోతోంది. అమెరికా ప్రముఖ అధ్యక్షులలో ఒకరైన ఉడ్రోవిల్సన్ పార్లమెంటరీ కమిటీల విలువను చాలా ప్రశస్తంగా పేర్కొన్నారు: కాంగ్రెస్ (ఆ దేశంలోని చట్టసభ) సమావేశంలో ఉన్నప్పుడు అలంకార ప్రాయమే. కాంగ్రెస్ నిజంగా పనిచేసేది కమిటీలుగా సంప్రదింపులు జరి పేటప్పుడే' అన్నారు. మనకి సమావేశాలూ దిగజారు తున్నాయి, కమిటీలూ కొరవడు తున్నాయి. చట్టసభల్లో ఇటీవలి పరిణామాలు చూశాక చట్టసభల్లో చర్చలపై లోతైన చర్చ జరిగి పరిష్కారంలో భాగం కాకపోతే.. శాశ్వతంగా ఓటు వేసే యంత్రాలుగానే మిగిలిపోతాం.

తెలంగాణ చట్టసభ కోణం నుండే చూద్దాం. ఈ అంశంపై తన అఫీషియల్ యూట్యూబ్ ఛానల్‌లో స్పందించిన ప్రజా స్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ స్పీకర్‌ను దుర్భాషలాడటాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. అలాంటి సభ్యుల్ని తొలగించే హక్కు సభకి ఉందన్నారు. బీఆర్ఎస్ నేతలు తమ వాదనల్ని టీషర్టులపై నినాదాల్లా కాకుండా, సభలో వినిపించే అవ కాశాన్ని ఎందుకు వదులుకున్నారని ప్రశ్నించారు. స్పీకర్‌ని బీఆర్ఎస్ సభ్యుడు దుర్భాషలాడినట్లు టీవీల్లో వచ్చినా, క్షమాపణ చెప్పకుండా ఆందోళన చేయటం విడ్డూర మన్నారు. అయితే ఇదే సమయంలో, పార్టీ ఫిరాయింపు లపై గతంలో జేపీ చెప్పిన అంశాల్ని కూడా ఈ సందర్భంగా ఇక్కడ గమనంలోకి తీసుకోవాలి.

☞ ఒక పార్టీ నుండి ఎన్నికై వేరే పార్టీ కండువా వేసుకుని తాను మారిన పార్టీకి సభలో మద్దతిస్తున్నా, ఆ సభ్యుడు పార్టీ



ఫిరాయించలేదు అని చెప్పే స్పీకర్‌కి ఏం గౌరవం ఉంటుంది? బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ కండువా కప్పుకుని లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన వ్యక్తిని కూడా అబ్బే, పార్టీ ఫిరాయించలేదు అని స్పీకర్ వెనకేసుకురావటాన్ని తీవ్రంగా తప్పుపడుతూ చివరికి తెలంగాణ హైకోర్టు దానం నాగేందర్ ఖైరతాబాద్ శాసనసభ్యత్వాన్ని రద్దు చేసింది. స్పీకర్ తన బాధ్యతల్ని సవ్యంగా నెరవేర్చకపోగా, సభాపతిగా పచ్చి అబద్ధాలు చెప్పారని కోర్టు తీర్పు నిర్ధారించింది. సుప్రీం కోర్టూ ఆ తీర్పుని సమర్థించింది.

☞ సభలో గందరగోళంపై ముఖ్యమంత్రి రేవంత్ ప్రెస్‌మీట్ పెట్టి, ప్రతిపక్షం కుట్రల్ని తిప్పికొట్టామని, ప్రజలు బీఆర్ ఎస్‌నే తప్పు పడుతున్నారని ఫ్లాష్ సర్వేలో తేలిందని ప్రకటిం చారు. అంటే, అధికారం నిలబెట్టుకోవటం తప్ప, అసలు అక్కడ సమస్య ఏమిటని ముఖ్యమంత్రి కూడా ఆలోచిం చలేదు.

☞సభలో ఎన్నికైన ప్రజాప్రతినిధులను పార్టీలు మాట్లాడ నిస్తున్నాయా? ప్రభుత్వాలు చర్చించనిస్తున్నాయా?.. ఇక అలాంటప్పుడు, ఆ పార్టీల పెత్తనాన్ని సభ్యులు ఎందుకు సహించాలి?

☞ ఇక ప్రధాన మీడియా కూడా అధికారపక్షం, ప్రధాన పార్టీల కోసమే వార్తలు, వ్యాఖ్యానాలు రాస్తోంది, ప్రసారం చేస్తోంది. సోషల్ మీడియాలో కొందరన్నా విజ్ఞులు కనిపించే అవకాశం ఉంటుంది. కానీ ఏకపక్షంగా వార్తల్ని జనంలోకి వదిలే సంప్రదాయ మీడియా ఒకప్పటి విలువలకు తిలోదకాలిచ్చింది. ఏఐ వంటి సాంకేతికతల ప్రభావం గురించి రాజకీయ నాయకులకు అర్థం కావటంలేదని సాక్షాత్తూ ఎలాన్ మస్క్ లాంటి వారు హెచ్చరిస్తున్నా, మనం ఈవేళ అధికార రాజకీయాలు తప్ప భవిష్యత్తు రాజకీయం, పాలన గురించి లేదన్నట్లు వ్యవహరిస్తున్నాం.

☞ ప్రజల్లో రాజకీయం పట్ల నిర్మాణాత్మక ఆశలు లోక్‌సత్తా ఆవిర్భవించాక పెరిగి ఉట్టిదాకా ఎగిరాయిగానీ,

ఇంకొన్నేళ్లయ్యాక చూద్దాంలే అని మళ్లీ యధాతథ స్థితికి మళ్లాయి. లోక్‌సత్తా పోరాడిన రాజకీయ సంస్కరణల్లో 'ఎన్నికలు' గత ముప్ఫై ఏళ్లలో దిగజారినట్లు కనిపించినా, ఆ ప్రభావం వల్ల ప్రభుత్వాలు ఎన్ని తాత్కాలిక తాయిలాలు ఇస్తుంటే, ప్రజల్లో అసంతృప్తి అంత పెరుగుతోంది. అవకాశం వస్తే సాంప్రదాయ రాజకీయ పార్టీల్ని చిత్తుగా ఓడించాలనే భావం చాలామందిలో పెరుగుతోంది. తమిళనాడులో విజయ్ పార్టీ గెలుపు, బీహార్ బంకీపూర్ ఉప ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ విజయం మార్పుకి మొలకలు అనుకోవచ్చు.

☞ అధికారంలోకి రాకుంటే, ఎమ్మెల్యే హోదాలో సభకు రాకపోవటాన్ని పార్టీల నాయకులు హీరోయిజంలా భావిస్తున్నారు.

ఈ అంశంపై రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ కూడా హిరెన్ ముఖర్జీ పుస్తకానికి మైలురాయిగా ఉన్న తొలి ఎన్నికలకు ముందే హెచ్చరించారు. పరిణతి ప్రజాస్వామ్య దేశాల్లోలా ఆలోచించటం కాకుండా, దేశీయ పరిస్థితులను పరిగణలోకి తీసుకుని ప్రమాణాల్ని పాటించాలన్నారు. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీకి ఆయన ఎక్కువ ప్రాధాన్యత నిచ్చారు. మీడియా పాత్రను స్పష్టంగా వివరించారు. ప్రభుత్వ వార్తల కంటే ప్రతిపక్ష వార్తలకు ఎక్కువ ప్రాధాన్యత నివ్వాలన్నారు. 'ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే..' అని రాసిన బాబాసాహెబ్ వ్యాసం ఇప్పటికీ దిక్సూచిలా పని చేస్తుంది. అదేవిధంగా, ఆందోళనల నిర్వహణలో బ్రిటిష్ కాలం నాటి పద్ధతులు కూడా తగవని, చట్టసభలో చర్చలే మార్గమని స్పష్టం చేశారు.

తెలంగాణ అసెంబ్లీ రగడ చూస్తే, అంబేద్కర్, హిరెన్ ముఖర్జీలను ఉల్లంఘించినట్లు ఇంగితజ్ఞానానికి కూడా అర్థమవుతుంది. కానీ పరిష్కారం ఎక్కడ నుండి మొదలు కావాలో గుర్తించలేనంతగా చిక్కుముడులున్నాయి. ఇక్కడ గాంధీ ఆలోచనాతీరు నుండి మొదలై, అంబేద్కర్ ఆశించిన రాజ్యాంగ ప్రజాస్వామ్యం గురించి ఆలోచించటం మెరుగు. రాజకీయాలకు సూత్రబద్ధత (నైతికత), అధికారానికి లక్ష్యం ఉండాలని గాంధీ అన్నారు.

ఆ లక్ష్యంలో భాగంగా, చర్చించటం, ఒప్పించటం, ఒప్పుకోవటం వంటివి చట్టసభల్లో జరగాలి. ఆ చర్చ చేయగల సామర్థ్యం మన సభ్యుల్లో చాలామందికి ఉంది. కాబట్టి, పార్టీల వ్యవస్థ దెబ్బతినకుండా, చట్టసభల గౌరవాన్ని నిలబెట్టేలా చర్యలు తీసుకోవటానికి నైతికత, రాజకీయ సంస్కరణలు రెండూ అవసరం. కాబట్టి.. సభాపతి పార్టీలకతీతంగా పనిచేసే ఏర్పాటు చేయటం; అదేవిధంగా, పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యానికి చట్టం చేసి, బడ్జెట్,

> **చర్చించటం, ఒప్పించటం, ఒప్పుకోవటం వంటివి చట్టసభల్లో జరగాలి. ఆ చర్చ చేయగల సామర్థ్యం మన సభ్యుల్లో చాలామందికి ఉంది. కాబట్టి, పార్టీల వ్యవస్థ దెబ్బతినకుండా, చట్టసభల గౌరవాన్ని నిలబెట్టేలా చర్యలు తీసుకోవటానికి నైతికత, రాజకీయ సంస్కరణలు రెండూ అవసరం.**

అవిశ్వాస తీర్మానం సమయంలో తప్ప విప్ జారీ చేసే అధికారం లేకుండా చేయాలి. పార్టీ అన్యాయమైన ఆదేశాలను ధిక్కరించే శక్తి ఉన్నా, వారి అండ డబ్బులు, ప్రచారం వంటి వనరులు లేకుండా గెలవలేమనే పరిస్థితి నుండి అభ్యర్థులు నిజాయతీ డబ్బుతో గెలవగలిగేలా ప్రతి ఓటుకూ విలువ ఉండే దామాషా పద్ధతిని ప్రవేశపెట్టాలి. ముఖ్యమంత్రి ఎమ్మెల్యేల మద్దతు కోసం వారి ఆగడాలను సహించాల్సిన అవసరం లేకుండా, ప్రత్యక్షంగా ఎన్నికయ్యే ఏర్పాటు చేయాలి. అధికారాన్ని స్థానిక ప్రభుత్వాలకు వికేంద్రీకరించి, జిల్లాను పాలనా యూనిట్‌గా చేయాలి. 80 శాతం నిర్ణయాలు, 40 శాతం నిధులు అక్కడ ఖర్చయ్యేలా జవాబుదారీతనంతో ఏర్పాటు చేయాలి. ఇవన్నీ జేపీ చాలా సమగ్రంగా చాలా సార్లు పేర్కొన్నారు, ఇటీవల లోక్‌సత్తా 30వ వార్షికోత్సవ సభ సందర్భంగా నిర్వహించిన సభలో కూడా ప్రస్తావించారు.

అసలు బీఆర్ఎస్ ఎందుకు ఆందోళన చేసింది, వారి మీద అత్యాచారాల కేసు ఎందుకు పెట్టారు తెలంగాణలోని ముక్కోటి ప్రజల్లో ఎవరికైనా అర్థమైందా? అదీ అధికార, ప్రతిపక్ష పార్టీల గొప్పతనం. దానికి సాధనం మీడియా. పైన పేర్కొన్నవన్నీ రాజకీయ సంస్కరణలు. వాటి వల్ల రాజ్యాంగ బద్ధం కావటంతోపాటు.. ప్రజల్లో నమ్మకాన్ని పెంచే నైతిక బలం రాజకీయానికి సమకూరుతుంది. ఆ నైతికత ఉంటే, ఏ సంస్కరణలూ లేకుండానే ప్రజలు గౌరవించేవారు. కానీ ఈ స్థాయికి దిగజారే రాజకీయాన్ని బహుశా రాజ్యాంగ నిర్మాతలు ఊహించివుండరు. అందుకే రాజ్యాంగ నైతికత గురించి అంబేద్కర్ చెప్పారు గానీ, అందుకు కావలసిన వ్యవస్థల్ని ఏర్పాటు చేయటంలో కొన్ని చూసీచూడనట్లు వదిలేశారు. తాను రాసిన రాజ్యాంగంతోనే తనలాంటి మేధావి, సమాజానికి అవసరమైన నేత ఓడిపోయాక కూడా అదే పరిస్థితిని కొనసాగించారు. నైతికత అంటే, చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు, పీటీఎంల పేరుతో తల్లిదండ్రులకు పాదపూజలు కాదు. మన పని పౌరులుగా, ఇతరులకు హానికలిగించకుండా నిర్వర్తించటం. అందులో

భాగంగా ఉమ్మడి అవసరాల కోసం రాజకీయం. కాబట్టి, జేపీ చెప్పినట్లు స్పీకర్ స్థానాన్ని బ్రిటన్ తరహాలో పార్టీలకతీతంగా గౌరవప్రదం చేయటం, ఎన్నికల, పార్టీల సంస్కరణలు చేశాక, ఫిరాయింపులపై నిర్ణయాన్ని ఎన్నికల సంఘానికి ఇస్తే, చట్టసభలో వెల్‌లోకి వచ్చేవారిని నిర్దాక్షిణ్యంగా సస్పెండ్ చేస్తే, సమస్యలు సకాలంలో సరైన రీతిలో ఫలవంతగా పరిష్కారమవుతాయి. అదేవిధంగా ఎన్నికై సభకు రాని ప్రధాన ప్రతిపక్ష నేతలు సహా ఎవరైనా కూడా నిర్ణీత గడువుతో మరోసారి పోటీకి అనర్హత విధిస్తూ సస్పెండ్ చేయాలి. అన్ని పార్టీల్లో గొప్ప నేతలు ఉన్నారు. అవకాశమిస్తే, స్థానిక ప్రభుత్వాల నుండి గొప్ప నాయకత్వం వస్తుంది. మహిళా రిజర్వేషన్లు పదిహేనేళ్లపాటు అమలు చేసినా, ఇక పొడిగించనక్కర్లేకుండా గొప్ప నాయకత్వాన్ని వారు అందించగలరు. అప్పుడు, రాజకీయం పవిత్ర వ్యాసంగం అని ఒక వాతావరణం ఏర్పడుతుంది.

అది లేకుంటే, మనం ఉన్నకొద్దీ మొద్దుబారిపోయి, సమాజం పట్ల, అంటే అంతిమంగా మన పట్ల కూడా అపనమ్మకం పెంచుకుంటాం. కనీసం ఈ మేరకు రాజ్యాంగబద్ధతను పాటించగలిగితే.. ప్రజలూ రాజకీయాల్లో తమ వంతు బాధ్యతలపై దృష్టి సారిస్తారు. విషాదమేమంటే, రాజకీయం ప్రజలు, వారిలో డిగ్రీ కాగితాలున్నవారు అనుకున్నంత ఏమీ కుళ్లిపోలేదు. కానీ ఎక్కడ పరిష్కారాలు ప్రారంభించాలో లోక్‌సత్తాలాంటి పౌర సమాజ సంస్థలు స్పష్టంగా రోడ్‌మ్యాప్‌ని అందిస్తున్నాయి. కానీ అమలు చేయగల సంకల్పం, సామర్థ్యంగల నాయకత్వం లేదు, సంఘటితంగా ఆ ప్రయత్నం జరగటం లేదు. 'విజిలెన్స్ నివేదికను చూపి ఫిరాయింపుల్ని ప్రోత్సహించారు' అని బీఆర్ఎస్‌పై రేవంత్ ఆరోపించారు. 'పోలీసుల్లో బీఆర్ఎస్ వారికి రేవంత్ రెడ్డి కనిపించారేమో' అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే, పోలీసుల్లో కేసీఆర్ కనిపిస్తారు. మళ్లీ అవినీతిని శిక్షించటానికి కాకుండా బెదిరించి ఫిరాయింపులకి ఉపయోగించుకుంటారు. అంతేతప్ప, చట్టం అందరికీ సమానంగా అమలయ్యే వ్యవస్థలో మార్పు తేవాలనే రాజ్యాంగ నియమాన్ని మాత్రం మాటవరసకు కూడా అమలు చేయరు. త్వరలో జీహెచ్ఎంసీ ఎన్నికలు, మరో 800 రోజుల్లో మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు వస్తున్నాయి. అప్పటి మూడ్‌ని బట్టి లేదా చాట్ జీపీటీని అడిగి ఓటు వేస్తారా? లేదా ఓటు విలువను, మీ జీవితం విలువను గుర్తించి నైతిక, రాజకీయ సంస్కరణలకు డిమాండ్ల ఆధారంగా ఓటు వేస్తారా? ప్రజల ప్రాతినిధ్యం ఉండేది చట్టసభల్లో తప్ప, ప్రభుత్వంలో కాదు. ప్రభుత్వం పాత్రం కేవలం సభ నిర్దేశించిన విధానాలను సక్రమంగా అమలు చేయటం. వ్యక్తిగత భావప్రకటన, ఓటు స్వేచ్ఛ ఉన్నప్పుడు, ఇంతకంటే చెప్పటం ఎవరికీ సరికాదు. ★

## ప్రజల భాగస్వామ్యంతోనే ఉద్యమాలకు విజయం: లోక్‌సత్తా



'దేశమంటే మట్టి కాదు, మనుషులు' అని ఎంతోమంది కవులకు, సంస్కర్తలకు అడుగుజాడగా నిలిచిన గురజాడ అప్పారావు జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయం.. లోక్‌సత్తా, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం జిల్లా కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, పలు స్వచ్ఛంద సంస్థల కృషికి విజయమని లోక్‌సత్తా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. గురజాడ చెప్పినట్లు.. మనుషులు, అంటే పౌరులు తలచుకుంటేనే, వారి భాగస్వామ్యం ఉంటేనే ఈ దేశం మారుతుందన్నారు. ఒట్టి మాటలు కట్టిపెట్టి, గట్టి మేలు తలపెట్టే ఆలోచనలతో ప్రజలు ఓటు వేయటం, మద్దతివ్వటం అవసరమన్నారు. గురజాడ జయంతి, అధికారికంగా నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయం సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బాబ్జీని సత్కరించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్ ఏపీ అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు మాట్లాడుతూ, గురజాడ తన సాహిత్యం ద్వారా సామాజిక దురాచారాలపై ప్రజల్లో చైతన్యం కలిగించారన్నారు. మాతృభూమి సేవాసంఘం రాష్ట్ర కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో.. జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు ప్రభాకరరావు, హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దవడ కొండబాబు, అధ్యక్షురాలు మీనమ్మ, కార్యదర్శి స్రవంతి, మాతృభూమి ప్రతినిధులు పి.కనకాచారి, తాడేపల్లి నాగేశ్వరరావు, కరకవలస నగేష్, అమ్మ సేవా సమితి అధ్యక్షుడు దుక్క లక్ష్మీ శేఖర్, మదర్ థెరిస్సా సేవా సమితి అధ్యక్షుడు ప్రసాద్ పట్నాయక్, సహకార భారతి జిల్లా మహిళా ప్రముఖ్ దుక్క కృష్ణవేణి, హ్యూమన్ రైట్స్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ లెంక రాణికుమారి తదితరులు పాల్గొన్నారు.

# చట్టాన్ని పెద్దమనుషులే ఉల్లంఘిస్తే ఎలా?



ఒక పార్టీ నుండి ఎన్నికై, ఆ ఎన్నికల సందర్భంగా ఏ పార్టీ మీద తాము విమర్శలు గుప్పించామో ఆ పార్టీలోకే చట్టవిరుద్ధంగా మారినందుకు హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ శాసనసభ సభ్యుడు దానం నాగేందర్‌ను తెలంగాణ హైకోర్టు అనర్హునిగా ప్రకటించింది. అంతకుముందు స్పీకర్‌కు తగిన గడువు ఇచ్చినా, పొడిగించినా.. ఫిరాయింపు వంటిదేమీ లేదని చెప్పటంతో, కోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ పేరా 2(1)(ఎ), రెడ్‌విత్ 191(2) ద్వారా ఈ వేటు వేసింది. ఓ ఆరు నెలలు గడువివ్వండి అని మాజీ ఎమ్మెల్యే తరపు న్యాయవాది విన్నవించినా, కోర్టు తిరస్కరించింది. అనర్హత వేటు పడ్డాక ఒక్కరోజు కూడా ఆ హోదాలో కొనసాగలేరని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని ఉటంకించింది. రాష్ట్ర హైకోర్టు తీర్పు పూర్తిగా సాంకేతికమైనది, కొంతమేర నైతికమైనది. కానీ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం కొరవడటం, స్పీకర్ పదవికి సంబంధించి తీసుకురావాల్సిన సంస్కరణలు వంటి మౌలికాంశాలను కోర్టు ప్రస్తావించలేదు. సుప్రీంకోర్టుకి అప్పీల్ చేసినా తీర్పు మారలేదు. ఫిరాయింపులకు సంబంధించి చట్టసభల్లో చర్చలు సహా వీటిపై ఇంతకుముందు 'జనబలం' వ్యాసంలో కొంత చర్చించుకున్నాం. ఆ సంస్కరణలు రానంతవరకూ ఈ ఫిరాయింపులపై చర్యలు ఒకరోజు పతాకశీర్షికకే పనికొస్తాయి. కానీ తెలంగాణ శాసనసభ అంశంలో పరిణామాల్ని గమనిస్తే, చట్టం పరిధిలో కూడా ఎలా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయవచ్చో నిరూపిస్తున్నాయి. ఒక గొప్ప ఉద్యమం ద్వారా, అందులో ప్రధానంగా ఎన్నికల్లో ఓటు ద్వారా తమకు తెలంగాణ కావాలని ప్రజలు నిరూపించి సాధించిన రాష్ట్రంలో అదే ఎన్నికల్ని చట్టం పరిధిలో అపహాస్యం చేయటం చాలా దురదృష్టకర పరిణామం. ఫిరాయింపులకు యాభై ఏళ్ల పైబడి చరిత్ర ఉన్నా, కనీసం మూడింట రెండొంతుల మంది సభ్యులు చీలికవర్గంలో ఉంటేనే అధికారిక గుర్తింపు వచ్చేలా 2003లో తీసుకొచ్చిన 91వ రాజ్యాంగ సవరణ పేర్కొంటుంది. ఈ సవరణ రావటంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ కీలకపాత్ర వహించారు. అయితే మూడింట రెండొంతుల మంది చట్టసభ సభ్యుల అభిప్రాయాల్ని కూడా బేఖాతరు చేసే స్థాయిలో పార్టీలు వ్యవహరిస్తాయని, స్పీకర్‌లు తమ నిర్ణయాల్ని వాయిదాలు వేసే లేదా అబద్ధాలను నిజాలుగా నమ్మించే ప్రయత్నం చేసే అధికార పార్టీ చెప్పినట్టుగా వింటారని, మీడియా ఇదంతా తమకు సంబంధంలేని వ్యవహారంగా మౌనం వహిస్తుందని, నిస్సహాయ ప్రజలు ఎన్నికల్లో ఇంకా ఎక్కువ తాత్కాలిక తాయిలాల్ని పొందే అవకాశంగా దీన్ని భావిస్తారని ఆరోజు ఊహించి ఉండకపోవచ్చు. అయితే ఈ చట్టం పరిధిలో కూడా అధికార రాజకీయ ఎత్తుగడలో స్పీకర్‌ల తీరుపై న్యాయస్థానాలు జోక్యం చేసుకోవటం ప్రజాస్వామ్యాన్ని అసాధారణంగా బలహీనపరుస్తుంది. ఇప్పుడు మరో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు కూడా కడిగిన ముత్యాలు, వారు పార్టీ మారినట్లు ఆధారాలులేవని స్పీకర్ చెప్పటంపై పిటిషన్లు న్యాయ విచారణలో ఉన్నందున, ఆ అంశాన్ని కొంత చర్చించటం అవసరం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన మొదటి శాసనసభలోనే ఫిరాయింపులు జోరుగా సాగాయి. ప్రస్తుత తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో అప్పట్లో ఓటుకు నోటు ఇచ్చేందుకు ప్రయత్నించటం తమ ప్రభుత్వాన్ని పడగొట్టటానికే అని, అందువల్లే ఫిరాయింపుల్ని టీఆర్ఎస్ (ఇప్పుడు బీఆర్ఎస్) ప్రోత్సహించాల్సి వచ్చిందని కేసీఆర్ సమర్థించుకున్నారు. 2014 ఎన్నికల తర్వాత



తెలంగాణ అసెంబ్లీలో తెలుగుదేశం, కాంగ్రెస్, వైకాపా సభ్యులు ప్రతిపక్షాలుగా ఉన్నారు. వీరిలో వైకాపా వారంతా టీఆర్ఎస్ లోకి చేరటంతో చట్టపరమైన సమస్య లేదు. కానీ తెలుగుదేశం నుండి గెలిచిన 15 మందిలో 12 మంది చేరేవరకూ స్పీకర్ ఎటువంటి చర్యా తీసుకోకుండా వేచి చూశారు. నిర్ణయాన్ని వాయిదా వేయటమేకాకుండా, చట్టాన్ని తన అధికారంతో దుర్వినియోగం చేశారు. 12 మంది చేరాక మూడింట రెండొంతుల మెజారిటీ లభించటంతో..తెలుగుదేశం శాసనసభా పక్షాన్నే అధికారపక్షంలో విలీనం చేశారు. టీడీపీ నుండి గెలిచిన తలసాని శ్రీనివాసయాదవ్‌ను అంతకు సంవత్సరం ముందు 2015లోనే టీఆర్ఎస్ మంత్రిగా గౌరవ గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఒకపరంపరగా రాజ్యాంగ పదవుల్ని ఆ సమయంలో దుర్వినియోగం చేశారు. అదేవిధంగా కాంగ్రెస్‌లో 21 మంది ఆనాడు శాసనసభ్యులుగా గెలిచారు. వారిలో ఏడుగురే టీఆర్ఎస్/ బీఆర్ఎస్‌లో చేరారు. దాంతో విలీనానికి అవకాశం లేకుండా పోయింది. స్పీకర్‌కి కాంగ్రెస్ నాయకత్వం ఫిర్యాదు చేసినా నానుస్తూ చివరికి అయిదేళ్లూ పూర్తిచేశారు. 2019 ఎన్నికల్లో 18 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో 12 మంది చేరి మూడింట రెండొంతుల సంఖ్య లభించినా, అది కూడా మార్చి నుండి జూన్ వరకు దశలవారీగా తప్ప ఒకేసారి జరగలేదు. అయితే అప్పటి కాంగ్రెస్‌లా కాకుండా ఇప్పుడు బీఆర్ఎస్, బీజేపీ ప్రతిదశలోనూ గట్టిపోరాటం చేయటంతో అనర్హత వేటుపడి ఖైరతాబాద్ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో, పార్టీల్ని ప్రజాస్వామీకరించటం, విప్ జారీని పరిమితం చేయటం మొదలైన సంస్కరణలతోపాటు.. చట్టాన్ని తమ స్వార్థప్రయోజనాలకు దుర్వినియోగం చేసే అవకాశం లేకుండా స్పీకర్ వ్యవస్థలో, ఈసీ బాధ్యతల్లో సంస్కరణల్నీ తీసుకురావటం అవసరం.

★

## ఉప ఎన్నికల ఖర్చును అనర్హత ఎమ్మెల్యేల నుండే వసూలు చేయాలి

పదవి నుండి వేటుకి గురైనవారు మళ్లీ పోటీ చేస్తే ఆ ఎన్నికల ఖర్చును వారి నుండే రాబట్టాలని లోక్‌సత్తా తెలంగాణ అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు అన్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ శాసనసభ్యత్వం రద్దు చేస్తూ హైకోర్టు నిర్ణయం స్వాగతించదగ్గదన్నారు. పార్టీ ఫిరాయించటం ఓటర్లను, చట్టసభ సభ్యులను కించపరచటమన్నారు. అలాంటివారు మళ్లీ వెంటనే ఎన్నికల్లో పోటీ చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మీడియా సమావేశంలో లోక్‌సత్తా నేతలు తీగలపల్లి రంగాచారి, కొప్పుల శ్రీధర్, నాగుల శ్రీనివాస్ యాదవ్, కుందేటి రవి, కేసరి వెంకట నర్సింగరావు, శేరేపల్లి నర్సింగరావు, రత్నం, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## కిందిస్థాయి అవినీతిని నిర్మూలించండి

కిందిస్థాయి నుంచి అవినీతిని నిర్మూలించాలని విశ్రాంత ఐ.ఆర్.ఎస్ అధికారి బీవీ గోపీనాథ్ ప్రభుత్వాన్ని కోరారు. సాధారణ ప్రజలు జీ.హెచ్.ఎం.సీ, తహసీల్దార్ కార్యాలయాల్లో డబ్బులు ఇవ్వకుంటే రోజువారీ చిన్న పనులు కూడా కావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో కలెక్టర్, రాష్ట్ర స్థాయిలో ఆయా శాఖల ఉన్నతాధికారులు సూచించిన వ్యవధిలో పనులు పూర్తిచేసేలా చొరవ తీసుకోవాలన్నారు. ఇలాంటి సేవల్లో లోపాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి క్షేత్రస్థాయిలో మార్పు తీసుకురావటమే తమ లక్ష్యమన్నారు. సమావేశంలో సిటిజన్ ఫోరం తెలంగాణ కార్యదర్శి రాజీవ్ కుమార్, జనసేవా సంఘ్ నాయకులు సీతారామ ఠాకూర్, మదన్ లాల్ రావల్, వీడీ చౌదరి, రాజీవ్ చౌబే, వినోదలక్ష్మి ఉన్నారు.

# అమాత్యుల ఆదాయపు పన్ను భారం ప్రభుత్వంపై ఎందుకు?

- డాక్టర్ పి. మోహన్‌రావు,
మెంబర్, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్

ప్రజల సంక్షేమం పేరుతో తెలంగాణ ప్రభుత్వం రికార్డు స్థాయిలో ఉపశమన పథకాలను అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేని కారణంగా.. ప్రభుత్వోద్యోగుల పదవీ విరమణ డబ్బులు, వారికి బాకీ ఉన్న డీఏలు చెల్లించటంలో సమస్యలు ఎదుర్కొంటోంది. ప్రతి నెలా ఒకటో తారీఖున ఉద్యోగుల జీతాలు చెల్లించటానికి కూడా కష్టపడాల్సి వస్తోంది. ఫీజు రీఇంబర్స్‌మెంట్ చెల్లింపుల విషయంలో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదాయానికి సంబంధించి అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. నిత్యం అప్పులు తెస్తోంది. ఇటువంటి తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి, మంత్రులు, మంత్రి హోదా కలిగినవారి ఆదాయపు పన్ను చెల్లించటం ఏమాత్రం సమర్థనీయం కాదు.

**ప్రభుత్వం చెల్లిస్తున్న మంత్రుల ఆదాయ పన్ను ప్రజల పన్నుల డబ్బులోనిది. తాము చెల్లిస్తున్న డబ్బును ప్రభుత్వం ఏ రకంగా ఖర్చు చేస్తున్నదో తెలుసుకునే హక్కు ప్రజలకు ఉంది. ఈ అంశాన్ని రాష్ట్ర గవర్నర్ దృష్టికి కూడా తేవటం జరిగింది. మంత్రులకు సంబంధించి రాష్ట్ర ఖజానా చెల్లిస్తున్న ఆదాయ పన్ను వివరాల్ని ప్రభుత్వం తన వెబ్‌సైట్‌లో ఉంచాలి.**

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించకముందు నుండి ఈ విధానం అమలులో ఉంది. వేతనాల చెల్లింపు చట్టం, 1953లోని సెక్షన్ 3(4) ప్రకారం కేబినెట్ హోదా కలిగిన మంత్రుల ఆదాయ పన్నుని ప్రభుత్వం చెల్లిస్తుంది. వీరితోపాటు కేబినెట్ హోదా కలిగిన సర్కారీ సలహాదారుల, కార్పొరేషన్ ఛైర్మన్ల ఆదాయ పన్నును కూడా ప్రభుత్వమే భర్తీ చేస్తుంది. మంత్రులు వారి సేవలకుగాను ఆదాయం పొందుతున్నారు. ఇది వ్యక్తిగత ఆదాయం కిందకు వస్తున్నందున మంత్రులు వారి ఆదాయపన్ను వారే చెల్లించాలి.




వీరి ఆదాయపన్నును ప్రభుత్వం చెల్లించటం 'చట్టం ముందు అందరూ సమానమే' అన్న రాజ్యాంగ మూలసూత్రం ఆర్టికల్ 14కు వ్యతిరేకం. యూనియన్, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వారి ఆదాయపన్నును వారే చెల్లిస్తారు. ఈ కారణంగా ప్రభుత్వం మంత్రుల ఆదాయపుపన్నును చెల్లించటం ఏ రకంగానూ సమర్థనీయం కాదు. ఇప్పటికే ఈ విధానాన్ని ఉత్తర్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, హర్యానా వంటి రాష్ట్రాలు రద్దు చేశాయి. తెలంగాణ కూడా ఆ బాటలో పయనించటం మంచిది.

ప్రభుత్వం చెల్లిస్తున్న మంత్రుల ఆదాయ పన్ను ప్రజల పన్నుల డబ్బులోనిది. తాము చెల్లిస్తున్న డబ్బును ప్రభుత్వం ఏ రకంగా ఖర్చు చేస్తున్నదో తెలుసుకునే హక్కు ప్రజలకు ఉంది. 2005లో వచ్చిన పాలనా సమాచార హక్కు (ఆర్‌టీఐ) చట్టం కూడా ప్రజలకు ఈ అధికారం ఇచ్చింది. ఈ అంశాన్ని రాష్ట్ర గవర్నర్ దృష్టికి కూడా తేవటం జరిగింది. మంత్రులకు సంబంధించి రాష్ట్ర ఖజానా చెల్లిస్తున్న ఆదాయ పన్ను వివరాల్ని ప్రభుత్వం తన వెబ్‌సైట్‌లో ఉంచాలి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం పారదర్శకంగా, జవాబుదారీతనంతో పనిచేయాలి. ఈ అంశం దేశ భద్రతకు లేదా విచారణలో ఉన్న నేరాలకు, విదేశీ సంబంధాలకు సంబంధించినది కాదు. ★

# లోక్‌సత్తా 2.0: ప్రజాస్వామ్యం పిలుస్తోంది, 'థాట్ లీడర్‌షిప్' అవకాశాల్ని వినియోగించుకోండి

## – లోక్‌సత్తా నేతలతో సమన్వయంతో వ్రితి బన్సల్, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఇతర పరిశోధనా ఎనలిస్ట్‌లు

భవిష్యత్ భారతం కోసం ఆలోచించే పౌరులు ప్రతి రాష్ట్రంలోనూ ఉన్నారు. ఈవేళ మనం ఆస్వాదిస్తున్న స్వేచ్ఛ, సమాన ఓటు హక్కు వంటి అంశాలకు మూలమైన ప్రజాస్వామ్య నాణ్యతను పెంచటం కోసం ఆ పౌరులు నిరంతరం ఆరాటపడుతుంటారు. వీరిలో కొందరు రోజువారీ సంచలనాల్ని దాటి.. మన వ్యవస్థలు బలంగా, పరిణతితో పనిచేసేందుకు అవసరమైన సంస్కరణల కోసం లోతైన కృషి చేస్తుంటారు. ఈ దేశంలో చిట్టచివరి పౌరులు కూడా తమ జీవితంలో తామే హీరోల్లా సాధికారతతో నిర్ణయం తీసుకో గలిగేందుకు అవకాశమున్న ప్రతి మార్గంలో ప్రయత్నిస్తుంటారు. మనలో ప్రతి ఒక్కరూ సొంత కెరీర్‌ను చూసుకుంటూనే.. ఆ నిజమైన దేశభక్తులు ప్రజాస్వామ్యం, వ్యవస్థలపై లేవనెత్తుతున్న ప్రశ్నలను పట్టించుకోవాలి. పరిష్కారాల్లో మన వంతు భాగమవ్వాలి. అప్పుడే మనమూ సంపద సృష్టికర్తలం కాగలం, మన తర్వాతి తరాలకు సుస్థిర, సమ్మిళిత ఆర్థికాభివృద్ధి అందించగలం.

మనముందున్న సమస్యల్ని వేర్వేరుగా చూడలేం. చాలా సందర్భాల్లో అవి మన వ్యవస్థల రూపకల్పనను బట్టి ఉంటాయి. వ్యవస్థలకి ప్రోత్సాహకాలు ఎలా ఉన్నాయి, వ్యవస్థలోని వివిధ విభాగాలు ఏ రీతిలో పరస్పర జవాబుదారీతనంతో సంధానమై ఉన్నాయి.. అనే అంశాలపై ఆధారపడి వుంటాయి. మనం అవగాహనతో స్పందించి పరిష్కారంలో భాగమవ్వాలంటే.. ఈ లోతైన కారణాల్ని అర్థం చేసుకోవాలి. ఆచరణసాధ్య పద్ధతుల్ని గుర్తించాలి. అప్పుడది నిజమైన సంస్కరణ అవుతుంది. దీర్ఘకాల ప్రభావం చూపుతుంది.

లోక్‌సత్తా ఏర్పాటుకి ముందు వ్యక్తిగతంగా డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ కృషిని మినహాయిస్తే.. లోక్‌సత్తాని స్థాపించాక గత మూడు దశాబ్దాలుగా చేస్తున్న రాజకీయ సంస్కరణల కృషికి ఈ ఆట నియమాలే మూలం. భారతదేశం ఎదుర్కొంటున్న వివిధ సవాళ్లను ఈ చట్రం పరిధిలో సమగ్రంగా అర్థం చేసుకుని, వాటికి ఆచరణసాధ్య, కార్యాచరణ పరిష్కారాలను గుర్తించటం, హేతుబద్ధ వాదనలతో ప్రజలకు వివరించి సంస్కరణకు మద్దతును సాధించటం మేం అనుసరించిన మార్గం. అవగాహనతో సంఘటితంగా తెలియచెప్పటం, సమీకరించటం, ప్రధాన పార్టీల్ని ఒప్పించటం, ఆయా సంస్కరణల్ని సాధించటం ద్వారా ఈ ప్రయత్నాన్ని కొనసాగించాం.

ముప్పై ఏళ్లుగా భారత ప్రజాస్వామ్య, పాలనా వ్యవస్థల్లో అనేక గణనీయ సంస్కరణలు లోక్‌సత్తా వల్ల వచ్చాయి. ప్రజల్లో, రాజకీయ వ్యవస్థలో నిరంతరం, నిలకడగా ఆయా పరిష్కారాల కోసం గళం వినిపించటం, పరిశోధన, వ్యవ స్థలతో సంప్రదింపులు, అన్నిటినీ మించి తమ ఆకాంక్షలు వినిపించాలని పౌరులు బలంగా కోరుకోవటం..ఇవన్నీ లేకుండా చాలా సంస్కరణలు సాధ్యమయ్యేవి కావు. సమగ్ర దృష్టి, సమ్యక్ దృక్పథంతో లోక్‌సత్తా విజయాల్ని విశ్లేషించాలి. భారతదేశ అవసరాల నుండి చూస్తే, లోక్‌సత్తా సాధించిన సంస్కరణలు ఏమాత్రం సరిపోవు. కానీ లోక్‌సత్తా మొదలైన నాటితో పోల్చుకుంటే, ఒక కీలకమైన అంశానికి అవి రుజువులు: ఈ దేశంలో వ్యవస్థీకృత మార్పు సాధ్యం. వ్యవస్థలు, అవి రూపొందే పరిస్థితులకు ప్రోత్సాహకాలు రాత్రికి రాత్రికి మారే అవకాశాలు ఉండవు కాబట్టి, లోక్‌సత్తా ప్రయత్నం స్వభావరీత్యానే దీర్ఘకాలికమైనది. అందుకు సిద్ధపడాలి.

పక్షపాత రాజకీయాలకు అతీతంగా సాగిన ఈ ప్రయాణంలో సహాయ సహకారాలను అందించిన వారందరికీ మేం ఎంతైనా రుణపడి ఉంటాం. కొందరు సమయం ఇచ్చారు, కొందరు ఆలోచనలు, వనరులు అందించారు, మరికొందరు నెట్‌వర్క్‌లు నిర్మించారు. వీటన్నిటి వెనుకా ఆ లక్షలాది మందికి ఉన్న మెరుగైన భారతదేశ నిర్మాణ ఆకాంక్ష, అందుకు లోక్‌సత్తా భావజాలం, వేదికే సరైనది అనే హేతుబద్ధ అవగాహన కీలకమైనవి.

లోక్‌సత్తా తర్వాతి దశ ఆ సంఘటిత కృషి, అనుభవం మీద నిర్మితమవుతుంది. లక్ష్యం అదే. విధానాల రూపకల్పనకు అనుసరించే హేతుబద్ధత, వాస్తవాలు, ప్రపంచ దేశాల అనుభవాలు, మన దేశ పరిస్థితులను పరిగణలోకి

తీసుకోవటం వంటి ప్రాతిపదికలూ మౌలికంగా అవే. కానీ లక్ష్యాన్ని చేరే వాహనాలు కాలానుగుణంగా మారొచ్చు.

భారతదేశం తన సామర్థ్యానికి తగ్గట్లు ఎదగటానికి ఒక ఉదారవాద, జవాబుదారీతనమున్న, బలమైన, సమన్యాయం అందించే ప్రజాస్వామ్య రాజ్యవ్యవస్థగా మారాలని లోక్‌సత్తా ఇప్పటికీ నమ్ముతుంది. చట్టం అందరికీ సమానంగా వర్తింపచేస్తూ, ప్రజలకు అవసరమైన వస్తువుల్ని, సేవల్ని కొనుగోలు సామర్థ్యానికి అనుగుణంగా అందించటం, ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలు, ప్రతి పౌరుడూ గౌరవప్రదంగా, సమానావకాశాలతో ఆత్మగౌరవంతో బతకటం లోక్‌సత్తా మౌలిక లక్ష్యంలో భాగంగానే కొనసాగుతాయి. ఏ రాజకీయ పద్ధతీ లోపరహితం కాదు. కానీ ఏ లక్ష్యం కోసం ఒక సామాజిక ఒడంబడికగా మానవాళి రాజ్యవ్యవస్థను కృత్రిమంగా నిర్మించుకున్నారో.. ఆ లక్ష్యం నెరవేరటానికి ప్రజాస్వామ్యం మెరుగైనది. మనం చేయవలసిందల్లా.. ఆ ప్రజాస్వామ్యం నిరంతరాయంగా పనిచేసేలా పటిష్ఠం చేయటం. ప్రజాస్వామ్యంలో ఒక వ్యవస్థని మెరుగు పరచటానికి, ఒక వ్యవస్థీకృత లోపాన్ని సరిదిద్దటానికి, జవాబుదారీతనాన్ని బలోపేతం చేయటానికి, ప్రభుత్వ విధానాన్ని మెరుగు పరచటానికి లేదా పౌరుల భాగస్వామ్యానికి అవకాశాల్ని పెంచటానికి ప్రతి అవకాశాన్నీ లోక్‌సత్తా వినియోగించు కుంటుంది. ఈవేళ.. ప్రజలు తమ భావాల్ని తెలియచేసే, నేర్చుకునే, సంఘటితమయ్యే, వ్యవస్థలో భాగస్వాములయ్యే పద్ధతులు ఊహించనిరీతిలో మారాయి. విషయ పరిజ్ఞానాన్ని సృష్టించే, ఇతరులతో పంచుకునే పద్ధతుల్ని సాంకేతికత సమూలంగా మార్చింది. ఒక మహానగరంలో ఉన్న జ్ఞానాన్ని చిన్న నగరాల్లో ఉన్న వ్యక్తి కూడా తెలుసుకోవటాన్ని డిజిటల్ వేదికలు సాధ్యం చేశాయి. ఒక తరం క్రితం ఊహించటం కూడా సాధ్యంకాని రీతిలో స్థాయిలో, వేగంతో వినూత్న ఆలోచనలు ఈవేళ దేశవ్యాప్త మవుతున్నాయి. ఇదో అసాధారణ అవకాశాన్ని సృష్టిస్తోంది. లోక్‌సత్తా 2.0 ఈ అవకాశాల్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవటానికి, మరింత వేగంగా ఫలితాలు సాధించటానికి కృషి చేస్తుంది. మూడు దశాబ్దాలుగా మమ్మల్ని నడిపించిన మౌలిక సూత్రాలు, అనుభవాల మీద ఆధారపడే వీటిని నిర్మించుకుంటాం. అవగాహనతో స్పందించే పౌరుల సంఖ్యను ఇంకా అనేక రెట్లు పెంచటం లక్ష్యం. లోక్‌సత్తా అభివృద్ధి చేసిన అపార జ్ఞానసంపద, పరిశోధన, అనుభవం సంస్థకు, కొంతమందికే పరిమితం కాకూడదన్నది మా సంకల్పం. భావజాలం, ఆలోచనలు తమ సత్తా ద్వారా ప్రజల రోజువారీ జీవితాల్లో భాగమవ్వాలి. తమకు తక్షణావసరం, తమ దీర్ఘకాల సమస్యలకు పరిష్కారం, తమకు అనుగుణమైనవి అనుకునేవారందరికీ ఇవి అందుబాటులో ఉండితీరాలి. ప్రజలకు తమకు కావలసింది తీసుకోగలగాలి. వాటి మీద తమ సమగ్ర అభివృద్ధికి నిర్మాణాల్ని గావించుకోగలగాలి. తమ అభిరుచులు, సామర్థ్యాలు, పరిస్థితులకు అనుగుణంగా ఆ పరిష్కారంతో లాభపడాలి. ఇదీ లోక్‌సత్తా 2.0 లక్ష్యం, మార్గసూచీ.

ఈ నేపథ్యంలో, బహుముఖ మార్గాల్లో ప్రజలకు చేరేలా లోక్‌సత్తా కార్యాచరణను వచ్చే దశ విస్తరిస్తుంది. ఈ భావజాలాన్ని చిట్టచివరి పౌరునికి కూడా అందుబాటులోకి తెస్తుంది. వారిలో సంఘటితంగా పనిచేసేవారికి వేదికగా పనిచేస్తుంది. ఏఐ, సోషల్ మీడియా, ఇతరత్రా మార్గాల నుండి వెల్లువలా సమాచారం ముంచెత్తుతున్న దశలో.. వాస్తవాల్ని తెలియచేసే దీపస్తంభంలా ప్రజల చర్చకు, సంఘటిత కార్యక్రమాలకు కేంద్రంగా లోక్‌సత్తా సరైన దిశానిర్దేశం చేస్తుంది. గత మూడు దశాబ్దాల ట్రాక్ రికార్డే ఇందుకు రుజువు.

ప్రజలే ప్రభువులు

లోక్‌సత్తా దీర్ఘకాలిక దృక్పథంతో పనిచేస్తుంది కాబట్టే, తక్షణావసరాలను-దీర్ఘకాలిక ప్రయోజనాల మధ్య సమన్వయం కోసం మౌలిక, విధానపరమైన సంస్కరణల కోసం పనిచేస్తుంది. ఆ విధానాలను హేతుబద్ధంగా, వాస్తవాల ఆధారంగా, ప్రపంచ అనుభవాల ప్రాతిపదికన రూపొందిస్తుంది. భావోద్వేగ నిర్ణయాలు పాలపొంగులా చల్లారతాయి. కానీ హేతుబద్ధ విధానాలు దీర్ఘకాలం కొనసాగుతాయి. గత ముప్పై ఏళ్ల గమనం వెలుగు నుండి చూస్తే భవిష్యత్తుని, గమ్యాన్ని తేలిగ్గా గుర్తించగలరు.

## 1. ప్రామాణిక కోర్సులు, 'మూక్స్' ద్వారా ఏడాదికి 1000 మంది థాట్ లీడర్స్‌ను సృష్టించటం

లోక్‌సత్తా తన ప్రజాస్వామిక భావజాలాన్ని ప్రధానంగా అయిదు పునాది రాళ్లపై నిర్మించింది. వ్యక్తి స్వేచ్ఛ, చట్టబద్ధపాలన, స్వయంపాలన, పౌరుల సాధికారత, స్వయందిద్దుబాటు వ్యవస్థలు. ఈ చట్రంలో భారత రాజకీయ, ఆర్థిక పరిస్థితుల్లో మార్పులకనుగుణంగా ఎప్పటికప్పుడు కొత్త అంశాలపై దీర్ఘకాలిక విధానాలు వచ్చి చేరుతుంటాయి. అందువల్లే, వచ్చిపోయే లాంతర్ల వెలుతుర్ల వద్ద ఆగిపోకుండా, దూరనక్షత్ర కాంతులను అనుసరిస్తూ లోక్‌సత్తా తన గమ్యం వైపు సాగిపోతుంటుంది. ఆ నక్షత్రానికుండే అయిదు మొనలూ అయిదు మూలస్తంభాలు. ఈ అవగాహన నుండి ఎన్నికలు, రాజకీయ, ఆర్థిక, పాలనా

సంస్కరణలపై లోక్‌సత్తా కృషిని మెరుగ్గా గ్రహించవచ్చు.

తెలుగు రాష్ట్రాలకి, భారతదేశానికి, ప్రజాస్వామ్యానికి లోక్‌సత్తా భావజాలం ఎంత అవసరమో గత మూడు దశాబ్దాల కృషి కాలపరీక్షగా నిరూపించింది. ఈ భావజాలాన్ని, విధానాల్ని ఏ వాహనం ద్వారా వీలుంటే ఆ వాహనం ద్వారా.. ప్రజల్లోకి, ముఖ్యంగా జెన్ జడ్, ఆల్ఫా, బీటాలకు చేర్చాలి. మహిళలకు అందించాలి. యువత, ఇతర పౌరులు తమ ఉద్యోగ, వ్యాపారాలు, కెరీర్‌లు, కుటుంబాల్ని చూసుకుంటూనే.. ఇందులోని అంశాలను సులభంగా తెలుసుకోగలిగేలా ఒక క్రమపద్ధతిలో లోక్‌సత్తా భావజాలాన్ని కోర్సులుగా రూపొందిస్తున్నాం. మూక్స్ (ఎంఓఓసీ)గా అందుబాటులోకి తెస్తున్నాం. ప్రజాస్వామ్యం, పరిపాలన, ఆటగాళ్లు మారితే చాలదు, ఆట నియమాలు ఎందుకు మారాలి మొదలైన అంశాలన్నీ అందరికీ అర్థమయ్యే భాషలో తీసుకొస్తాం. రోజువారీ జీవితం హడావుడిలోనూ సమయం కేటాయించగలిగే కార్యాచరణగా అందిస్తాం. అంటే, సులభంగా అర్థం చేసుకోవటం, మీ కెరీర్‌కి ఆటంకం లేకుండా మీ పరిధిలోనే పాటించటం. మీ నిజమైన ప్రయోజనాలకు ఈ థాట్ లీడర్‌షిప్ ఎందుకు అవసరమో కొంచెం వివరంగా చూద్దాం.

మన దేశంలో ప్రజాస్వామ్యం.. ఎన్నికల్లో నచ్చినవారికి స్వేచ్ఛగా ఓటు వేయటం, శాంతియుతంగా అధికార మార్పిడి గావించటంతోపాటు, సమస్యల్ని గుర్తించటం వరకు పెరిగింది. అయితే ఇంకా సమస్యల్ని వర్ణించటం, నినాదాలుగా భావోద్వేగ ప్రచారం చేయటం వద్దే అత్యధికంగా మన నాయకత్వ స్థాయి ఆగిపోయింది. ఆ దశను దాటి పరిష్కారంలో భాగమవ్వాలంటే థాట్ లీడర్స్ (ఆలోచించి పరిజ్ఞానంతో వ్యవహరించగలవారిగా)గా ఎదగాలి. ఆ పని లోక్‌సత్తా భావజాలం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. దేశంలో పాలనా వ్యవస్థలు ఎలా ఉండాలి, ఎలా ఉన్నాయి, ఏం చేస్తే మారతాయి.. మొదలైన వన్నీ ఒక సమగ్ర దృక్పథంతో, కార్యకారణ సంబంధంతో; తర్కబద్ధంగా, సాక్ష్యాధారాలను నిష్పాక్షికంగా, లోతుగా ఎలా పరిశీలించాలి, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేయాలో తెలియచేస్తూ అందిస్తుంది. ఇవన్నీ తెలుసుకోవటం, మీ పరిధిలో పరిష్కారంలో భాగమవటం ఏదో నిస్వార్థ సేవ, త్యాగం కాదు. మీ స్వార్థం మీకు నిజంగా అర్థమవటం. రాజకీయం స్పృశించని రంగమంటూ లేనప్పుడు, మంచి పాలనను కేవలం కొన్ని పార్టీలు, కొద్ది మంది నాయకులకే వదిలేస్తే.. చివరికి మీ అభివృద్ధి, తర్వాతి తరాల భవిష్యత్తు మీరు ఆశపడినట్లు ఉండకపోవచ్చు. కాబట్టి జ్యోతిష్యం కంటే రాజకీయాన్ని, సమాజహితాన్ని హేతుబద్ధంగా పట్టించుకోవటం మన లాభం కోసమే.

ఈ క్రమంలో తెలుసుకోవటానికి, ఆచరించటానికి సులభంగా ఉండే కోర్సుల ద్వారా ఏడాదికి 1,000 మందికి శిక్షణనిచ్చి థాట్ లీడర్స్‌గా తయారుచేయాలని లోక్‌సత్తా సంకల్పించింది. పది పదిహేను మంది నాయకులను తయారుచేయటానికే అన్ని వనరులూ, హంగులూ ఉన్న జాతీయ పార్టీలకే దశాబ్దాల కాలం పడుతుంది. అలాంటిది ఏడాదిలో వెయ్యి మందిని తయారుచేయాలన్న లోక్‌సత్తా సంకల్పం వెనుక ఉన్న నమ్మకం- భావజాల స్పష్టత, గత అనుభవాలు, మానవాళి చరిత్రలో ఎన్నడూలేని సాంకేతికత ఈవేళ అందుబాటులోకి రావటం, మనుషులు పుట్టుకతో సమానమే కాదు, నిజాయతీపరులు కూడా అని విశ్వసించటం. ఇలా ఏడాదికి వెయ్యి మంది తయారవుతూ తమ లాంటి వారిని తయారుచేస్తూంటారు. థాట్ లీడర్స్ పెరుగుతుండటం వల్ల సమాజంలో బహిరంగ చర్చ సరైన దిశలోకి, సమగ్రంగా మారుతుంది. ఏఐ సహా ఎలాంటి సవాళ్లు ఎదురైనా పరిశోధనలు, వ్యవస్థలు వంటివి మానవాభివృద్ధి కోణంలో వేళ్లూనుకుంటాయి. స్థానిక సమూహాల నిర్మాణం, సహకార సామాజిక జీవనం వల్ల సాంకేతికతల ప్రయోజనాలు పెరిగి, దుష్పరిణామాలు పరిమితమవుతాయి. ఈ విధంగా ప్రజల్లో అవగాహన పెరిగి, బహిరంగ చర్చలో ప్రామాణికంగా భాగస్వాములై, పరిశోధనలతో ఆచరణసాధ్య పరిష్కారాలను గుర్తిస్తూ, విధాన నిర్ణేతలను ప్రభావితం చేయటం లేదా ఇతరుల్లో స్ఫూర్తిని నింపటం నిరంతరాయంగా కొనసాగుతుంటే.. లోక్‌సత్తా సంకల్పం నెరవేరుతున్నట్లే.

## 2. ప్రజల చర్చను డిజిటల్ మీడియా ద్వారా నిర్మాణాత్మకంగా మలచటం

ప్రజల్లో అవగాహనతో కూడిన చర్చకు టెక్నాలజీని ఒక బలమైన చోదకశక్తిగా వినియోగించలమని లోక్‌సత్తా అనుభవపూర్వకంగా నమ్ముతోంది. ఈవేళ దేశవ్యాప్తంగా లోక్‌సత్తా భాషను మాటవరసకైనా ఉచ్ఛరిస్తున్నారంటే, అందులో అన్ని రకాల సంప్రదాయ, డిజిటల్ మీడియాల పాత్ర ఉంది. లోక్‌సత్తా యూట్యూబ్ ఛానళ్లు, ఇతర డిజిటల్ వేదికలు భారతదేశ భవిష్యత్తుకి అవసరమైన అంశాల మీద పరిష్కారాల దిశగా కేంద్రీకరించటం కొనసాగిస్తుంటాయి. గత కొన్నేళ్లుగా ఎక్కువగా డిజిటల్ మీడియాను వినియోగించుకుంటున్నాం.

మీరు గమనించే ఉంటారు- లోక్‌సత్తా డిజిటల్ వేదికల ద్వారా విధానపరమైన అంశాలను ఆయా సందర్భాల్లో తెలియచెప్పటం తప్ప, భావోద్వేగాలు, పక్షపాతాలుండవు.

భారతదేశ విస్తృత ప్రయోజనాల కోణంలో ఆయా పరిణామాలను ప్రజలు అర్థంచేసుకునేందుకు లోక్‌సత్తా డిజిటల్ కంటెంట్ సహాయ పడుతుంది. ఈ వేదికల్ని లోక్‌సత్తా 2.0 ఇంకా బలోపేతం చేస్తుంది. హేతుబద్ధ విశ్లేషణ, సాక్ష్యాధారాలు, నిర్మాణాత్మక ప్రత్యామ్నాయాలను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకే కాకుండా దేశవ్యాప్తంగా పౌరులందరికీ అందించాలన్నది లోక్‌సత్తా లక్ష్యం. 'తక్షణ సంచలన వార్తలను దాటి నిజమైన, ప్రజల జీవితాల్ని ప్రభావితం చేసే అంశాలపై బహిరంగ చర్చకు దోహదం చేయటమే' లోక్‌సత్తా భవిష్యత్తు కార్యాచరణ.

3. చిన్న పట్టణాల్లోని పౌరులను డిజిటల్‌గా సంధానించటం ఒక జాతీయ ఉద్యమం కేవలం కొన్ని మహానగరాలకు పరిమితం కాలేదు. ప్రతిచోటా సంస్థాగత నిర్మాణాలు చేసే ఖరీదైన సాంప్రదాయ పద్ధతులు అవసరం బాగా తగ్గటం కూడా లోక్‌సత్తా 2.0కి కలిసొచ్చే అంశం. ప్రజల్ని భాగస్వాముల్ని చేయటాన్ని ఇప్పుడు డిజిటల్ సాంకేతికత అత్యంత సమర్థంగా, సులభంగా చేస్తోంది.

కాబట్టి, లోక్‌సత్తా విజన్ పట్ల స్థూల ఆమోదంతో సంధానమవటానికి, నేర్చుకోవటానికి, చర్చించటానికి ప్రజలు ఎక్కడ నుండైనా పాల్గొనవచ్చు. ఈ అవకాశాల్ని అందరికీ అందుబాటులోకి తేవటం కోసం చిన్న పట్టణాలు, నగరాలలోని పౌరుల్ని ఆన్‌లైన్ సభ్యులుగా నమోదు గావించటం, నెట్‌వర్క్‌లుగా రూపొందించటానికి సిద్ధమవుతున్నాం. తమ స్థానిక ప్రజలకు, పరిస్థితులకు అనుగుణమైన అంశాలపై సంఘటితంగా పనిచేసేందుకు, సమస్యల్ని పరిష్కరించుకునేందుకు ఒక ఉమ్మడి వేదికను నిర్మించటం ఈ విజన్‌లో భాగం. భారతదేశం మొత్తం మూస పోసినట్లు ఒకే ఏకీకృత నిర్మాణాన్ని సృష్టించాలన్నది లక్ష్యం కాదు. వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు ఒకరినొకరు తెలుసుకోవటం, ఆలోచనలను పంచుకోవటం, ఉమ్మడి సమస్యలను పరిష్కరించుకోవటం వారి పరిధిలోనే సాధ్యమయ్యేలా చేయటం ఈ కార్యక్రమ సంకల్పం.

## 4. లోక్‌సత్తా ఆలోచనలు, అనుభవాన్ని భద్రపరిచే డిజిటల్ భాండాగారాన్ని నిర్మించటం

మూడు దశాబ్దాల పరిశోధన, ఆ పరిష్కారాల కోసం వాదించటం, ప్రజాభిప్రాయాన్ని సమీకరిస్తూ ప్రభుత్వాల్ని ఒప్పించే లోక్‌సత్తా కార్యాచరణ నుండి వ్యవస్థలు, ప్రభుత్వ విధానాలు, పాలనా సంస్కరణలు, ఎన్నికల సంస్కరణలు, భారతదేశం నేర్చుకోదగిన అంశాలున్న అనేక ప్రయోగాలు, విజయాలు, వైఫల్యాలపై అపార పరిజ్ఞాన సంపద రూపొందింది. ఈ జ్ఞానమంతా అందరికీ అందుబాటులో ఉండటం విస్తరించాలి.

ఈ నేపథ్యంలో, తన పరిశోధన, సాక్ష్యాధారాలు, తీర్మానాలు, విధాన సిఫార్సులను డిజిటల్ భాండాగారంగా (రిపోజిటరీ) ఒకచోట భద్రపరిచే నిర్మాణం గావించటం లోక్‌సత్తా 2.0 కార్యాచరణలో కీలకంగా ఉంటుంది. ఇది పౌరులు, పరిశోధకులు, జర్నలిస్టులు, విద్యార్థులు, విధాన నిర్ణేతలు, భవిష్యత్తు తరాలకు అందుబాటులో ఉంటాయి.

ముఖ్యమైన పరిణామాలను, పరిశోధన, విశ్లేషణ, ఆ సమయంలో లోక్‌సత్తా పరిశోధనా బృందం ఏ సంస్కరణలపై కృషి చేస్తున్నారు.. తదితర అంశాలన్నిటినీ ఒక చోటికి చేర్చి అందుబాటులో ఉండే ఫార్మాట్‌లో నిర్ణీత కాల వ్యవధిలో అందించేందుకు న్యూస్ లెటర్‌ను ప్రవేశపెడుతున్నాం. దేశంలో జరుగుతున్న నిజమైన పరిణామాలు, ఎందుకు ఆ అంశాలు మాత్రమే ముఖ్యం, ఆ పరిణామాల వెనుక ఆలోచనలు, సాక్ష్యాధారాలు, మూల కారణాల్ని లోతుగా పరిశీలించటం మొదలైన అంశాల్ని భారతదేశ భవిష్యత్తు గురించి ఆలోచించేవారందరికీ అందుబాటులోకి తేవటం న్యూస్ లెటర్ లక్ష్యం.

## 5. 'మూవ్ హైదరాబాద్' ద్వారా పౌరులతో కార్యాచరణ




లోక్‌సత్తా భావజాలం, పరిజ్ఞానం ప్రజల రోజువారీ జీవితంలో సాధికారతగా మారాలంటే, వారి క్రియాశీల భాగస్వామ్యం కూడా అవసరం. కాబట్టి, తమ చుట్టూ ఉన్న ప్రజా సమూహాలపై (కమ్యూనిటీలు) నేరుగా ప్రభావం చూపే అంశాలపై పౌరులు సంఘటితంగా పనిచేసేందుకు లోక్‌సత్తా 2.0 అవకాశాలను అందిస్తుంది. కోటి మందికిపైగా జనాభాతో వేగంగా పెరుగుతున్న తెలుగు వారి, భారతీయుల అభిమాన మహానగరంలో ట్రాఫిక్ సంక్షోభం ఉన్నకొద్దీ దుర్భరమవుతూ, ఆర్థిక, ఉపాధి అవకాశాల మీదా ప్రతికూల ప్రభావం చూపుతున్న నేపథ్యంలో ప్రారంభించిన 'మూవ్ హైదరాబాద్' కార్యక్రమం ఇందుకు ఒక ఉదాహరణ.

ప్రయాణించటం అనేది కేవలం రోడ్లు, బస్సులు లేదా ట్రాఫిక్ నిర్వహణకి సంబంధించిన అంశం కాదు. ప్రజలు

ఎంత నాణ్యతతో తమకు నచ్చిన జీవితాల్ని గడపగలుగుతున్నారనేదానికి కూడా అది నిదర్శనం. వారి నగరంలో సంపదసృష్టి కార్యక్రమాలకు చలనశీలత, మూవ్ (మొబిలిజేషన్) ఎలా ఉంది, ఎలా విస్తరిస్తోందీ కూడా ప్రయాణం తెలియచేస్తుంది.

ఈ నేపథ్యంలోనే, మూవ్ హైదరాబాద్‌ని పౌరుల నేతృత్వంలో ప్రచారోద్యమంగా లోక్‌సత్తా రూపొందించింది. ప్రజలు ఏం చేయాలో నిర్దేశించి, ఆమోదించండి అని లోక్‌సత్తా అడగటం లేదు. మహానగరంలో ఇంటి నుండి బయల్దేరి తిరిగి చేరేవరకు వాహనదారులుగా, పాదచారులుగా, బస్సు, మెట్రో ప్రయాణీకులుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని, అందుబాటులో ఉన్న పరిష్కారాల్ని తెలియచేస్తూ.. ప్రజల వైపు నుండి సూచనల్ని ఆహ్వానించింది. తమ నగరం ఎలా ఉండాలని కోరుకుంటున్నారో లోక్‌సత్తా వేదిక ద్వారా ప్రజలు తెలియచేయవచ్చు. మెరుగైన ఫలితాల కోసం సూచనల్ని తెలియచేస్తూ వాదనలు వినిపించవచ్చు.

ఉద్యమంలో మీరూ భాగస్వాములు కావటానికి మూవ్ హైదరాబాద్ ప్రచారం రకరకాల మార్గాల్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది: మీరు ఆయా సమస్యల గురించి తెలుసుకోవచ్చు, మీకు తెలిసిన సమాచారాన్ని, అనుభవాల్ని తెలియచేయవచ్చు, సర్వేల్లో పాల్గొనవచ్చు, ఆలోచనల్ని అందించవచ్చు, నిర్దిష్ట ప్రచారాలకు మద్దతివ్వొచ్చు లేదా ఇరుగుపొరుగు ప్రాంతాలు, కమ్యూనిటీలకు ఈ చర్చను తీసుకెళ్లేందుకు సహాయపడవచ్చు.

మూవ్ హైదరాబాద్ కేవలం జీహెచ్ఎంసీలో మెరుగైన రవాణా కోసం పరిష్కారాల ప్రచారం మాత్రమే కాదు. ఈ పరిస్థితి చాలా నగరాల్లో ఉంది. అందువల్ల, ఇది ఇతర ప్రాంతాలవారూ అమలు గావించుకోగలిగిన, విషయ పరిజ్ఞానం గల పౌరులు తాము ఉంటున్న నగరాలను ఏ విధంగా తీర్చిదిద్దుకోగలరో తెలియచెప్పే ఒక ప్రజాస్వామిక ప్రయోగం కూడా.

ముగింపు

ప్రజల అనుభవాలు, ప్రశ్నలు, సూచనలు ఎంత ఎక్కువగా వస్తే, లోక్‌సత్తా 2.0 ప్రయత్నం అంత ఎక్కువగా భారతదేశానికి, సమాజానికి ఉపయోగపడుతుంది. వేల ఏళ్ల గొప్ప జ్ఞానసంపదను దేశంలో అత్యధికులు నేర్చుకోనీయకుండా, వినటానికి సైతం వీల్లేకుండా మహిళల చెవుల్లో సీసం పోయటం, సముద్రం దాటి విస్తరించకుండా అడ్డుకోవటం వల్ల భారతదేశం ఎంత నష్టపోయిందో మనకు తెలుసు. చుట్టూ అడ్డుగోడలు నిర్మించుకోవటం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశ వాటా 25% నుండి 2%కి పడిపోయింది. అదేవిధంగా, ఒక సంస్థ జ్ఞానసంపద ఎంత గొప్పదైనా పేటికాంతర రత్నాల్లా మిగిలిపోకూడదు. ప్రతి ఇంటికీ ఆ రత్నకాంతులు సోకాలి. ప్రజల రోజువారీ జీవిత చర్చగా మారాలి. ప్రజల్లో నిద్రాణంగా ఉన్న అవగాహనాశక్తిని మేలుకొలపాలి. వారి ఆలోచనల్ని పదునెక్కించాలి. వారిలో కార్యాచరణ స్ఫూర్తిని నింపాలి. అందుకే గడచిన ముప్ఫై ఏళ్ల కంటే అనేకరెట్లు విస్తృతంగా లోక్‌సత్తా 2.0 ప్రజల ఆస్తి కావాలి.

లోక్‌సత్తా జ్ఞాన సంపదను, పరిశోధన, వాటి ద్వారా నిరూపితమైన వాస్తవాల్ని ప్రజల క్షేత్రంలో అందుబాటులో ఉంచుతాం. తేలిగ్గా, ఏది అసలు, ఏది నకిలీ (డీప్ ఫేక్) తెలుసుకోగలిగిన విశ్వసనీయ మార్గాలతో, ఉపయోగకరంగా ఉండే విధంగా అందిస్తాం. కొందరు తమకు నచ్చిన అంశాలలో లోతైన కృషితో భాగస్వాములు అవ్వొచ్చు. కొంతమంది ఆ ఆలోచనల్ని తాము నిర్వహిస్తున్న, పనిచేస్తున్న సంస్థలు, స్థానిక ప్రజా సమూహాల కోసం వినియోగించుకోవచ్చు. ఇంకొందరు మా ఆలోచనల్నే సవాలు చేసి మెరుగుపరచటానికి సహాయ పడవచ్చు. ఈ ఆలోచనల్ని వినియోగించటంలో పూర్తిగా కొత్తమార్గాలను ఆవిష్కరించవచ్చు.

ఈవేళ భారతదేశం ముందున్న సవాళ్లు సామాన్యమైనవి కావు. కానీ మనకు అందుబాటులో ఉన్న పరిష్కారాలు కూడా తక్కువేమీ కాదు. అయిదువేల ఏళ్ల అవిచ్ఛిన్న భారతీయ చరిత్రలో ఎన్నడూలేని అద్భుత సాంకేతికత ఈవేళ మనకు అందుబాటులోకి వచ్చింది. ఏతరంవారికీ లేనంతగా సమాచారం ఇప్పుడు అందుబాటులో ఉంది. యువ జనాభా అత్యధిక సంఖ్యలో ఉంది. పౌరుల నెట్‌వర్క్‌ని విస్తరించుకోవటం, వారి అభిప్రాయాలను సమన్వయం చేయటానికి మునుపెన్నడూలేని అవకాశాలున్నాయి. ప్రపంచంలో ఏ మూల ఏ గొప్ప ఆలోచన, సాంకేతికత వచ్చినా వేగంగా మన దేశానికీ వస్తోంది. ఈ వనరులన్నిటినీ మనం సద్వినియోగం గావించుకోవాలి.

పుట్టుకతో వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలను అందించటం, నివారించదగ్గ బాధలను తొలగించటం.. అనే మౌలిక లక్ష్యానికి కొనసాగింపుగా లోక్‌సత్తా 2.0 కొత్త తరంలోకి ప్రవేశిస్తోంది. ప్రతి అవకాశాన్నీ సందర్భానుసారంగా వినియోగించుకుని సంస్కరణను సాధించటాన్ని మేం కొనసాగిస్తుంటాం. దీంతోపాటు, ఈ ఆలోచనల్ని అవగాహనతో ముందుకు తీసుకెళ్లే సామర్థ్యం ఉన్న పౌరులను, ముఖ్యంగా కొత్త తరాన్ని తయారుచేయటంపైనా సమయం, వనరుల్ని వెచ్చిస్తాం. కాబట్టి, ఇక ముందు లోక్‌సత్తా విజయాల్ని ఒక రాజకీయ ఉద్యమ సంస్థగా ప్రభావితం చేస్తూ, సహాయ సహకారాల్ని

అందిస్తూ సాధించే సంస్కరణల ప్రాతిపదికన మాత్రమే చూస్తే చాలదు. వీటిని ఎంతమంది అర్థం చేసుకున్నారు, ప్రజల్లో, చట్టసభల్లో బహిరంగ చర్చను లోక్‌సత్తా భావజాలం ఎంతవరకు ప్రభావితం చేస్తోంది, ఎంతమంది థాట్ లీడర్స్ తయారవుతున్నారు, లోక్‌సత్తా ప్రయత్నం లేకుండానే ఆ భావజాలంలోని ఎన్ని ఆలోచనలు భారతదేశాన్ని వాటంతటవే ప్రభావితం చేస్తున్నాయి మొదలైన అంశాల ప్రాతిపదికన కూడా గణన చేయాలి.

ప్రజాస్వామ్యాన్ని నిర్మాణాత్మకంగా పనిచేయించటం నిరంతరం చేయాల్సిన పని. ప్రతి తరం తమ ముందు తరాలు నిర్మించిన వ్యవస్థల్ని వారసత్వంగా అందు కుంటారు. వాటిని తమ తర్వాతి తరం కోసం మెరుగు పర చాల్సిన బాధ్యత కూడా.. ప్రతి కొత్త తరానికీ ఉంటుంది. ఈ బాధ్యతను లోక్‌సత్తా మూడు దశాబ్దాలుగా కొనసాగి స్తోంది. దీన్ని కలిసి ముందుకు తీసుకెళ్లేందుకు అందరికీ, ముఖ్యంగా యువతకి ఆహ్వానం లోక్‌సత్తా 2.0.

## ఈ డిజిటల్ వేదికలు మీ కోసమే (Stay connected):

లోక్‌సత్తా 2.0 కార్యాచరణ ఈ డిజిటల్ వేదికల ద్వారా మీకు అందుబాటులో ఉంటుంది. శోధించండి, నేర్చుకోండి, అందులో భాగమవ్వండి. ఏదైనా అంశం మీకు సంబంధించినది అనుకున్నప్పుడు, చర్చించండి.

Foundation for Democratic Reforms (FDR)
Visit our website for all the latest updates
www.fdrindia.org

@ JPLokSattaOfficial on YouTube
Discussions, analysis and perspectives on issues shaping India's democracy and governance
https://www.youtube.com/@JPLoksattaOfficial

Move Hyderabad
A citizen-led campaign for better urban mobilty and a better Hyderabad
https://www.movehyderabad.com/

FDR Newsletter
Periodic updates bringing together Loksatta/FDR's research, analysis, ideas and ongoing work
https://www.fdrindia.org

# ఓట్ల కొనుగోలుపై చంద్రబాబు బహిరంగ ఒప్పుకోలు.. ఎన్నికల సంస్కరణల బాధ్యత ప్రజలదా? ప్రభుత్వాలు, పార్టీలదా?

తెలుగుదేశం అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎనభయ్యవ స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఓ విజ్ఞప్తి చేశారు. మహిళలకు ఆర్థికంగా ఉపయోగపడాలనే లక్ష్యంతో ఆర్‌టీసీ బస్సులో ప్రవేశపెట్టిన ఉచిత ప్రయాణ కార్యక్రమం 'స్త్రీ శక్తి' వార్షికోత్సవంలో మాట్లాడుతూ.. ఎన్నికల్లో డబ్బులు తీసుకోవటం మనం ఎందుకు మానుకోలేం? అని ప్రశ్నించారు.

"ఏ రాజకీయ నాయకుడూ ఇంటిలో నుండి డబ్బులు తీసుకురారు. వాళ్లు ఇచ్చేదంతా లంచాల సొమ్మే. ఎన్నికల్లో రూ.2 వేలు ఇస్తే, దానికి రూ. 2 లక్షలు సంపాదించు కుంటారు. అంటే, వాళ్లు సంపాదించుకునే దానిలో మీకు చిల్లర విదులుస్తారు. ఓటు కోసం మీకు రూ.2 వేలు ఇచ్చాక, వీళ్ల కోసం ఎందుకు పనిచేయాలి, అసలు వీళ్ల దగ్గరకు ఎందుకు వెళ్లాలి అనే చులకన భావం నేతల్లో వస్తుంది.



"ఎన్ని పనులు చేసినా, పథకాలు అమలు చేసినా.. తాత్కాలిక ప్రయోజనం వస్తే జనం అటు వెళ్లిపోతుంటారు. ఎన్నికల్లో పది రూపాయలు ఎక్కువ ఇస్తామంటే, వాళ్లకు ఓటేస్తున్నారు. దీనిపై ఆత్మవిమర్శ చేసుకోవాలి. నేతలు డబ్బులు ఇస్తుంటే.. మాకు నీతి ఉందని చెప్పండి. డబ్బులు తీసుకోకుండా ఓటేయండి. మిగిలినవారిలోనూ దీనిపై అవగాహన కల్పించండి. దీనివల్ల మీకు నాలుగు రెట్లు ఫలితం వస్తుంది" అని చంద్రబాబు హితవు పలికారు.

ఆ తర్వాత అనకాపల్లి జిల్లాలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో, "ప్రజలు నిజాయతీగా ఉంటే.. నేతలూ తప్పులు చేయరు. ఎన్నికల్లో డబ్బు ప్రభావం లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉంది. అది సాధ్యమైతేనే రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్ అవుతుంది. పరిసరాల్లో చెత్తను తొలగిస్తున్నట్లే, రాజకీయాల్లోనూ చెత్తను పారదోలాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలకు మేలుచేసే నాయకులను ఎన్నుకోవాలి. మంచి పనులు చేసేవారిని ప్రోత్సహించాలి" అని సీబీఎన్ పిలుపునిచ్చారు.

### తీవ్రంగా స్పందించాల్సిన అంశం

ఇది నిజంగా ఎన్నికల సంఘం, మిగతా రాజ్యాంగ వ్యవస్థలు, పౌర సమాజం తీవ్రంగా స్పందించాల్సిన అంశం. ఒక ముఖ్యమంత్రి ఎన్నికల్లో డబ్బులు పంచుతామని, ప్రతిఫలంగా అవినీతికి పాల్పడతామని అంత బహిరంగంగా చెప్పాక కూడా మనం స్పందించకపోతే.. రాజకీయాలు, ప్రజాస్వామ్యంలో లోపాల్ని ఇంకెలా సరిదిద్దగలం? గతంలో మహారాష్ట్రలో గోపీనాథ్ ముండే లాంటి నేతలు ఈ మాట అన్నప్పుడు ఎన్నికల సంఘం సంస్కరణల చర్చ కోసం ప్రయత్నం చేయకుండా, వివరణకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. అదేవిధంగా, 2019, 2024లో ఓటుకు నోట్లు తీసుకున్న ప్రజలని జైలులో పెట్టాలని కొందరు వాదించారు. ఇవన్నీ విశ్వసనీయత కోల్పోయే దాంబికాలే తప్ప.. సమస్యలు పరిష్కరించే ధోరణులు కావు. ఒక నియోజక వర్గంలో డబ్బు తీసుకుని ఓటు వేసిన వారిని జైల్లో పెట్టటానికి కూడా దేశంలోని కారాగారాలన్నీ కలిపినా సరిపోవు. ముఖ్యమంత్రి ఈ మాటలు అన్నాక, ఎన్నికల సంస్కరణలకు ఇదో అవకాశంగా వినియోగించుకోవాల్సిన బాధ్యత అందరిదీ. ఎన్నికల సంఘం ఇందుకు చొరవ చూపాలి.

నిజానికి ఓట్ల కొనుగోలు జాడ్యాన్ని దేశవ్యాప్తం చేయటంలో ఎక్కువ పాత్ర చంద్రబాబుది. ఎన్.టి.ఆర్‌ని గద్దెదించాక ఎన్నికల్లో గెలవటానికి ఉపఎన్నిక నుండి మొదలుపెట్టి సాధారణ ఎన్నికల వరకూ డబ్బు వెదజల్లారు. ఆంధ్రప్రదేశ్ నుండి అలా 1995 కాలంలో మొదలైన ఓటుకు నోట్లు ఆ తర్వాత కేరళ మినహాయించి మొత్తం దక్షిణాదికి, జమ్మూ కశ్మీర్ సహా ఉత్తరాదిలోని పలు రాష్ట్రాలకు వ్యాపించి పోటీకి ఎంట్రీ ఫీజుగా మారిపోయింది. కేసీఆర్ హయాంలో మునుగోడు, హుజూరాబాద్ ఉప ఎన్నికల వ్యయం ప్రపంచ రికార్డు సృష్టించాయి. రాష్ట్ర విభజన జరిగాక 2014లో కూడా ఓటుకు నోట్ల కట్టల కేసులో చంద్రబాబు, రేవంత్ ఇద్దరూ నిందితులు. అదేవిధంగా, పరిశేష ఆంధ్రప్రదేశ్‌కి తొలి ముఖ్యమంత్రిగా ఢిల్లీకి తరచూ వెళ్లి యూనియన్ ప్రభుత్వ సహాయం కోసం చంద్రబాబు ప్రధాని మోదీని

## ఎవరు డబ్బులు ఎక్కువ ఇస్తే వాళ్లకే ఓటు వేస్తారా?




అడుగుతుండేవారు. 'ప్రజలకు అన్నన్ని ఉచితాలు, అంత డబ్బు పంచటం ఎందుకు?' అని మోదీ అడిగేవారట. అవి ఇవ్వకపోతే, గెలవటం కష్టం అని బాబు వివరణ ఇచ్చేవారు. చివరికి మోదీ కూడా రాష్ట్రాల్లో తాయిలాలు పంచే పరిస్థితి వచ్చింది. ఎన్డీయే నుండి బయటికొచ్చి మళ్లీ చేరి ఏపీలో అధికారంలోకి వచ్చాక, చంద్రబాబు మారుతున్న పరిస్థితుల్లో, యువతలో ప్రశ్నలు పెరుగుతున్న తరుణంలో ఎన్నికల్లో లెక్కలు చూపని డబ్బు గురించి మాట్లాడాల్సి వస్తోంది. భారీగా డబ్బు వ్యయం చేయగల అభ్యర్థులను వెతకటం, వారి నేరచరిత్రను, అవినీతిని భరించటం, పార్టీ ఎన్నికల నిధికి విరాళాలు సమకూర్చుకోవటం వంటి కష్టం పెరుగుతుండగా.. అందుకు ఫలితాలొస్తాయన్న నమ్మకం మాత్రం తగ్గుతోంది. దీంతో, నోటుకు ఓట్లు అమ్ముకోవటం ఏం నీతి? అనే ప్రశ్న లేవనెత్తారు. ఇది ఒక సానుకూల అవకాశం. కానీ ఇది నైతికంగా హితోపదేశాలతో పరిష్కారమయ్యే సమస్య కాదు. రెండోది, ఎన్నికల సంస్కరణల బాధ్యత ప్రజల మీద, ఎన్నికల సంఘం మీద నెట్టటం పలాయనవాదం.

ఎన్నికల సంస్కరణల కోసం ఎప్పటి నుండో ప్రయత్నిస్తూ, ఈవేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసిస్తున్న భారతదేశ ఓటరు ఐడీ కార్డుల వ్యవస్థ రూపకల్పనకు పరోక్షంగా కారకులైన ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ఎన్నికల్లో డబ్బు, నేరస్తుల ప్రభావాన్ని నిరోధించి సుపరి పాలన అందించగలవారు చట్టసభలకు ఎన్నిక య్యేందుకు రెండు ప్రధాన పరిష్కారాలు ప్రతిపాదించారు. ఒకటి, ఎన్నికల సంస్కరణలు. రెండు, స్థానిక ప్రభుత్వాల సాధికారత. ఈ రెంటిలోనూ చంద్రబాబు ప్రత్యక్ష వైఫల్యం ఉంది.

స్థానిక ప్రభుత్వాలకు భారతదేశంలో నిధులు, అధికారాలు మొదటి నుండి ఇచ్చివుంటే, డబ్బుతో ప్రమేయం లేకుండా సామర్థ్యం, పరిపాలనా అనుభవంతో వందల సంఖ్యలో పైస్థాయికి ఎదిగేవారు. ప్రజాస్వామ్యానికి పాఠశాలల్ని నామమాత్రం చేయటం వల్ల నాయకులు కరువవటమే కాదు.. ప్రజలకు తాము ఎందుకు ఓటు వేస్తున్నామో, ఆ ఓటు తమ జీవితంలో, కుటుంబంలో ఎలాంటి మంచి మార్పు తేగలదో అర్థం చేసుకునే శక్తి కరువైంది. అందువల్ల, ఎన్నికల సమయంలో వసూళ్లు, ఆ తర్వాత డిమాండ్లు, నెరవేర్చకపోతే దిగిపోవాలనే అరుపులు. కాబట్టి, రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తున్న 60% నిధుల్లో కనీసం సగం పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు బదిలీ చేసి స్థానికంగా ప్రజా కమిటీల భాగస్వామ్యంతో ఖర్చయ్యే ఏర్పాటు జవాబుదారీతనంతో చేయాలి. అయితే ఇది మౌలిక సంస్కరణే అయినా, ఎనభై ఏళ్ల తర్వాత అమలు వల్ల వెంటనే ఫలితాలొచ్చే అవకాశం తక్కువ. త్వరలో జరగనున్న మునిసిపల్ ఎన్నికల్లో నీతి ఆయోగ్ సూచనను అనుసరించి, చంద్రబాబు ప్రభుత్వం మేయర్లు, చైర్మన్లకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించనుంది. స్థానిక ప్రభుత్వాల ఆదాయవ్యయాలు దేశాభివృద్ధికి కీలకమని కూడా నీతి ఆయోగ్ పేర్కొంది. అదేవిధంగా, సుమారు పాతికేళ్ల క్రితం లోక్‌సత్తా చేసిన 1 కోటీ 8 లక్షల సంతకాల సేకరణ సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్థానిక ప్రభుత్వాల సాధికారతకు, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పౌరసేవలకు ఆలస్యానికి పరిహారంతో రైట్ టూ సర్వీసెస్ చట్టానికి హామీ ఇచ్చారు. కాబట్టి, డబ్బుతో ఓట్ల కొనుగోలు అవసరంలేని మార్పు క్రమంగానైనా సుస్థిరంగా రావటానికి చంద్రబాబు వెంటనే స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాల బదిలీ అమలు చేయాలి.

ఈలోగా, ఒక్క ఓటుతో గెలుపోటముల్ని తారుమారు చేస్తున్న మన ప్రస్తుత ఎఫ్‌పీటీపీ ఎన్నికల వ్యవస్థను మార్చాలి. మన దేశం ఉన్న పరిస్థితుల్లో ఓట్ల కోసం వెంపర్లాటను తగ్గించేందుకు ప్రతి ఓటుకూ విలువ ఉండే పద్ధతి తేవటం వల్ల డబ్బు ఖర్చు తగ్గటంతోపాటు.. రాజకీయ ప్రాతినిధ్యం కోసం వివిధ వర్గాల డిమాండ్లకు కూడా సరైన సమాధానం లభిస్తుంది. దీనివల్ల స్థానిక ప్రభుత్వాల ద్వారా వచ్చే సుస్థిర మార్పు రాకపోవచ్చుగానీ, సమస్య నియంత్రణలోకి వస్తుంది. కనీసం ప్రత్యక్ష ఎన్నికల వరకు ఈ పద్ధతిని ప్రవేశపెట్టి, కొన్ని పరోక్ష ఎన్నికల్లో ఎఫ్‌పీటీపీని కొనసాగించినా నష్టం తగ్గుతుంది. ప్రజలకు ఓటు విలువ,

(మిగతా 34పేజీలో)

# వాస్తవాల్ని తెలియజేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే

**ఎన్నికల కమిషన్‌పై గతంలో ఎన్నడూ లేని విధంగా అనేక ఆరోపణలు వచ్చాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ ఓ పత్రిక కథనం ప్రచురించింది. దేశవ్యాప్తంగా ప్రధాన కమిషనర్ రాజీనామా కోరుతూ ఆందోళనలు జరుగుతున్నాయి. 'సర్' నిర్వహణను కొన్ని పక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ పనితీరు ఎలా ఉండాలి..ఎలాంటి మార్పులు అవసరం..రాజ్యాంగబద్ధ సంస్థలు ఎవరికి జవాబుదారీగా ఉండాలి..వ్యవస్థలు గాడి తప్పితే న్యాయవ్యవస్థ ఎలా వ్యవహరించాలి..తదితర అంశాలపై ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించిన వివరాలు జనబలం పాఠకుల కోసం..**

**సార్, ఎలక్షన్ కమిషన్ పనితీరు, ఎస్ఐఆర్(సర్) నిర్వహణ, ఓట్ల తొలగింపు మీద చాలా విమర్శలు వస్తున్నాయి. వీటిపై మీ అభిప్రాయం...**

జేపీ : మనం మూడు విషయాలని వేరువేరుగా చూడాలి . మొట్టమొదటిది..ఎన్నికల సంఘం కానీ మరో సంస్థ కానీ చట్టబద్ధంగా ఏర్పాటైన సంస్థలు కావచ్చు, రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన సంస్థలు కావచ్చు. ఎన్నికైనటువంటి చట్టసభలకి ఈ సందర్భంలో పార్లమెంట్‌కి జవాబుదారీ.



ప్రజాస్వామ్యంలో ఎవరూ స్వయంభులు కాదు. ప్రజలు తమ మీద తమకున్న అధికారాన్ని, తమ సార్వభౌమత్వంలో కొంత భాగాన్ని ఉమ్మడి ప్రయోజనాలు నెరవేర్చాలని ఎన్నికల ద్వారా ఎన్నికైన ప్రతినిధులకి, ఎన్నికైన సభకి ఇచ్చారు. కాబట్టి దేశంలో ఏర్పడిన ప్రతి సంస్థ చట్టబద్ధంగా వచ్చినా రాజ్యాంగబద్ధంగా వచ్చినా కూడా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆ పార్లమెంట్‌కి లేదా రాష్ట్ర స్థాయిలో అయితే రాష్ట్ర చట్టసభకి జవాబదారీగా ఉండాలి. కాబట్టి ఈ ప్రశ్నలు వస్తే ఆ ప్రశ్నకు సమాధానం చెప్పే బాధ్యత ఎన్నికల సంఘానికి ఉంది. అదే మాట కొన్ని పార్టీలు కూడా ప్రస్తావించినట్లు నేను పత్రికల్లో చూశాను. తెలుగుదేశం పార్టీ, లోక్ జనశక్తి పార్టీ మరో పార్టీ. ఈ మూడు కూడా నా దృష్టిలో చాలా సరైనటువంటి ప్రకటన చేశాయి. ఎన్నికల గురించి భయాందోళనలు ఉన్నప్పుడు సందేహాలు వచ్చినప్పుడు దాన్ని నివృత్తి చేసే బాధ్యత ఎన్నికల సంఘానిది. మీరు మౌనంగా ఉండకూడదు.. ప్రజలకి వాస్తవాలు చెప్పండని..అది సరైంది. అప్పటికీ సందేహాలు నివృత్తి కాకపోతే, పార్లమెంట్లో చర్చించే అధికారం, బాధ్యత ఉంది. తప్పుల్ని సవరించడం కోసం పార్లమెంట్ గొంతెత్తాల్సిన బాధ్యత ఉంది. దానిలో అనుమానం లేదు. అది మొట్టమొదటిది. రెండోది..మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం. అమెరికా నుంచి యూరోప్ దేశాల దగ్గర నుంచి మన దేశం దాకా మరీ గత ఐదారు సంవత్సరాలుగా ఈ ప్రజాస్వామ్యంలో అసహనం పెరిగిపోతుంది. అపనమ్మకం పెరిగిపోతుంది. డొనాల్డ్ ట్రంప్ గారు మొదలుపెట్టాడు.. అన్యాయంగా గెలుస్తున్నారు కాబట్టి ఎన్నికైన ప్రభుత్వాన్ని మేము గుర్తించం.. అని ఇది అసంబద్ధం. చాలా ప్రమాదకరమైన వాదన.. అవాస్తవమైన వాదన. ఈ దేశంలో ప్రజాస్వామ్యాన్ని చాలా లోతుగా పరిశీలించిన వాడిగా, కొన్నేళ్ల పాటు ప్రభుత్వంలో ఎన్నికల నిర్వహణని వివిధ స్థాయిల్లో చేపట్టిన వాడిగా..నేను కచ్చితంగా చెప్తాను.. మన ప్రజాస్వామ్యంలో చాలా లోపాలు ఉన్నాయి. ఆ

లోపాల గురించి లోక్‌సత్తా గొంతెత్తినంతగా ఇంకెవరు గొంతెత్తలేదు. కానీ మన లోపం ఎన్నికల విశ్వసనీయతలో దెబ్బ తినడం కాదు. ప్రజల అభీష్టం ప్రకారం ఎన్నికల ఫలితాలు వస్తున్నాయి. తొలి రోజుల్లో అప్పటికి ఇంకా అక్షరజ్ఞానం మరీ తక్కువ, ప్రజల్లో అవగాహన లేదు కాబట్టి అక్కడ స్థానికంగా పెత్తందారులు , కులం పెద్దలు, ఆస్తిమంతులు వాళ్ళు ఏదో ఒక గందరగోళం చేసేవాళ్ళు. ఇవన్నీ క్రమక్రమంగా తగ్గుముఖం పట్టింది.. బ్యాలెట్ బాక్స్ ఉన్నప్పుడు ఫలానా ఊళ్లో మీకు అనుకున్న ఓట్లు పడలేదు.. అనుకున్నట్లయితే వాళ్ళు బ్యాలెట్ బాక్స్‌ని తస్కరించేవాళ్ళు. యాసిడ్, ఇంకు పోసేవాళ్ళు లేకపోతే నూతుల్లో పడేసేవాళ్లు.. ఇలాంటి ఘటనల గురించి మనం చాలా కథనాలు విన్నాం. పత్రికల్లో వచ్చాయి. ఉన్న కొద్దీ అంతా బాగుపడింది. కాబట్టి ఈవేళ ఎన్నికల ఫలితాల విషయంలో అపనమ్మకం ఉండాల్సిన అవసరం ఏమాత్రం లేదు. సమస్య ఎన్నికల ఫలితాల్లో కాదు, ఎన్నికల నిర్వహణలో కాదు, ఎన్నికల సంఘం బాధ్యత ఎన్నికల నిర్వహణ మాత్రమే. ఈ రాజకీయంలో ఉన్న లోసుగులు ఎన్నికల సంఘం బాధ్యత కాదు. దానికి పార్లమెంట్ పూనుకోవాలి. ఎన్నికల వ్యవస్థను మార్చాలి. అధికారాన్ని ఉపయోగించే తీరును మార్చాలి. దేశంలో అవినీతి విషయంలో చర్యలు తీసుకోవాలి. చట్టబద్ధ పాలన తీసుకురావాలి. అధికారాన్ని వికేంద్రీకరించాలి. ఇవన్నీ ఎన్నికల సంఘ బాధ్యత కాదు. ఇవి రాజకీయం బాధ్యత. ఈమార్పులపై 30 ఏళ్ల నుంచి నేను గొంతెత్తి మాట్లాడుతున్నాను. దాని మీద ఎవరికీ పెద్దగా ఆసక్తి లేదు. సమస్యలు అవి గానీ, ఎన్నికల ఫలితాలు కాదు. సరే ఎన్నికైన పద్ధతులు బాగోలేదు మనందరికీ తెలుసు. ఓట్లు డబ్బుతో కొంటున్నారు. తాత్కాలికమైన తాయిలాలతో భ్రమల్లో పెడుతున్నారు. వ్యక్తిగత ప్రయోజనాలు తప్ప సమిష్ట ప్రయోజనాలు పక్కన పెడుతున్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో ప్రజల్ని విభజిస్తున్నారు ఇవన్నీ.. దీన్ని ఎలా ఆపాలి. ఇది చట్టంతో జరిగే పనులు కాదు. ఉదాహరణకి ఓట్లకు డబ్బులు ఖర్చు పెట్టడం. తెలుగునాట ఏం జరుగుతుందో మనందరికీ తెలుసు కదా?. దానికి ఎన్నికల సంఘం అందరిని అరెస్ట్ చేస్తాందనుకుంటే.. ఏదో ఒకర్ని అయితే అరెస్ట్ చేయొచ్చు. ప్రతి నియోజకవర్గంలో లక్షల మంది డబ్బులు తీసుకుంటున్నప్పుడు వేల మంది డబ్బులు పంచుతున్నప్పుడు ఎవరు? ఎవరిని ?

“ ఓట్లు డబ్బుతో కొంటున్నారు. తాత్కాలికమైన తాయితాలతో భ్రమల్లో పెడుతున్నారు వ్యక్తిగత ప్రయోజనాలు తప్ప సమిష్ట ప్రయోజనాలు పక్కన పెడుతున్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో మరి ప్రజల్ని విభజిస్తున్నారు ఇవన్నీ.. దీన్ని ఎలా ఆపాలి. ఇది చట్టంతో జరిగే పనులు కాదు. ఉదాహరణకి ఓట్లకు డబ్బులు ఖర్చు పెట్టడం. తెలుగునాట ఏం జరుగుతుందో మనందరికీ తెలుసు కదా. దానికి ఏదో ఎన్నికల సంఘం పోని అందరిని అరెస్ట్ చేస్తాందనుకుంటే.. ఏదో ఒకర్ని అయితే అరెస్ట్ చేయొచ్చు. ప్రతి నియోజకవర్గంలో లక్షల మంది డబ్బులు తీసుకుంటున్నప్పుడు వేల మంది డబ్బులు పంచుతున్నప్పుడు ఎవరు ఎవరిని అరెస్ట్ చేస్తారు. ”

అరెస్ట్ చేస్తారు. ఇది వ్యవస్థీకృతమైన సమస్య మౌలికమైన సంస్కరణ తీసుకురావాలి. అది మర్చిపోయి ఎన్నికల సంఘం బాధ్యత అనుకొని వాళ్ళని తిడుతున్నాం. ఎన్నికల విశ్వసనీయతని ప్రశ్నించడం ప్రమాదకరం. లోపాలని ఎలా సవరించాలో ఆలోచించాలి. ఇక మూడో అంశం ఇప్పుడు ప్రస్తుతం కొన్ని తీవ్రమైన ఆరోపణలు చేసిన తీరు మీద. పద్ధతుల మీద.. ఉదాహరణకి ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు చేసేది స్థానికంగా ఉన్న రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ఆర్డీఓ. ఆయన్ని ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్ఓ) అంటారు. ఆయనకు సహకరించి నిజంగా పని చేసేది తహసీల్దార్. చట్టం ఆ బాధ్యతని ఈ ఇద్దరికీ ఇచ్చింది. తుది నిర్ణయం ఒక పేరు చేర్చాలా? తీసేయాలా? అన్నది ఆర్డీఓకి ఇచ్చారు. ఆర్డీఓకి ఉన్నప్పుడు మీరు జాతీయ స్థాయిలో దాన్ని కేంద్రీకరించేసి ఎన్నికల్లో ఓటర్ల జాబితాలను సవరించే అధికారం అన్న అధికారికి అవకాశం లేకుండా చేశాం. పేర్లు చేర్చే నిర్ణయం, బాధ్యత ఆయనకి చట్టం ఇచ్చింది. మరి అవకాశం ఆయనకు ఇవ్వకుండా పైన మీరు కూర్చుంటే ఎలాగ? ఒకవేళ తప్పు జరిగితే మళ్లీ అప్పీల్ పెట్టుకోండి.

అన్యాయంగా చేస్తే, అవినీతికి పాల్పడితే, శిక్షించి ఏర్పాటు చేయండి. అంతేగానీ చట్టబద్ధంగా, రాజ్యాంగ బద్ధంగా సంక్రమించిన అధికారాలని వాళ్ళు నిర్వహించ కుండా అడ్డుపడడం అనేది చట్ట విరుద్ధం. కాబట్టి అక్కడ ఎన్నిక సంఘమే తప్పు చేస్తుంది.. చట్టం ఉల్లంఘిస్తుంది. ఎన్నికల సంఘం ఇప్పటికైనా కళ్ళు తెరుచుకొని ఆ తప్పుని సవరించాలి లేదంటే కోర్టు పూనుకోవాలి. కోర్టుకి ఆ బాధ్యత ఉంది. అధికారం ఉంది. ఈ ప్రక్రియ అవ సరం. అట్లాగే మరికొన్ని.. లోక్‌సత్తానే 27 ఏళ్ల క్రితం మొట్టమొదటిసారిగా ఈ దేశంలో ఓటర్ల జాబితాలో ఎన్ని అవకతవకలు ఉన్నాయో బయట పెట్టింది.

అప్పటిదాకా నాకు కూడా తెలియదు.. నేను దిగ్భ్రాంతి చెందాను. ఇన్ని తప్పులు ఉంటాయని నేను అనుకోలేదు. అది చూశాక అర్థమైంది. ఆ తర్వాత మూడునాలుగేళ్లలో కొంత మేరకు మంచి మార్పులు వచ్చాయి. కానీ పూర్తిగా బాగుపడలే. కాబట్టి ప్రక్షాళన చేయడం కోసం ప్రయత్నం అవసరం. కానీ ఆ ప్రయత్నం తిక్క తిక్కగా ఉండకూడదు. మరి గుడ్డెద్దు చేలో పడ్డట్టు ఉండకూడదు. కేంద్రీకరించి ఉండకూడదు. అందరికీ అర్థమయ్యేలాగా స్థానికంగా చట్టబద్ధంగా అధికారాలు బాధ్యతలు ఉన్నవాళ్ళ అధికారం సరిగ్గా నిర్ణయించే రీతిలో ఏర్పాట్లు చేయాలి. అక్కడ విజ్ఞత ఉన్నట్టయితే ఎన్నికల సంఘం వాళ్ళు ఏం చేయాల్సింది.. జిల్లా కలెక్టర్ లేకపోతే పెద్ద నగరాల్లో అయినట్టయితే మున్సిపల్ కమిషనర్ ఆయన జిల్లా ఎన్నికల అధికారి. డిస్ట్రిక్ట్ ఎలక్షన్ ఆఫీసర్ అంటారు. మొత్తం ఎన్నికల తతంగం అంతా కూడా ఆయన చేతుల్లోను వారి చేతిలోని అధికారుల చేతుల్లో జరుగుతుంది. సమర్థులైన వాళ్ళని ఎంపిక చేసి కొన్ని రాష్ట్రాల నుంచి ఈ జిల్లా ఎన్నికల అధికారులని అలాగే కొందరు చీఫ్ ఎలక్టరల్ ఆఫీసర్ రాష్ట్ర స్థాయిలో వాళ్ళకి చట్టబద్ధంగా అధికారాలు లేవు కానీ ఎన్నికల సంఘం ప్రతినిధిగా రాష్ట్రంలో ఉంటారు. వారందరినీ కూర్చోబెట్టి..' ఏమయ్యా మీరంతా మల్లగుల్లాలు పడండి భిన్నత్వం బోలెడంత ఉన్న దేశం మనది. ఒక రాష్ట్రంలో ఉన్న తీరు ఇంకో రాష్ట్రంలో ఉండదు. నగరాల్లో ఉండే తీరు గ్రామాల్లో ఉండదు. గ్రామాల్లో ఉండే తీరు కొండ ప్రాంతాల్లో ఉండదు. కాబట్టి ఆ పరిస్థితులని గమనంలోకి తీసుకొని ఏ రకంగా ఈ ఓటర్ల జాబితాను అవకతవకలు లేకుండా తయారు చేయాలో ఆ మార్పులు, చేర్పులు సూచించండి.. ఆ నిబంధనలు

ప్రక్షాళన చేయడం కోసం ప్రయత్నం అవసరం. కానీ ఆ ప్రయత్నం తిక్క తిక్కగా ఉండకూడదు. మరి గుడ్డెద్దు చేలో పడ్డట్టు ఉండకూడదు. కేంద్రీకరించి ఉండకూడదు. అందరికీ అర్థమయ్యేలాగా స్థానికంగా చట్టబద్ధంగా అధికారాలు బాధ్యతలు ఉన్నవాళ్ళ అధి కారం సరిగ్గా నిర్ణయించే రీతిలో ఏర్పాట్లు చేయాలి.

సూచించండి. అని చెబితే.. అప్పుడు దాని మీద వాళ్ళు కూర్చుని ఓ విధానం తయారు చేసి ఇది బాగుంది అనుకుంటే, వారి ఆలోచన సంతృప్తి పరిచినట్లయితే ఓకే అనాల్సింది. ఏమైనా సమస్యలు ఉన్నా కూడా అక్కడ స్థానికంగా ఉన్న దాన్ని బట్టి స్థానికంగా పరిష్కరించకునే అవకాశం ఇవ్వాల్సింది. అలా కాకుండా వాళ్ళు కూర్చుని ఏదో గీతలు గీసి పారేశారు.. మీకు ఏం తెలుసు? మీరు ఎన్నికల్లో ఎంత నిష్ణాతులైనా కూడా మీకు మీ రాష్ట్రం గురించి బాగా తెలుసు. మీ రాష్ట్రంలోనే కొన్ని ప్రాంతాలు వేరే రకంగా ఉంటాయి... వేరే రాష్ట్రాల్లో పరిస్థితి ఇంకో రకంగా ఉంటుంది. కాబట్టి ఈ ప్రక్రియని అంత కేంద్రీకరించడం, అట్లాగే ఆ ఓటర్ల జాబితాలో సవరణని చట్టబద్ధంగా చేసే అధికారం ఉన్న మనిషికి అవకాశం లేకుండా చేయడం, ఇవన్నీ కూడా చాలా తీవ్రమైన తప్పిదాలు. అవి సవరించుకోవాలి. అందుచేత ఒక రకంగా నేను ఆహ్వానిస్తున్నాను. ఎందుకంటే ఎన్నికైనటువంటి ప్రతి సంస్థ, దేశంలో ఉన్న ప్రతి రాజ్యాంగసంస్థ గానీ లేకపోతే చట్టబద్ధంగా ఏర్పడిన సంస్థ గానీ ఎన్నికైన చట్టసభకు ఏదో ఒక రూపంలో జవాబుదారీగా ఉండాలి. పార్లమెంట్ తన అధికారాన్ని ఉపయోగించుకోవడం మానేసింది. ఎన్నో అవినీతి ఆరోపణలు ఉన్నా కూడా న్యాయమూర్తులని తొలగిం చడం సాధ్యం కావట్లేదు. అమెరికా లాంటి దేశంలో నిజంగా సాక్ష్యాధారాలు ఉన్నట్టయితే రక్కున తొలగిం చేస్తారు. మన దేశంలో అసలు భయమే లేదు. కాబట్టి పార్లమెంటు తన ప్రతిష్టను పెంచుకొని దేశంలో ఉన్న అన్ని సంస్థలు మాకు జవాబుదారీగా ఉంటాయని చెప్పి ఆ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా గనుక వ్యవ హరిస్తే చాలా బాగుంటుంది.

అయితే దీనిలో పక్షపాత రాజకీయాలని పక్కన పెట్టాలి. నాకు తెలుసు కష్టం. ఎందుకంటే మన దేశంలో ఏము న్నా కూడా వాడు గెలుస్తాడా? వీడు గెలుస్తాడా? అనేది

తప్ప ప్రజాస్వామ్యం ఏమవుతుంది? ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఏమవుతాయి? లేకపోతే రాజ్యాంగం ఏమవుతుందో మర్చిపోతున్నాం. కాబట్టి ఎలక్షన్లో ప్రభుత్వాల సంగతి చూసుకోండి.. అనుకూలంగా ఉండండి వ్యతిరేకంగా ఉండండి.. కానీ ఇక్కడ ప్రజాస్వామ్యం నిలబడాలని అంటే ప్రజాస్వామ్యంలో ప్రతి సంస్థ కూడా పార్లమెంటుకి జవాబుదారీగా ఉండాలి. దానికోసం అన్ని పార్టీలు కొంచెం ముందు చూపుతో వ్యవహరిస్తే కచ్చితంగా మేలు జరుగుతుంది.

**ప్రశ్న: తాజా పరిణామాల నేప థ్యంలో ఎన్నికల నిర్వహణ, కమి షన్ పనితీరుపై విమర్శలు వస్తు న్నాయి. ఎన్నికలపై నమ్మకం పోతుందనే భావన ఉందా? ఎన్నికల మీద నమ్మకం లేదా ప్రజాస్వామ్యం ఎలా నిలబడుతుంది?**



**జేపీ:** నమ్మకం పోయిందని నేను అనుకోవట్లేదు. మనకి మీడియాలో, సోషల్ మీడియాలో ఆ రణగొణ ధ్వని చూసి దేశం అనుకోకూడదు. 'నిజం లేచి చెప్పులు తొడుక్కునే లోపు, అబద్ధం ఊరంతా చుట్టి వస్తుంది'. ఆధునిక యుగంలో సోషల్ మీడియా ప్రపంచం అంతా ఇలానే ఉంది. మన దేశంలోనే కాదు.. ఒకప్పుడు ఆదర్శ ప్రజాస్వామ్యంగా అమెరికాను కొన్ని విషయాల్లో అనుకునేవాళ్లం. నాలాంటి వాళ్లం.. అమెరికా, బ్రిటన్, జర్మనీ ఇతర దేశాలను చూసి చాలా నేర్చుకొని మన దేశంలోనూ అలా ఉంటే బాగుండని ఆరాటపడుతున్న వాళ్ళం. ఏనాడు కూడా అమెరికాలో 2016 దాకా లేదా 2020 దాకా ఎన్నికల విశ్వసనీయతను ఎవరూ ప్రశ్నించలేదు. అధ్యక్షుడిగా కూర్చున్న డోనాల్డ్ ట్రంపే.. ఆయన ఎన్నికలు ఓడిపోగానే దొంగ ఎన్నిక అని ఆయనే ప్రచారం చేశాడు. పెద్ద ఉద్యమాన్ని లేవగొట్టి ప్రజల్ని రెచ్చగొట్టాడు. వాళ్ళు పార్లమెంట్ మీద దాడి చేశారు. ప్రపంచం నిర్ఘాంతపోయింది.

మరి ప్రపంచానికి ఆదర్శంగా అనుకునే అమెరికాలో అలా జరిగితే మనం కూడా ఫ్యాషన్ అనుకుంటున్నాం. వాళ్ళ నుంచి మంచి నేర్చుకోవడం కాకుండా మూర్ఖత్వాన్ని నేర్చుకుంటున్నాం. ప్రజాస్వామ్యంలో ఎప్పుడూ కూడా కొంత సంశయం అనివార్యం. ఉండాలి. అధికారంలో ఎవరున్నా కూడా ప్రశ్నించాలి. సంశయం ఉండాలి కానీ గుడ్డిగా నమ్మకూడదు. ఆరోగ్యకరంగా ఉండాలి. కానీ అది వ్యవస్థను కుళ్లబొడిచే తీరులో ఉంటే.. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ ప్రమాదంలో పడతాయి. ఈ రెండిటికీ తేడాను గమనించాలి.

**ప్రశ్న: ప్రస్తుతం హైదరాబాద్‌లో కూడా ఎస్ఐఆర్ ప్రాసెస్ జరుగుతుంది. ఈసీపై చాలా ఆరోపణలు వస్తున్నాయి.. వీటిని ఎలా సరిదిద్దాలి?**

**జేపీ:** నేను రెండు మూడు తప్పులు చెప్పాను. మొత్తం కేంద్రీకరించడం. అలాగే మరికొన్ని పత్రికల్లో వచ్చాయి. ఇవన్నీ సవరించే బాధ్యత ఎన్నికల సంఘానిది, అలాగే కొన్ని పార్టీలు మరి బహిరంగంగా ప్రజల నుంచి కొన్ని సూచనలు వస్తున్నాయి. కొన్ని ఆందోళనలు, కొన్ని ప్రశ్నలు వస్తున్నాయి. వాటికి సమాధానం సంతృప్తికరంగా చెప్పే బాధ్యత ఎన్నికల సంఘానిది. కాబట్టి ఒకటి.పద్ధతుల్లో పొరపాట్లను సవరించే అధికారం ఎన్నికల సంఘానికి ఉంది. రెండు, ఏ విధమైన గోప్యత లేకుండా వాస్తవాలను ప్రజలకి పూర్తిగా అర్థమయ్యేలా వారి ముందు ఉంచాలి. ఒకవేళ ఆ బాధ్యతను ఎన్నికల సంఘం సవరించకపోతే

సుప్రీంకోర్టుకి ఆ బాధ్యత, అధికారం ఉన్నాయి. ఉదాహరణకి.. ఓటర్ రిజిస్ట్రేషన్ చేపట్టాల్సిన ఆర్డీవోకి అధికారం లేకుండా, ఆయన పేరు తెచ్చే అవకాశం లేకుండా మీరు ఢిల్లీలో పెట్టుకుంటే కచ్చితంగా దాన్ని రాజ్యాంగ విరుద్ధంగా తిరస్కరించి ఆదేశం ఇచ్చే బాధ్యత సుప్రీంకోర్టుకు ఉంది. అలాగే, ముగ్గురు కమిషనర్ల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నట్టయితే కూర్చుని సామరస్యంగా చర్చించుకుని ఏకగ్రీవ పరిష్కారానికి రావాలి. అది సాధ్యం కాకపోతే మెజారిటీ ప్రకారం నడవాలి. ఇది కామన్ సెన్స్.. ఇంగిత జ్ఞానం.

శేషన్ కేసులో సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కృష్ణమూర్తి, ఎంఎస్ గిల్ గార్లు ఇద్దరినీ చేర్చారు. ఎన్నికల సంఘ అధికారాలను మీరు కావాలని కుంచిస్తున్నారు అని చెప్పి కోర్టుకి వెళ్లారు.. కోర్టు దాన్ని తిరస్కరించింది. వీలున్నంత వరకు ఏకాభిప్రాయం.. సాధ్యం కాకపోతే మెజారిటీ..ఇదేమీ విడ్డూరమైన తీర్పు కాదు. సరైన తీర్పు. దాన్ని కచ్చితంగా పాటించాలి. ఎన్నికల సంఘం ఏమో అంతా బాగుందని చెబుతోంది. పత్రికల్లో వ్యతిరేక కథనాలు వస్తున్నాయి.. వాస్తవం ఏంటో నాకు తెలియదు. కానీ కచ్చితంగా బహుళ సభ్య కమిషన్ ఉన్నప్పుడు మెజారిటీ ప్రకారం నడవాలి. ★

# ట్రంప్ బంపర్ ఆఫర్..
# భారత్ అవలక్షణాన్ని అనుకరిస్తున్నారా?

ఇటీవల మన ప్రధాన ఎన్నికల అధికారి అమెరికాలో పర్యటించినప్పుడు, అక్కడ ఫొటో ఐడెంటిటీ కార్డులు వంటివి లేకుండా ఎలా ఎన్నికలు నిర్వహిస్తున్నారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆ విషయాన్ని ట్రంప్ ప్రస్తావిస్తూ, అమెరికా ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు అవసరమని అన్నప్పుడే.. ఏదో ఇండియా ప్రభావం అక్కడ ఎన్నికల కోణంలో ఉండబోతోందని ఊహాగానాలు మొదలయ్యాయి. ఈవీఎంలలో అవకతవకలు, ఈసీలో నియామకాల ప్రక్రియపై సుప్రీంకోర్టు తీర్పును పార్లమెంటు అనుసరించకపోవటం వంటి అంశాలపై విమర్శలు వచ్చినప్పుడు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ మన ఓటరు జాబితాల ప్రక్షాళన ప్రపంచంలోనే ఎంత విశిష్టమైనదో వివరించారు. అమెరికా నుండి మనం ఎన్నో నేర్చుకోవాల్సి ఉండగా..మన నుండి వాళ్లు నేర్చుకోవలసిన కొన్ని అంశాల్లో ఎన్నికల నిర్వహణ ప్రక్రియ, ఓట్ల లెక్కింపు ఉన్నాయని జేపీ పేర్కొన్నారు.

ఓటరు జాబితాలు, ఎన్నికల నిర్వహణ, లెక్కింపు జాప్యాల్ని నివారించటం వంటి అంశాలను నేర్చుకోవటం వరకు ట్రంప్ భారత్‌ని అనుసరించి ఉంటే.. మనమూ వారి నుండి చట్టవిరుద్ధ వ్యయం, ఓట్ల కొనుగోలు లేకపోవటం వంటి అంశాల గురించి మాట్లాడుకునేవారం. కానీ మధ్యంతర ఎన్నికల్లో అమెరికన్ కాంగ్రెస్‌లో రిపబ్లికన్ సభ్యుల్ని గెలిపిస్తే అమెరికాలో వయోజనులందరికీ తలసరి 5,000 డాలర్లు ఇస్తానని ట్రంప్ హామీ ఇచ్చారు. అంటే, సుమారు అయిదు లక్షల రూపాయలు. ఇది చూసి ఆధునిక ప్రజాస్వామ్యానికి మాతృకగా అమెరికాను చాలా అంశాల్లో ఆదర్శంగా చూపే వారంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. అంటే, ఆ దేశం మనం నేర్చుకోవాల్సిన మంచిని మొత్తం పక్కనపెట్టి, ఈ ఒక్క హామీని మాత్రమే పరిగణలోకి తీసుకునే స్వార్థ సాంప్రదాయ నాయకులు, అమాయక ప్రజలు ఎక్కువగా ఉన్న దేశం మనది. గతంలోనే లోక్‌సత్తా భావజాలం నుండి కొత్త రాజకీయం నినాదంతో వచ్చి ఆచరణలో సాంప్రదాయ పార్టీల తరహాలోనే వ్యవహరించిన ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) వ్యవస్థాపకులు అరవింద్ కేజ్రీవాల్ ఉచిత విద్యుత్ ఎన్నికల హామీలో ట్రంప్ తమను అనుకరిస్తున్నారని గతంలో పేర్కొన్నారు. ప్రస్తుతం అధ్యక్షుని అయిదు వేల డాలర్ల ఆఫర్‌కి భారత ఐటీ రంగ మేధావిగా కొందరు పనిగట్టుకుని ప్రమోట్ చేసిన జోహో వ్యవస్థాపకులు, తమిళనాడుకు చెందిన శ్రీధర్ వెంబూ స్పందన దిగ్భ్రాంతికి తోడు విస్మయాన్ని కలిగించింది. 'అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమిళనాడులోని ప్రధాన పార్టీ డీఎంకేనీ కాపీ కొట్టారు' అని ఆయన వెంటనే పోస్ట్ పెట్టారు. డీఎంకే ప్రారంభించిన తాత్కాలిక తాయిలాల సంస్కృతి ఈవేళ భారతదేశం మొత్తం పాకిందని ఆయన సగర్వంగా చాటుకున్నారు. సమాచార పరంగా అది నిజమేగానీ, స్పందనపరంగా మాత్రం రాజకీయ అమాయకత్వమన్నా అయ్యుండాలి లేదా వ్యాపార తెలివితేటలన్నా అయ్యుండాలి.




తమిళనాడులో 1960ల ప్రారంభంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా కామరాజ్ నాడార్ పాఠశాల విద్యను, మౌలిక వసతుల్ని పెద్దఎత్తున ప్రోత్సహించారు. ఈ క్రమంలో పిల్లల్ని స్కూళ్లకు ఆకర్షించేందుకు మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టారు. కానీ విపరీతమైన బియ్యం కొరతతో మధ్యలో విరమించుకున్నారు. తర్వాత ఇదే అంశాన్ని తీసుకుని డీఎంకే తరపున అన్నాదురై ప్రచారం చేసి గెలిచారు. ఆయన రూ.1కి 4.5 కిలోల బియ్యం హామీ ఇచ్చారు. అప్పట్లో హరిత విప్లవం ఇంకా వ్యాప్తిచెందనందున, ఆహార కొరత ఎక్కువగా ఉండేది. దీంతో కొంతకాలం ఆ పథకాన్ని మద్రాస్, కోయంబత్తూర్‌కి మాత్రమే వర్తింపచేసి క్రమంగా అక్కడా విరమించుకున్నారు.

1967 నుండి తమిళనాడులో కాంగ్రెస్‌కు స్థానం లేకుండా పోయినా, ఇప్పటి విజయ్ పార్టీ లాగే కాంగ్రెస్‌కు చెందిన కామరాజ్ నాడార్‌ను డీఎంకే నుండి విడిపోయి అన్నాడీఎంకేను స్థాపించి అధికారంలోకి వచ్చిన ఎంజీ రామచంద్రన్ ఆదర్శంగా తీసుకున్నారు. చాలా పట్టుదలతో మధ్యాహ్న భోజన పథకం అమలు చేశారు. ఆ తర్వాత 1983లో ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన ఎన్.టి రామారావు రూ.2లకి కిలో బియ్యం పథకాన్ని అమలు చేశారు. అప్పట్లో మార్కెట్‌లో కిలో బియ్యం ధర రూ.3.50 మాత్రమే. అప్పట్లో అర్హులకి, కొన్ని కనీస అవసరాలు, ఉత్పాదక లక్ష్యాల కోసం తెలుగుదేశం వ్యవస్థాపకులు వాటిని అమలు చేయగా.. ఆ తర్వాత రాష్ట్ర జనాభా కంటే ఎక్కువ సంఖ్యలో తెల్ల రేషన్ కార్డులున్నా, మార్కెట్ రేటు, ప్రజల పన్నుల డబ్బుపై పడే భారంతో సంబంధం లేకుండా తాత్కాలిక తాయిలాల్ని పోటాపోటీగా అమలు చేయటం ఇప్పటికీ కొనసాగుతోంది. ఇప్పుడు బియ్యం తక్కువ మోతాదులో తింటున్నారు, ఆ సంఖ్య కూడా తగ్గుతోంది. మార్కెట్‌లో కిలో బియ్యం రూ.50 దాకా ఉంది. అయినా ఉచితంగా బియ్యం ప్రజలందరికీ పంచేస్తున్నారు. అవి రీసైకిల్ అయి తిరిగి మార్కెట్‌లోకి చేరుతున్నా, ఖర్చు తడిసి మోపెడవుతున్నా అదో ఆనవాయితీ అయిపోయింది.

ఆహారధాన్యాలు, పదార్థాల వంటి విషయంలో అంత తీవ్ర అభ్యంతరాలున్నా, ప్రజల జీవించేహక్కును పరిరక్షించటంలో భాగంగా చూడవచ్చు. కానీ ఆ తర్వాత అన్నాడీఎంకే తరపున జయలలిత మిక్సీలు, గ్రైండర్లు వంటివి ఉచితంగా హామీ ఇవ్వగా, డీఎంకే తరపున కరుణానిధి కలర్‌టీవీల్ని సైతం హామీ ఇచ్చారు. అదే ఒరవడిలో తెలుగుదేశం పార్టీ తరపున చంద్రబాబు కలర్ టీవీల్ని హామీ ఇచ్చారు. రాజ్యాంగం పరిధిలో హామీలిచ్చే అధికారం, బాధ్యత పార్టీలకు ఉందని.. కానీ మిక్సర్లు, టీవీలు వంటివి ఏ రకంగా రాజ్యాంగ పరిధిలోకి వస్తాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆ అన్ని సందర్భాల్లో జేపీ ఎన్నికల సంఘానికి లేఖలు రాశారు. స్వయంగా కలిసి అప్పటి ఎన్నికల కమిషనర్ గోపాలస్వామికి వివరించారు. కానీ ఆయన ధైర్యం చేయలేకపోయారు. ఆ తర్వాత సుప్రీంకోర్టులోనూ ఆ అంశం చర్చకు వచ్చినా, హడావుడి, వ్యాఖ్యలు తప్ప పరిష్కారం వెలువడలేదు. మొత్తంగా, ఇప్పుడు చేయి దాటిపోయి, చివరికి తాత్కాలిక తాయిలాలు, డబ్బు పంచటం తప్ప అభివృద్ధి అక్కర్లేదు, ప్రజలకు ఆదాయాలు పెరగటానికి అభివృద్ధి అవసరం అనేవారంతా వర్గశత్రువులు అని ఏపీలో వైకాపాలాంటి పార్టీ వాదించే పరిస్థితి వచ్చింది. సంక్షేమం-అభివృద్ధి మధ్య సమతూకంతో సమ్మిళిత అభివృద్ధి యుద్ధప్రాతిపదికన భారత్‌కు అవసరమైన తరుణంలో శ్రీధర్ వెంబూ లాంటి ఎంట్రప్రెన్యూర్ అలాంటి పోలికతో, అదేదో ఘనకార్యం అన్నట్లు భావించటం విచారకరం. ఈ అంశం మరింత పరిశీలనకు ముందు.. అమెరికాలో జరుగుతున్న చర్చను చూద్దాం.

కొవిడ్ సమయంలో అమెరికాలో జో బైడెన్ డెమొక్రాటిక్ ప్రభుత్వం తలసరి 2,000 డాలర్ల దాకా పంచింది. అలా జార్జియా రాష్ట్రంలో ప్రతికూల పరిస్థితుల్ని తట్టుకుని గెలిచిందనే విమర్శలు వచ్చినా, ప్రజలకు ఆదాయాలు తగ్గాయనే వాదనల మధ్య అవి మరుగున పడిపోయాయి. రెండోసారి ఓడి గెలిచిన ట్రంప్.. ఎన్నికల ప్రచారంలో 'డోజ్' ప్రతిపాదన చేశారు. ప్రభుత్వోద్యోగ వ్యవస్థపై అనవసర ఖర్చును తగ్గించి, ఆ డబ్బును ప్రజలకు డివిడెండ్‌గా పంచుతామని, ట్యాక్స్‌లను తగ్గిస్తామని చెప్పారు. కానీ అది అమలవలేదు. డోజ్‌కు ఏరికోరి నాయకత్వం వహించిన ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ చివరికి కాడి పారేశారు. 2024 ఎన్నికల సమయంలో స్వింగ్ రాష్ట్రాల్లో, ఆ తర్వాత జడ్జీల ఎన్నికల సమయంలో రిపబ్లికన్ అభ్యర్థులకు మద్దతుగా సంతకాలు చేసినవారికి మిలియన్ డాలర్ల ఆఫర్‌ని మస్క్ ప్రకటించినా, పెద్ద రాజకీయ ప్రభావం కన్పించలేదు. ప్రజలు తాము అనుకున్నవారికే ఓట్లు వేశారు తప్ప డబ్బు ప్రలోభాలకి లొంగలేదు. కానీ ఇరాన్ యుద్ధం విషయంలో తన అంచనాలు తప్పటం, ధరలు పెరగటం, యూనివర్సిటీలకు నిధుల కోత, నిపుణుల వలసల్ని నిరోధించటం, తనను వ్యతిరేకించిన న్యాయస్థానాలను సైతం తిట్టిపోయటం వంటి కారణాల వల్ల రిపబ్లికన్ పార్టీకి ప్రజాదరణ తగ్గటంతో 5,000 డాలర్ల పథకానికి ట్రంప్ తెరతీశారు. ఇది ఓట్ల కొనుగోలు కాదా? చట్టవిరుద్ధం కాదా? అందుకయ్యే 1.3 ట్రిలియన్ డాలర్లను ట్రంప్ ఎక్కడ్నుంచి తెస్తారు? బడ్జెట్‌లో ఎక్కడ కోతవేస్తారు? వంటి అంశాల్ని ఆ దేశంలో నిపుణులు, విశ్లేషకులు చర్చిస్తున్నారు. కాంగ్రెస్ బడ్జెటరీ ఆఫీస్ వంటి సంస్థలు హామీల అమలు ఎంతవరకు సాధ్యమో అని అక్కడి బడ్జెట్‌లను నిశితంగా, వాచ్‌డాగ్స్‌లా పరిశీలిస్తుంటాయి. ప్రపంచ ప్రజాస్వామ్యానికి ఇదో ప్రతికూల సంకేతం అని కొంత వేదన చెందటం మినహా, అధ్యక్ష కార్యాలయం ఎక్కడ్నుంచి తెచ్చి డబ్బు పంచుతుంది, వారికి ఎంత అప్పులున్నాయి మనకు అనవసరం. కానీ అమెరికా కూడా ఇచ్చింది కాబట్టి అది సరైనదే, తమిళనాడుకు లభించిన గౌరవం అన్నట్లు చెప్పటం మాత్రం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. తమిళనాడు నుండి ఆర్థిక వికేంద్రీకరణ, విస్తృత తయారీరంగం, అభివృద్ధి విషయంలో

అన్ని పార్టీలూ ఏకాభిప్రాయంతో వ్యవహరించటం వంటి అంశాల్ని నేర్చుకోవాలిగానీ, ఇలా దేశమంతా అభివృద్ధి నిధుల్ని దెబ్బతీసి, పలు రాష్ట్రాలు ఆర్థిక దివాళా దిశగా తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటూ, చివరికి భారతదేశానికి ఉన్న ఆర్థికాభివృద్ధి అవకాశాన్ని కుంచింప చేయటం కూర్చున్న కొమ్మనే నరుక్కోవటం అవుతుంది. మన నుంచి చెడును అమెరికా, వారి నుంచి చెడును మనం నేర్చుకోవటం వల్ల కొందరికి తాత్కాలిక రాజకీయ ప్రయోజనం లభిస్తుందేమోగానీ, చివరికి సమాజాలు నష్టపోతాయి.

వారం రోజుల్లో వందల సంఖ్యలో ఏఐ అప్లికేషన్లు ఆవిష్కృతమవుతున్న దశలో ఆంత్రోపిక్ సీఈవో సూచన మేరకు ఎక్స్ ఏఐ ఎలాన్ మస్క్, ఓపెన్ ఏఐ శ్యామ్ ఆల్ట్‌మన్ లాంటి దిగ్గజాలు వెనక్కి తగ్గివుండవచ్చు. కానీ భవిష్యత్తులో ఏఐ వల్ల ఉద్యోగాలు చేయాల్సిన అవసరం రాదు, అందరికీ అవసరమైన ఆదాయాన్ని సంఘటిత రంగంలో నెలజీతంలా పంచుతారని మస్క్ పేర్కొన్న విషయాన్ని మనం తీవ్రంగా పరిగణించాలి. అందులో భాగంగానే ట్రంప్ 5,000 డాలర్ల ఆఫర్‌ను చూడవచ్చని, భారత్‌లో కూడా అలాంటివి అమలు చేయవచ్చని జోహో వ్యవస్థాపకునిగా శ్రీధర్ వెంబూ భావించవచ్చు. మస్క్ చెప్పిన సామాజిక హాబీల్లో చిత్రలేఖనం, కథలు చదవటం, రాయటం, అంతరిక్షాన్ని శోధించటం వంటివి ఉన్నాయి. కానీ ఏ పనీచేయాల్సిన అవసరంలేకుండా అంత ఆరోగ్యకర సృజనాత్మకంగా ప్రజలు ఒక సమాజంగా ఆలోచిస్తారనటానికి ఆధారాలు లేవు. 'పనిలేని మెదడు దెయ్యాల కార్ఖానా' అనే సామెత పూర్వకాలంనాటిది అనుకున్నా, ఇటీవల మొబైల్ ఫోన్ విప్లవం తర్వాతా ఎవరూ తమ ఖాళీ సమయాన్ని అలా సద్వినియోగం గావించటం లేదు. మహాఅయితే ఓ 10-20% మంది మినహాయించి, మిగతా 80 శాతం అవసరానికి మించి దుర్వినియోగం చేస్తున్నారు. కాబట్టి, ఏఐ ఆర్థిక వ్యవస్థలో నగదు ఉచిత పంపిణీకి పైలట్ ప్రాజెక్ట్‌గా ట్రంప్ ఆఫర్‌ను, తమిళనాడు నమూనాను స్వీకరించాలనుకోవటం సరైన తీరు కాదు. ఈ ప్రభుత్వాల తాత్కాలిక తాయిలాల పరిధి, ఏఐ యుగంలో పనిచేయాల్సిన అవసరం లేకుండా ఆదాయం, పర్యవసానాల గురించి కేవలం టెక్ దిగ్గజాలు కాకుండా, ప్రజాజీవితంలో అపార అనుభవమున్న ఆలోచనాపరులు, రాజనీతిజ్ఞులు, సామాజిక వేత్తలు, ఇతర నిపుణులు సమగ్రంగా చర్చించటం మంచిది. ★

## ఏఐ నియంత్రణ విషయంలో భారత్ మరింత అప్రమత్తమవ్వాలి

శరవేగంగా దూసుకొస్తున్న ఏఐ సాంకేతికతల వల్ల రానున్న పదేళ్ల కాలంలో 10% మంది ప్రజలు ప్రపంచవ్యాప్తంగా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆంత్రోపిక్‌కు చెందిన పరిశోధకుడు ఇవాన్ హుబింగర్ ఇటీవల హెచ్చరించిన నేపథ్యంలో, అంతకుముందు అదే సంస్థ సీఈవో డారియో అమొడాయ్ ఇలాంటి హెచ్చరికతో రాసిన వ్యాసం కూడా చర్చనీయాంశమైంది. ఆ వ్యాసాన్ని ప్రచురణకు ఇచ్చే ముందు తన అభిప్రాయాన్నీ కోరారని, ఆ రకమైన ముందుజాగ్రత్త అవసరమని చెప్పానని ఎలాన్ మస్క్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఇతర సాంకేతికతల్లా ప్రయోగాత్మకంగా రుజువులతో నిగ్గుతేల్చుకునే అవకాశంలేని ఏజంటిక్ టెక్నాలజీ కావటంతో, తనను తాను నిరంతరం మెరుగుపరచుకునే ఏఐ ఎటుదారితీస్తుందో వాటి సృష్టికర్తలకు కూడా అంతుచిక్కటం లేదు. దీంతో డారియో హెచ్చరికను పాటించి సూపర్ ఇంటెలిజెన్స్ ఏఐ విషయంలో ఏఐ పరిశోధనలకు కళ్లెం వేయాలని నిర్ణయించినట్లు మస్క్, శ్యాం ఆల్ట్‌మన్ ప్రకటించారు. ఐక్యరాజ్యసమితి జోక్యాన్ని కూడా అర్థించారు. అందులో నిజాయతీ ఉందా, గడుసుతనామా, వాణిజ్య చాణక్యమా? అన్న విషయాల్ని అలావుంచితే.. కృత్రిమ మేధ వేగానికి బ్రేకులు వేసి, భద్రతకు భరోసా ఇవ్వటానికి డారియో మూడు దశల ప్రణాళికను వివరించారు.

1) ఏఐ వినియోగంలో భద్రతను ధ్రువీకరించటానికి.. కంపెనీలలో నిరంతరం పర్యవేక్షించే స్వతంత్ర భద్రతా నిపుణుల నియామకం 2) భద్రతా ప్రమాణాలను నెలకొల్పటానికి, అనియంత్రిత (అన్‌కంట్రోలబుల్) అభివృద్ధిని నిరోధించటానికి అగ్రగామి ఏఐ సంస్థల మధ్య సమన్వయం 3) శక్తిమంతమవుతున్న ఏఐ వ్యవస్థల వల్ల కలిగే ప్రమాదాలను గుర్తించి, ఎదుర్కోవటానికి ప్రపంచ దేశాల మధ్య సహకారం.

ఇటీవల ఢిల్లీలో జరిగిన బ్రిక్స్ సమావేశంలో భారత్ రూపొందించిన పది తీర్మానాలలో సాంకేతికత పట్ల ఉమ్మడి అప్రమత్తత ఒక అంశం అయినప్పటికీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మినహా మిగతావారెవరూ ఏఐ నియంత్రణ గురించి చాలా స్పష్టతతో హెచ్చరిక చేయలేదు. సోషల్ మీడియా వేదికల నియంత్రణ విషయంలో సమన్వయంలా తాత్సారం చేయకుండా, ఏఐ సాంకేతికతల అభివృద్ధి ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం మాత్రమే ఉపయోగించేదిశగా చర్యలకు నిపుణుల నేతృత్వంలో చర్యలకు, ప్రజల్లో అవగాహనకు నాణ్యమైన పాఠశాల విద్య వంటి అంశాల పట్ల భారత్ అప్రమత్తమవ్వాలి.

# అస్సాంలో ఇప్పటికీ కొనసాగుతున్న మహాత్ముడి సామరస్య స్ఫూర్తి



అస్సాంలో తెలుగు వారు గణనీయ సంఖ్యలో ఉన్నారు. అక్కడ తెలుగువారు నివసించే కాలనీని మదరాసీ కాలనీ అంటుంటే..అప్పట్లో ఎన్.టి.ఆర్ తెలుగు కాలనీగా పిలవాలని ఒప్పించారు. ఈవేళ చమురు, విద్యాసంస్థలు, తేయాకు పరిశ్రమ వగైరాలలో మన తెలుగువాళ్లు చెప్పుకోదగిన సంఖ్యలో అస్సాంలో ఉన్నా.. బెంగాలీలు, బంగ్లాదేశీ ముస్లింలు, పంజాబ్, బీహార్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చినవారు అక్కడ కీలక పాత్ర పోషిస్తున్నారు. మిగతా భారతదేశం ఈశాన్యంలో ఎక్కువగా వెళ్లే రాష్ట్రం అస్సాం అనటంలో అతిశయోక్తి లేదు. ఈ విషయంలో అస్సాంకు కాస్త దీటైనది మేఘాలయ. స్వతంత్ర పోరాటకాలంలో జాతిని నిర్మించే నీతిని నిలిపేందుకు శతాబ్దాలకు సరిపడా కృషి చేసిన మహాత్మాగాంధీ కూడా అస్సాంను సందర్శించారు. 1925లో ప్రధానంగా నారాయణ గురు ప్రభావంతో అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటాన్ని రాజకీయపరంగా కూడా తీవ్రం చేసిన గాంధీజీ.. అస్సాంలోనూ అందుకోసం చొరవ చూపారు.



గతంలో కొన్ని వర్గాలవారిని అస్సాంలో నామ్‌ఘర్ (ప్రార్థనా మందిరాల)లోకి అనుమతించేవారు కాదు. స్వాతంత్ర్య పోరాట ఉద్యమంలో భాగంగా గాంధీజీ నాలుగుసార్లు అస్సాంలో పర్యటించారు. ఈ సందర్భంగా అణగారినవర్గాల స్థితిగతులు, రాష్ట్రానికి తలమానికమైన నామ్‌ఘర్‌ల ప్రత్యేకత గురించి సమాచారాన్ని సేకరించారు. 'హరిజన్ యాత్ర'లో భాగంగా 1934లో జోర్హాట్ పట్టణానికి మహాత్ముడు వచ్చినప్పుడు అస్సాంకు చెందిన గాంధేయవాది కృష్ణనాథ్ శర్మ తన ఇంటిలోని కొంతభాగాన్ని హరిజనుల నామ్‌ఘర్ ఏర్పాటుకు కేటాయిస్తానని ప్రకటించారు. అస్సాంలో సామాజిక చైతన్యం దిశగా ఇది ముందడుగుగా గాంధీ అభివర్ణించారు. గ్రామీణ అస్సాంలోని 'హరిజన్ నామ్‌ఘర్'లో గత 90 ఏళ్లకు పైగా కులాలకు అతీతంగా ప్రజలంతా ఒక్కటై భగవంతుడికి పూజలు చేస్తున్నారు. సమాజంలోని అందరినీ కలుపుకొని ముందుకుసాగటమే తమ లక్ష్యమని జోర్హాట్‌లోని హరిజన్ నామ్‌ఘర్ కమిటీ అధ్యక్షుడు తెలిపారు.



★

# గ్రామసభల పట్ల యువత అనాసక్తత.. రెఫరెండం పద్ధతిని సంధానించటం బెటర్

ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖను అడిగి మరీ తీసుకున్నానని, తాను కోరితే హెూంశాఖ సహా ఏదైనా వచ్చేదని.. జనసేన పార్టీ వ్యవస్థాపకులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెబుతుంటారు. సినిమాల్లో పవర్‌స్టార్‌గా గుర్తింపు పొందిన పవన్.. నిజజీవితంలో స్థానిక ప్రభుత్వాలను ఎంపవర్ చేయగలరా? అని జేపీ లోక్‌సత్తా అఫీషియల్ యూట్యూబ్ ఛానల్‌లో కొన్ని వీడియోలు కూడా చూశాం. పవన్ సానుకూల ప్రయత్నం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 13,326 గ్రామ సభల్ని నిర్వహించారు. కొన్ని వందల గ్రామాలకు సొంత డబ్బు విరాళంగా ప్రకటించారు. అయినా, ఇంకా ఆశించిన ఫలితాలు కనిపించటం లేదు. మార్పు కేవలం భవనాలు, విరాళాలతో రాదు.

పంచాయతీలను ఒకప్పుడు గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం తరహాలో తయారుచేయనక్కర్లేదుగానీ.. ప్రజల భాగస్వామ్యం, నిధులు, అధికారాల వినియోగంలో జవాబుదారీతనం వంటి చర్యలు అవసరం. గ్రామాలు, పట్టణాలకు మధ్య అంతరాన్ని తగ్గించే మౌలిక వసతులూ కీలకం. పంచాయతీలను మెరుగుపరిచే క్రమంలో పవన్ కళ్యాణ్ గ్రామసభలకు చాలా ప్రాధాన్యత ఇచ్చారు. పంచాయతీకి సంబంధించి ఏ నిర్ణయం తీసుకున్నా గ్రామసభల్లోనే తీసుకోవాలని కాగితాల మీద చట్టం కూడా ఉంది. కానీ, ఎప్పుడన్నా వ్యక్తిగత పనుల కోసమో, పండుగల సందర్భంగానో వెళ్లిరావటమే తప్ప.. గ్రామసభల గురించి పెద్దగా పట్టించుకునేవారు తక్కువ. ఈ అంశం మీద ఇటీవల ఒక జాతీయ సర్వేను ప్రభుత్వం వెలువరించింది. ప్రజాస్వామ్యానికి ఎంతో విలువైన, కానీ పెద్దగా చర్చ జరగని ఈ అంశం మీద సమాచారాన్ని సేకరించి విశ్లేషించినందుకు అభినందించాల్సిందే. 'గ్రామసభల్లో తక్కువ భాగస్వామ్యంపై జాతీయ అధ్యయనం' పేరుతో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ జాతీయ సంస్థ (ఎన్‌ఐఆర్‌డీపీఆర్) ఈ నివేదికను రూపొందించింది. వీరు 26 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో సర్వే చేశారు.






ఎందుకు గ్రామసభలకు హాజరు తక్కువగా ఉంటోందో ఆరా తీశారు.

స్థానికాభివృద్ధి, సంక్షేమ పథకాలు, సమస్యలను చర్చించటానికి గ్రామసభలు వేదిక అని ఆయా పంచాయతీవాసులు ఇప్పటికీ విలువైనవిగా భావిస్తున్నట్లు సర్వే గుర్తించింది. అయితే, పొలం పనులు, వివిధ వృత్తులు, జీవనోపాధి ఒత్తిడులు, సరైన సమాచారం లేకపోవటం వంటివి హాజరీని పలుచపరుస్తున్నాయి. ఓ 9.9 శాతం మంది మాత్రం ఆసక్తిలేకపోవటం వల్ల గైర్హాజరవుతున్నామని చెప్పారు. ఇవి ప్రాధాన్యాంశాలైనా.. వీటన్నిటినీ మించి ఓ విషయం పాలనాపరంగా విలువైనదిగా కనిపిస్తుంది. "ఆ సభల్లో మా సమస్యలపై మొక్కుబడిగా స్పందిస్తారు, తీసుకున్న నిర్ణయాలనూ అమలు చేయరు" అని పలువురు (18-28%) ప్రజలు నిర్లిప్తతతో హాజరుకావటం లేదని తెలిపారు.

"సభలో చేసిన నిర్ణయాల అమలు ఎంతవరకు వచ్చింది, క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలున్నాయా, ఎలా

పరిష్కరించాలి అనే చర్చ లేకపోవటంతోపాటు.. అందరికీ స్పష్టంగా తెలిసేలా, పారదర్శకంగా పరిష్కారాల అమలు వంటివి కొరవడటం వల్ల గ్రామసభలు మొక్కుబడిగా జరుగుతున్నాయి. దీంతో, ప్రజల ఆసక్తి తగ్గిపోతోంది" అని ప్రభుత్వ నివేదిక తెలిపింది.

ప్రజలు గ్రామసభల్లో స్వేచ్ఛగా తమ భావాలను వ్యక్తం చేయటం, పరిష్కారంలో ఆత్మవిశ్వాసంతో భాగమవటానికి పెద్దగా అవరోధాలులేవుగానీ.. అలా క్రియాశీలంగా భాగస్వాములుకాలేనివారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. 35.8% మంది తమకు సమావేశంలో మాట్లాడటానికి ధైర్యం చాలటంలేదని చెబుతున్నారు. 17.4 శాతం మంది ప్రజలు అధికారులను చూసి భయపడుతున్నారు. పలుకుబడి గల వ్యక్తుల మాటే చర్చల్లో పైచేయి సాధిస్తోందని, తమను పట్టించుకోవటం లేదని 17.2 శాతం మంది తెలిపారు. లింగ వివక్ష 9.05%, కుల వివక్ష 6.6 శాతం ఉన్నాయి. మొత్తంగా గ్రామసభల్లో పారదర్శకత లోపించిందని 45.5 శాతం మంది, నిర్ణయాలు ఆచరణలో కనిపించటంలేదని 41.9%, పరిష్కారాలులేకుండా ప్రతి సభలో అవే సమస్యలపై ఊకదంపుడు చర్చ జరుగుతోందని 33.4 శాతం మంది తెలిపారు.

"ఈ వివరాల నేపథ్యంలో, గ్రామసభల సమాచారం ఎంతమందికి అందుతోంది, ఎంతమంది పాల్గొంటున్నారు అన్న అంశం మాత్రమే ముఖ్యం కాదు. అంతకంటే ఎక్కువగా.. గ్రామసభలు అర్థవంతమైనవి, మన సమస్యల పట్ల స్పందించేవి, స్థానిక సమస్యలను పరిష్కరించే వనరులు, సామర్థ్యం కలిగినవి అని పౌరులు విశ్వసించాలి" అని నివేదిక అభిప్రాయపడింది. గ్రామసభల సమాచారం తెలియచేయటానికి లౌడ్ స్పీకర్ లేదా టముకు వేయటం వంటి పద్ధతుల్ని ఎక్కువమంది సూచించారు. 15.8 శాతం మంది వాట్సాప్ సమాచార పద్ధతికి మొగ్గు చూపారు.

**యువత నిరాసక్తత –**
**కేరళంలోనూ అంతంతమాత్రం హాజరు**

గ్రామసభలు, పౌరుల హక్కుల గురించి స్థానిక భాషల్లో కరదీపికలతో (లోక్‌సత్తా వీటిని ముద్రించి పలు గ్రామ పంచాయతీలకు అందించటంతోపాటు, సర్పంచ్‌లకు కొన్ని సంవత్సరాలపాటు వరుసగా శిక్షణా తరగతులను కూడా నిర్వహించింది) యూనియన్ ప్రభుత్వం ప్రచారం చేయటం, సామాజిక తనిఖీలు, ప్రజాస్వామిక జవాబుదారీతనం, సంక్షేమ హక్కులను తెలియచెప్పటం, పని రోజుల్లో నిర్వహించకపోవటం వంటి పరిష్కారాలను నివేదిక సూచించిందిగానీ.. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే స్థానిక ప్రభుత్వాలు బలంగా ఉన్న కేరళంలో కూడా గ్రామసభలకు



హాజరు పలుచగా ఉండటం ఆలోచించాల్సిన అంశం. యువత హాజరు సగటున అన్ని రాష్ట్రాల్లోనూ బాగా తక్కువగా ఉంది.

సమ్మిళిత ఆర్థికాభివృద్ధి, సంఘటిత రంగంలో ఉపాధి కీలకం గ్రామాల్లో పంచాయతీలకు భవనాలు వంటి వసతులు బాగానే ఉన్నాయి. సమావేశాలకు అవసరమైన ఏర్పాట్లు కూడా సౌకర్యవంతంగా ఉంటున్నాయి. ఇంటర్నెట్ సదుపాయాలు సైతం కాస్త అటూఇటుగా అన్ని గ్రామాలకూ విస్తరిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లాంటి చోట ప్రతి ఊరులో గ్రామ సచివాలయాలున్నాయి. అయితే, విగ్రహాలు పుష్టి, నైవేద్యం నష్టిలా ఉంది పరిస్థితి. పంచాయతీల్లో నిర్మాణాలు చేసే కాంట్రాక్టర్లు, ఏవైనా లావాదేవీల అవసరాలున్న మోతుబరులు తప్ప.. మిగతావారు పెద్దగా గ్రామసభలకు హాజరుకావటం లేదు. మొత్తంగా గ్రామసభల్లో.. స్థానిక సమస్యలపై 13% సమయం చర్చిస్తుండగా, రెవెన్యూ సంబంధ విషయాలకు సగటున కేవలం 4% కేటాయిస్తున్నారు. ఊరందరికీ సంబంధించిన పెద్ద సమస్యపై, ఆదాయాలు, పథకాలకు సంబంధించిన అంశాలపై నిర్వహించిన సభలకు మాత్రం పెద్దసంఖ్యలో హాజరయ్యారయ్యారని సర్వేలో స్పందించినవారు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో, ఎన్ఐఆర్‌డీపీఆర్ చెప్పిన సూచనల్ని పరిగణలోకి తీసుకోవాలి. పౌరులు కేంద్రంగా గ్రామసభలు నిర్వహించాలన్న ఆదర్శాన్ని పాటిస్తూనే.. ఇతరత్రా అంశాలనూ పరిశీలించి పరిష్కారాల్ని అమలు చేయాలి:

- నైపుణ్యాలులేని వలసలు, అసంఘటిత రంగంలో ఉపాధి, ఆదాయాల్లేని వ్యవసాయం, దిశానిర్దేశం చేసే నాయకత్వం కొరవడటం మొదలైన కారణాల వల్ల గ్రామ సభలను పట్టించుకోవటం కంటే.. రోజువారీ ఆదాయం ఎక్కువమందికి ప్రాధాన్యాంశంగా మారింది.
- ఇంటికి ఆదాయాన్ని సమకూర్చాల్సిన అవసరంలేని

యువతను కార్యోన్ముఖుల్ని చేసే ఎజెండా గ్రామసభల్లో తరచూ ఉండటం లేదు.

✦ ఈ నేపథ్యంలో, సంఘటిత ఉపాధి రంగాన్ని విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలి. గ్రామాలలో పట్టణ సౌకర్యాలను అందుబాటులోకి తేవటంతోపాటు.. ఆ గ్రామాలకు కేంద్రంగా ఉండే చోట చిన్న పట్టణాలను ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. వ్యవసాయాన్ని లాభసాటి చేసే సాంకేతికత, తక్కువ వడ్డీ పెట్టుబడి రుణాలు, నిల్వకు మౌలిక వసతులు, స్వేచ్ఛా మార్కెట్‌తో సంధానం, రిటెయిల్ చెయిన్లకు సరఫరా వంటివి, వ్యవసాయేతర గ్రామీణ పర్యాటకం వంటి కార్యక్రమాల విస్తరణ పంచాయతీలు సమర్థంగా నిర్వహించాలి. ఇందుకోసం నగర స్థానిక ప్రభుత్వాలతో ప్రారంభించి, పంచాయతీలన్నిటికీ కాకున్నా క్లస్టర్ స్థాయిలో నిధులు, అధికారాలు పెద్దఎత్తున జవాబుదారీతనంతో కేటాయించాలి. 73వ రాజ్యాంగ సవరణను సవరించలేకుంటే.. గ్రామ, పట్టణ, నగర పాలక సంస్థల సాధికారతకు మరో రాజ్యాంగ సవరణ చేయాలి.

✦ ప్రజలు తమ సమస్యల్ని నేరుగా ఎమ్మెల్యే, కలెక్టర్, మంత్రి, ముఖ్యమంత్రి, అధికార పార్టీ కార్యాలయంలో ఇవ్వొచ్చని ప్రజావాణి, ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాల్ని ఏర్పాటు చేస్తున్నారు. వారు మళ్లీ తిరిగి ఆ గ్రామ పంచాయతీ అధికారులకే పంపాల్సి వస్తోంది. పైస్థాయి వారికి నేరుగా ఫిర్యాదు చేయగలిగినప్పుడు.. గ్రామ సభలు, సర్పంచ్‌లతో పనేముంది? అనే భావన కొంత ప్రజల్లో ఏర్పడుతోంది. అయితే వీటిలో ఏ మేరకు పరిష్కారాలు జరుగుతున్నాయి, జీతాలు తీసుకుంటున్న సంబంధిత ప్రభుత్వ యంత్రాంగం చేయాల్సిన పని తామెందుకు చేస్తున్నాము? అని ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు ఆలోచించాలి. సొంత పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్న రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు ఫిర్యాదుకే కలెక్టరాఫీసులో దిక్కులేక మీడియా ముందు వాపోవాల్సి వచ్చిందంటే, దిద్దుబాటు ఎక్కడ జరగాలో సమీక్షించుకోవాలి. ఇటీవల తెలంగాణ ప్రజావాణి కార్యక్రమ దరఖాస్తుల ఫొటోను ఓ పత్రికవారు ప్రచురించారు. గొడౌన్లలో అవసరానికి మించి ధాన్యం, గోధుమ వంటి ఆహారధాన్యాలను నిల్వ చేసి ఎలకలు, పందికొక్కులను ప్రోత్సహించినరీతిలో ఆ దరఖాస్తు కాగితాల కట్టలు కనిపించాయి. దిగువన పరిష్కారంకాని, పైస్థాయి జోక్యం తప్పనిసరి అయితేనే అర్జీని తీసుకునే విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. దీనివల్ల గ్రామసభలు, స్థానిక పాలనా పద్ధతులు క్రియాశీలమవుతాయి.

✦ నాయకత్వ సామర్థ్యమున్న యువత గ్రామాలకు తిరిగొచ్చేలా, లేదా గ్రామాల్లో ఉన్నవారు ఆ సామర్థ్యాన్ని ప్రదర్శించగలిగేలా చిన్న పట్టణాలలో పెద్దఎత్తున తయారీ, ఆహారశుద్ధి తరహా వ్యవసాయాధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలి. అత్యాధునిక ప్రజారవాణాను అందుబాటులోకి తేవాలి.

"ఇప్పటికే చాలా దేశాల్లో మనకంటే బలమైన స్థానిక ప్రభుత్వాల వ్యవస్థ ఉంది. ఈ నేపథ్యంలో, మన సమాజాన్ని ఎక్కువగా స్పందింపచేసే ఎన్నికల మార్గాన్ని గ్రామసభలతో సంధానించే ప్రయత్నం కొంత ఫలితాలనివ్వొచ్చు."

✦ మహిళా, రైతు, యువ సంఘాలను బలోపేతం చేసి, ఆర్థిక కలాపాల్లో చురుగ్గా భాగస్వాములయ్యేలా పెట్టుబడుల్ని తక్కువ వడ్డీకి సమకూర్చాలి.

✦ వ్యవసాయం, ఇతర రంగాల్లో కాంట్రాక్ట్‌లు సక్రమంగా అమలయ్యేలా, మాదకద్రవ్యాలు వంటి జాడ్యాలు, శాంతిభద్రతలకు అవరోధాలు వంటివి లేకుండా చట్టబద్ధపాలన అమలుకి 2009లో లోక్‌సత్తా కృషితో వచ్చిన గ్రామ న్యాయాలయాల చట్టాన్ని అమలు చేయాలి. దీనివల్ల పురుషులతో సమానంగా మహిళలు కూడా కార్మికశక్తిలో భాగస్వాములు కాగలుగుతారు. ఈవేళ తెలుగు రాష్ట్రాల్లో ఒక్క గ్రామ న్యాయాలయం లేదు.

ఇన్ని చేసినా, స్థానిక ప్రభుత్వాల సమావేశాల్లో వయసు మళ్లినవారు, ఇళ్లలో పొద్దు గడవనివారు ఎక్కువగా పాల్గొనటం ప్రపంచవ్యాప్త సమస్యగా మారుతోంది. ఇప్పటికే చాలా దేశాల్లో మనకంటే బలమైన స్థానిక ప్రభుత్వాల వ్యవస్థ ఉంది. ఈ నేపథ్యంలో, మన సమాజాన్ని ఎక్కువగా స్పందింపచేసే ఎన్నికల మార్గాన్ని గ్రామసభలతో సంధానించే ప్రయత్నం కొంత ఫలితాలనివ్వొచ్చు.

**ఆన్‌లైన్ ఓటింగ్**

ఊళ్లలో గ్రామసభలంటే వచ్చేవారు తక్కువగానీ, పంచాయతీ ఎన్నికలంటే.. విమానంలో వచ్చి మరీ ఓటు వేసే సంస్కృతి మనకు ఉంది. కానీ గ్రామసభల్లో కొన్ని విషయాలనైనా చర్చించక తప్పదు. ప్రతిదానికీ అవును, కాదు అని సమాధానాలుండవు. చర్చించాకే, అలాంటి నిర్ణయాలు తీసుకోవాల్సి రావచ్చు. ఎన్నికలు ఎలాగూ పంచాయతీ లేదా స్వర్ణ గ్రామ సచివాలయం వంటి చోటే జరుపుతారు కాబట్టి.. గ్రామసభల అనంతరం 'రెఫరెండం' నిర్వహించటం మేలు. ప్రతి విషయానికీ కాకున్నా.. కొన్ని ముఖ్యాంశాల

మీద. రెఫరెండం అనగానే.. వాటిపై ఓటింగ్ కోసం యువత కూడా ఉత్సాహం ప్రదర్శిస్తారు. రాజకీయ పార్టీలు గోళ్లు గిల్లుకుంటూ కూర్చోలేవు. కార్యకర్తలు పార్టీ కార్యాలయాలకు పరిమితం కాలేరు. కొంత కదలిక వస్తుంది. ఓటింగ్ ముందు చర్చ అవసరం ఉంటే, విధిగా ఆ సమావేశంలోనూ పాల్గొంటారు. అదేవిధంగా, సాంకేతికత పెరిగినందున.. గ్రామసభలకు రాలేనివారికి ఆన్‌లైన్ ఓటింగ్ ద్వారా రెఫరెండంలో పాల్గొనే అవకాశమివ్వాలి. ఇలా ఏ ఒక్కరూ ఊరిలో గ్రామసభకు గైర్హాజరు కాకుండా చర్యలు తీసుకోవచ్చు.

ఇదేదో రొమాంటిసిజంతో చేస్తున్న చర్చ కాదు. ఈవేళ మహిళా రిజర్వేషన్లు రాబోతున్నాయి, డీలిమిటేషన్‌తో చట్టసభల్లో సీట్లూ పెద్ద సంఖ్యలో పెరుగుతాయి. కుర్చీలు, మైక్‌లు సిద్ధంగా ఉన్నాయి.. కానీ నాయకులు కనిపించటం లేదు. యువత ఎక్కువ ఉన్న దేశం కాబట్టి, ఈవేళ్టి పర్యవసానాలను ఎదుర్కోవలసింది వారే కాబట్టి.. దామాషా ప్రకారం వారికి ఎక్కువ అవకాశాలనివ్వాలి. కానీ ప్రజాస్వామ్య పాఠశాలలైన స్థానిక ప్రభుత్వాలు ఉత్సవ విగ్రహాలుగా రాజ్యాంగ నిర్మాణ దశ నుండి మిగిలిపోవటంతో, ఆర్థిక వ్యవస్థ పాశ్చాత్య నమూనాలో పోటీ, నిరంతర లంబకోణ విస్తరణ పంథాలో ఉండటం, మన దేశానికి ప్రజాస్వామ్య అనుభవం వెయ్యేళ్లుగా లేకపోవటం, 75% దాకా రిజర్వేషన్లున్న స్థానిక ప్రభుత్వాలకు నిధులు, విధులు లేకపోవటంతో.. సామర్థ్యం, దేశభక్తి ఉన్నా కోట్ల మంది యువతకి తగినంత రాజకీయ, పాలనా నాయకత్వ అవగాహన కొరవడుతోంది. రెఫరెండం, ఆన్‌లైన్ ఓటింగ్, సమ్మిళిత ఆర్థికాభివృద్ధికి అవసరమైన నమూనాను గ్రామాలు-చిన్న పట్టణాలు అనుసంధానంతో అనుసరించటం, అభివృద్ధి ఫలితాలు స్పష్టంగా అందరికీ కనిపించేలా కార్యక్రమాల అమలు, నిర్ణయాలపై తర్వాతి గ్రామ సభలో పారదర్శక, జవాబుదారీతనంతో సమీక్ష, వాటికి పర్యవసానాలున్నాయని ప్రజలకు అర్థమవటం, అవసరమైన దిద్దుబాట్లు, వార్డు స్థాయి వరకు రంగాలవారీ ప్రజా కమిటీలతో స్థానిక ప్రభుత్వాల సాధికారత మొదలైన చర్యల్ని కూడా గ్రామసభల సంస్కరణల్లో భాగం చేయటంపై కూడా చర్చించాలి. ✯

## ఓట్ల కొనుగోలుపై చంద్రబాబు బహిరంగ ఒప్పుకోలు..
## ఎన్నికల సంస్కరణల బాధ్యత ప్రజలదా? ప్రభుత్వాలు, పార్టీలదా?

**(22వ పేజీ తరువాయి)**

స్థానిక-రాష్ట్ర-జాతీయ ప్రభుత్వాల బాధ్యతలు అర్థమయ్యాక అప్పుడు జమిలి ఎన్నికలు, ఇంకా మెరుగైన ఎన్నికల వ్యవస్థలు వంటి అంశాలను ఆలోచించవచ్చు.

చంద్రబాబు కేవలం ఎన్‌డీయేలో భాగస్వామి మాత్రమే కాదు, రాజకీయాల్లో, పార్టీ నిర్వహణలో కష్టనష్టాలు తెలిసిన వారు. తెలుగుదేశం సుదీర్ఘకాలం కొనసాగాలని వ్యూహాలు అమలుచేస్తున్నవారు. ప్రధాన జాతీయ ప్రతిపక్షం కాంగ్రెస్ లోనూ పట్టు కలిగినవారు. కాబట్టి, ప్రధాని మోదీతో చర్చించి దామాషా ఎన్నికల పద్ధతి, రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, స్థానిక ప్రభుత్వాల సాధికారత మొదలైన ఎన్నికల, కీలక పాలనా సంస్కరణలపై ఏకాభిప్రాయం సాధించి అమల్లోకి తెచ్చే ప్రయత్నం చేయాలి.

అదేవిధంగా, స్త్రీ శక్తి సమావేశంలో ముఖ్యమంత్రి ఈ మాటలు చెప్పటం కూడా సందర్భోచితంగా ఉంది. త్వరలో మహిళా రిజర్వేషన్లు చట్టసభల్లో అమలవుతున్న సందర్భంలో, ఈవేళ 99.5%పైగా బ్యాంకు రుణాలు తిరిగి చెల్లిస్తూ, ఎన్‌పీయేలు లేకుండా క్రమశిక్షణతో వ్యవహరిస్తున్న సామాన్య, దిగువ మధ్యతరగతి మహిళలు ఎన్నికల్లో గెలవటానికి డబ్బు అవరోధం కాకుండా ఉంటే, వారు రాజ కీయాల్లో, పార్టీల నిర్వహణలో గుణాత్మక మార్పు తెచ్చే అవకాశం ఉంది. కాబట్టి, స్థానిక ప్రభుత్వాల్లో డబ్బు తీసుకోకుండా ఓటేయండి, ప్రజలే ఎన్నికల్లో ఓట్ల కొనుగోలును ఆపాలి అని విజ్ఞప్తి చేస్తే చాలదు. నాణ్యమైన విద్య, సంఘటిత రంగంలో సరైన ఆదాయంలేని మనలాంటి దేశంలో ప్రజలకు అందుకు తగిన వ్యవస్థల్ని నిర్మించటం, ఈ క్రమంలో ఎన్నికల పద్ధతిని మార్చటం ప్రభుత్వాలు, పార్టీల బాధ్యత. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వాలకు సాధికారత కల్పించాలి. పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా పవన్ కళ్యాణ్ కూడా ఇందుకు బాధ్యత తీసుకోవాలి. ఎన్నికల సంస్కరణల కోసం కూడా దేశవ్యాప్త ఏకాభిప్రాయానికి చంద్రబాబు, ఎన్నికల్లో డబ్బు సమస్య ఎదుర్కొంటున్న జనసేన పార్టీ వ్యవస్థాపకులు చొరవ చూపాలి. కాక్రోచ్ జనతా పార్టీ సైతం డిజిటల్ వేదిక మీద యధాలాపంగా వచ్చిన మార్పును ఎన్నికల్లో సాధించగలమని భ్రమపడకుండా, దామాషా, ప్రత్యక్ష ఎన్నికల సంస్కరణల్లో భాగమవ్వాలి. ఎన్నికలు, పార్టీల్లో సంస్కరణలపై లోతైన అధ్యయనంతో రూపొందించిన పరిష్కారాలతో ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా తమవంతు పూర్తి సహకారాన్ని అందిస్తాయి.

✯


LOK SATTA
People Power
హైదరాబాద్ వేగంగా పెరుగుతోంది.
కానీ కొద్ది దూరం ప్రయాణానికే
హైదరాబాదీల
అవస్థలు.
01
బస్సుల్ని రెట్టింపు చేయండి
02
1,000 కిలోమీటర్ల ఫుట్‌పాత్‌లు
03
Single Ticket
అన్నిటికీ ఒకటే టికెట్
04
పార్కింగ్ విధానం, అమలు పార్కింగ్ నిబంధనలు స్పష్టంగా
ఉండటం. ట్రాఫిక్ నిబంధనల్ని కచ్చితంగా అమలు.
MOVE
HYDERABAD
TOGETHER FOR A FASTER COMMUTE
FOUNDATION for DEMOCRATIC REFORMS
FDR
#MoveHyderabad

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th Oct 2026 Posting Date 15 &16th of every month
Posted at BPC-IV Patrika Channel, Nampally, HYDERABAD-500 001




Watch @

https://www.youtube.com/@JPLoksattaOfficial

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS , Hyderabad- 500 082.**
**Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No : CFC-1 and 2, Survey No: 18, E-City, SEZ, General industrial park, Raviryal & Srinagar village, Maheswaram mandal, Rangareddy district-501359, Telangana.**